980
TPLA108B 152
I
760

చిత్రకథామంజరి.

ప్రథమ భాగము.

DIRECTOR OF PUBLIC INSTRUCTION
9 - FEB 1925
MADRAS

నెల్లూరు శ్రీ వెంకటగిరి రాజావారి కళాశా[illegible]

రాయసము వెంకటశివుఁడు గారిచే

రచింపఁబడినది.

రెండవకూర్పు.

1925.

రామా ముద్రాక్షరశాల, ఏలూరు.

సర్వస్వామ్య సంకలితము.]

Inscribed

TO THE

Sacred Memory

OF

Rao Bahadur

K. Viresalingam Pantulu G

of Rajahmundry.

Preface to

The Second Edition.

IN presenting this volume of Stories to the public, I may say that I have retained in this edition only those stories that are original, and have added some more of the same class, so that all these stories represent original fiction. The story in the case of some like the Spotted Tiger and the Serpent King, is built on hints furnished by tradition. Sarada, Leela, Krishnaveni, Balamba, The Best Flower and the Spotted Tiger were contributed, more than twenty years ago, to the **Telugu Zenana Magazine**, of which I was the Editor. The remaining stories have been all written very recently. Nischala appeared last year in the **Pushkarini** of Bezwada. Gauthami was my contribution to the Annual Supplement of the **Andhra Patrika** two years ago. The Serpent King, Manikyam, Malati and the Will o' the Wisp were published in the **Bharati** in 1924.

Though I may say I have written these stories, in a way, to please myself and to give expression to some of my deep convictions and long cherished ideals, it may be stated, at the same time, that I have constantly kept before me, as the main objective of these narratives, the description of different phases of life and thought in the Andhra country. It is for the reader to judge how far I have succeeded in my attempt.

I beleive there is no impropriety in my venturing to inscribe this collection of small stories to the memory of my beloved teacher, the late-lamented Rao Bahadur Mr. K. Veeresalingam Pantulu, the inspirer of many an early ideal and aspiration, both literary and social, which have been dear to me like life itself, and to the dipicting of some of which, these stories are devoted.

My thanks are due to Messrs. D. Subrahmanya Sarma and G. V. Subbaramayya, M.A., of the Nellore College, for their valuable suggestions in regard to some of these stories. I am also grateful for the help received from the Proprietor, **Rama Press, Ellore**, in the printing of this book.

4—1—1935. }
NELLORE. } R. VENKATA SIVUDU.

రెండవ కూర్పునకుఁ బీఠిక.

మొదటి కూర్పునందలి చిత్రకథలలో నిటీవల నే రచించిన కొన్ని కథలను జేర్చి, ఈ కూర్పు సిద్ధముచేసితిని. ఇవి యన్నియును నేను సొంతముగ నల్లిన కథలే. ఐనను, నాగరాజు, మచ్చపులి మొదలగు కొన్ని కథలు, ఆంధ్రదేశమున వాడుకలో నున్న కొన్నిసంగతుల నాధారముగఁ జేసికొని కల్పింపఁ బడినవి. శారద, లీల, కృష్ణవేణి, బాలాంబ, ఉత్తమపుష్పము, మచ్చపులియును, నేను ప్రకటించుచుండిన తెలుఁగు జనానాపత్రికలోఁ బ్రచురింపఁబడినవి. తక్కినకథలన్నియు నే నిటీవల రచియించినవే. నిశ్చల, గత సంవత్సరము బెజవాడయందలి పుష్కరిణీ పత్రికలోఁ బ్రచురింపఁబడెను. గౌతమియనునది, రెండు వత్సరముల క్రిందట ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో ముద్రితమయ్యెను. నాగరాజు, మాణిక్యము, మాలతి, కోఅవిదయ్యములను కథలు, 1924 వ సంవత్సరమున భారతి పత్రికలోఁ బ్రచురింపఁబడినవి.

నాకుఁ బ్రియమగు నాదర్శములను, నిశ్చితాభిప్రాయములను గొన్నిటి ననుసరించి నా యిచ్చవచ్చిన చొప్పననే యీ కథలల్లినను, ఆంధ్రదేశమునందలి జనుల పరిస్థితులను ఊహాపోహాలను అభివర్ణించుటయే ముఖ్యోద్దేశముగఁ గలిగియుంటిని. నాయుద్దేశ మెంతవఱకు సఫలీకృతమయ్యెనో రసజ్ఞులగు పఠితలే గ్రహింతురు గాక.

చిన్ననాఁటనుండియు నాకుఁ బ్రియమగు సాంఘిక సారస్వతాదర్శముల కనేకములకు మూలకారణమగు నా గురూత్తములు, కీర్తిశేషులగు శ్రీ రా. బ. కం. వీరేశలింగము పంతులు గారికి, ఆయాదర్శముల ప్రేరణ చొప్పుననే గల్పింపఁ బడిన యీ కథల పాత్రము నంకితముచేయుచున్నాను.

ఈ కథలలోఁ గొన్నిటి విషయమై నా కెన్నియో యమూల్యమగు సూచనలు చేసిన నెల్లూరు కళాశాలోపన్యాసకులగు మ. రా. రా. శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మ, గుఱ్ఱం సుబ్బరామయ్య ఎమ్. ఏ. గార్లెంతయు వందసీయులు. ఈ పుస్తక ప్రచురణము విషయమై తోడ్పడిన శ్రీరామా ముద్రాక్షరశాలాధిగారి కెంతయు కృతజ్ఞుఁడను.

4--1--1925
నెల్లూరు.

ఇట్లు.
రా. వెంకటశివుఁడు.

CONTENTS.

విషయసూచిక.

కథ.		మొదలు.	వఱకు.
1. శారద.	...	1	15
2. లీల.	...	16	34
3. కృష్ణవేణి.	...	35	71
4. బాలాంబ.	...	71	83
5. ఉత్తమపుష్పము.	...	84	85
6. గౌతమి.	...	85	93
7. కొఱవిదయ్యము.	...	93	99
8. నాగరాజు.	...	100	105
9. మాణిక్యము.	...	105	117
10. మాలతి.	...	118	128
11. మచ్చపులి.	...	129	142
12. నిశ్చల.	...	142	150

చిత్రకథామంజరి.

ప్రథమభాగము.

శారద.

౧ వ - ప్రకరణము.

"సీ. పేర్వేరబొమ్మల పెండ్లిండ్లు సేయుచు
నబలలతోడ వియ్యంబులందు
గుజ్జెనగూళ్ళను గోమరొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువుమెఱసి"

—రుక్మిణీకల్యాణము.

గోదావరిమండలములోని సుందరమగు గ్రామములలోఁ జింతలపల్లి గ్రామము ముఖ్యమైనదని చెప్పవచ్చును. పట్టణముతో సమానమగు విస్తీర్ణమును, జనబాహుళ్యమునుగల పెద్దగ్రామము కాకపోయినను, చింతలపల్లి పల్లెటూరున నుండవలసిన సౌఖ్యములు గలిగియుండెను. దూరమునుండి చూచువారికా పట్టణము కల్పవృక్షాది తరువులతో శోభిల్లుచుండు నందనవనమువలెఁ గానిపించును. గ్రామముచుట్టును మామిడిచెట్లు, తాటిచెట్లు, చింతచెట్లును గుబురుగాఁ బెరిఁగి, సూర్యరశ్మియొక్క తీక్ష్ణత నడగించి, గ్రామవాసులకెంతో చల్లదనము నొసఁగుచున్నవి. పూర్వకాలమునుండియుఁ జింతచెట్లా గ్రామమున నసంఖ్యముగా నుండి వర్ధిలుచుండుట చేతనే, గ్రామమునకుఁ జింతలపల్లియను నామముగలిగెనని చెప్పుదురు. ఇది సత్యమైనను గాకపోయినను, ఒకటిమాత్రము నిశ్చయము. అచ్చటి భూమి చింతలు మొదలగు వృక్షములు పెరిఁగి, చిరకాలము జీవించియుండుట కనువైయున్నది. వందలకొలఁది యేండ్లనుండి

యుండి, యిప్పుడు కాఁపులేక వార్ధకదశలోనుండియును, జీవితము నందలి యాశయింకను వీడకున్న పెద్దపెద్ద వృక్షములచ్చటఁ గానవచ్చుచున్నవి. ఆ చెట్ల విత్తనములే పడి, మొలచి, యిప్పుడు బాల్యాదిదశ లనుభవించుచున్న వేలువేలు వయస్సులు గల చెట్లచటఁ గానఁబడను. ఆచెట్లలోఁ బెద్దవానినిఁ దమ నివాసస్థలములుగఁ జేసికొని కాకులును, లేఁతచెట్లచిగుళ్ళను, ఫలములను నాహారములుగఁ జేసికొని వివిధములగు పక్షిజాతులును మర్కటము లును, గానఁబడుచుండును. ఇట్టి పక్షుల కోలాహలమును జెట్లక్రింది కాటపాటలకు వచ్చుపిల్లల ధ్వనులును, గలసి, యొక పెద్దరొదయై యా గ్రామవాసులకర్ణములను నిరతము నాశ్రయించియుండును. ఎప్పు డును వినవచ్చు శబ్దములేయగుటచేత, నాజానపదులు వానిని వినని వారివలెనే యుందురుగాని, యితర ప్రదేశములనుండి యచటికివచ్చు వారికి మాత్రము రొదకొంత చోద్యముగనుండి సంతోషమును జనింపఁ జేయుచుండును.

మనకథానాయికయగు శారద పుట్టినిల్లీగ్రామమే. శారద తలి దండ్రులు, తమకుదైవమిడిన దాని ననుభవించి, తనివిఁ జెందియుండు సద్బ్రాహ్మణ వంశమువారు లేకలేక కలిగిన యేక సంతానమగుట చేత, జననీజనకులు శారద నెంతో గారాబముతోఁ బెనుచుచుండిరి. చిన్ననాఁడా బాలిక చేయువిద్దెములును, పలుకు ముద్దుపల్కులును, వారి మనసున కపరిమితానంద మొసఁగెను. ఇట్లు పెరుగుచున్న శార దకిపుడు పదియవసంవత్సరము వచ్చెను శారద తనతోడి బాలికల తోఁగూడి యాటపాటల యందు వినోదించుచుండును. ప్రాతఃకాలము నలేచి, సమానవయస్సుగల బాలికలతోఁ గలసి. శారద తోఁటలలో నికిఁబోయి, యచటిపండుటాకులను, ఫలాదులను గూర్చుచుండును. వసంతకాలమునందెంతో శ్రావ్యముగఁ గూయుకోకిల పలుకుల నాలా

లికానసముదాయమనుకరించుచుండును. తన పిల్లను దగ్గఱకుఁదీసికొని, దానికిఁ దీయని పాలనిచ్చుచుండు తల్లికోఁతి నాబాలలు పుల్కు-పుల్కుమని చూచుచు నానందించుచుందురు. ఎప్పటికిని సాంతముగా నట్లుండు వేసవికాలపు దినములందా గ్రామమునందలి బాలికలు, ఒకనిశ్శబ్దమగు తావునఁజేరి, కొంచెము మఱుఁగేర్పరచుకొని, అటకై దానిని తమగృహమనుకొనుచు, అందుఁదమ చిన్నిచేతులతో గృహకృత్యములను జేయఁజొత్తురు. కొంచెము నిప్పుచేసి, పెద్ద పెద్ద వగు చింతగుల్లలు తెచ్చి, వానిలోఁ నీరుపోసి యెసరు పెట్టి, కొంచెము బియ్యపుగింజలువేసి, గుజ్జెనగూళ్లు వండుకొందురు. ఈగుల్లలతో నిట్లే వారు 'చారు' మొదలగు వానిని సిద్ధముచేయుచుందురు. శారద చెలికత్తెలలోఁ గొందఱిట్లు వంటచేయుచుండు నప్పుడు, తక్కినవారు, ఇల్లు పరిశుభ్రముచేయుట, ఫలములను దెచ్చుట, మొదలగు తక్కిన వ్యాపారములలో నుందురు. వెన్నెల రాత్రులలో శారద పెందలకడనే యన్నముఁదిని, తన చిన్ని చెలికత్తెలతో వాకిటఁ దిన్నెమీఁదఁ గూర్చుండి, "కాళ్లాగజ్జి", మొదలగు నాటలాడుకొనుచుండును. పెద్దవారు చెప్పు కథలు వినుచుఁ, జెలికత్తెలతోఁ దమ స్నేహమును గుఱించిన మాటలనుజెప్పుకొనుచు, శారద యట్టె నిదురించుచుండును. కాని యిట్టి వినోదములకంటె శారదకు, బొమ్మలాటలు ప్రియతరముగ నుండును. చుట్టుపట్టుల జరుగు "తీర్థముల" లోఁ దండ్రి తనకుఁ గొనిపెట్టుచుండు చందనపు బొమ్మలను, శారద, ఎప్పుడును దనయొద్ద నుంచుకొని, చేతన పదార్థములనియే వానిని భావించి ప్రేమించుచుండును! వాని కనుదినమును నీళ్లుపోయుచును, వానికిఁ గట్టఁబెట్టు చిన్న పేలికల నుదుకుచును, వానికి ఫలాహారములను పెట్టుచును నుండును! శారదయును జెలికత్తెలును గొన్ని సమయములందుఁ దమబొమ్మలకుఁ బెండ్లిండ్లు చేయుచుందురు. ఆదినములలో నూరిలోనుండు పిల్లలందఱు నెంతో యుత్సాహముతో

నుందురు. శారద సాధారణముగఁ బెండ్లికుమారునికిఁ దల్లిగను, నామెకుఁ బ్రియురాలగు మీనాక్షి పెండ్లికూఁతుని తల్లిగను నుందురు. బొమ్మల పెండ్లిండ్ల సందడిలోఁబడి, శారదయును జెలికత్తెలును, ఒక్కొక్కప్పుడు తమ భోజనముల సంగతి గూడ మఱచుచుందురు! పాలకి మోయుటకు, గ్రామములోని బాలురెంతో కుతూహలముతో నుందురు. ఇట్టి యుత్సాహములలోను, వినోదములలోను, శారద బాల్యదశ యట్టె గడచిపోయెను.

౨వ-ప్రకరణము.

క. భూతలనాథుఁడు రాముఁడు
ప్రీతుండై పెండ్లియాడెఁ బృథుగుణమణిసం
ఘాతన్ భాగ్యోపేతన్
సీతన్ ముఖకాంతి విజితసితఖద్యోతన్.

—శ్రీరామచరిత్రము.

ఒకనాటియుదయమున,మీనాక్షి మొదలగు తనచెలికత్తెలతోఁ గూడి శారద దాఁగుడుమూఁతలాడుకొనుచుండెను. ఎందఱుపట్టుపడినను, శారదమాత్రముదొరకకుండెను. ఎంతో యుత్సాహముతోనున్న శారదచెవులకపుడు ,, శారదా ! ఇఁకరమ్ము! '' అను పలుకులు వినఁబడెను. తానుబట్టుపడితినని చెలులెవరో గేలిచేయుచున్నారనియెంచి, మొదట శారద, " నేను కాదు. నేనురాను''అనిప్రత్యుత్తరమిచ్చెను. కాని, తననురమ్మని పిలిచినవారు తనతండ్రియేయని కనుగొనినప్పుడు, శారద, కొంతయుత్సాహము తగ్గియుండినను, జనకునిమాట జవదాఁటకుండునదిగావున, ఆయనవెంటనే యింటికిఁబోసాగెను. తననుజూచుటకుఁ జుట్టములెవరో వచ్చిరని తండ్రిచెప్పఁగా, శారదమిక్కిలి సంతోషించెను. బంధువులెవరైనఁ దమయింటికి వచ్చినప్పుడు, తనకు ,,మి

కాయి" మొదలగు రుచ్యములగు పదార్థములు తెచ్చియిచ్చుచుండు టచేత నిపుడెవరో చుట్టములు వచ్చిరను మాటవిని శారదమిక్కిలి యానందించెను.

ఇంటికివచ్చి చూచుసరికి, శారదకన్నుల కామెకుఁ దెలియని యెవరో యిద్దఱు పురుషుల యాకారములుగానవచ్చెను. క్రొత్తమనుష్యులగుటచేత వారిని శారద బెదరుచుఁజూడ సాగెను. తండ్రియామెను వారిదగ్గఱకుఁ గొనిపోయి, "అమ్మా మామగారిని జూడుము" అని పలుకఁగా నాబాలిక, తానదివఱ కెన్నఁడును జూడని నడివయస్సులోనున్న యొకపురుషుని ముఖమువైపునకుఁ దనకన్నులను ద్రిప్పెను. అంతనా పురుషుఁడా బాలికను వీక్షించి, "చిలుకవలెనున్నది! ఈ పెద్దకన్ను లదృష్టసూచకములు. ఇంతకును దైవసంకల్పమెటు లున్నదో!" అని పలికెను. ఆయనతోనున్న రెండవ పురుషుఁడు, "వేయిమాటలేల? మీపుత్రుఁడగు పురుషోత్తముని పాలిటి భాగ్యదేవతయే యీబాలికా రూపమున మూర్తిభవించెనని చెప్పవచ్చును. అన్నగారూ! ఇఁక నేతదేహించెదరేమి? మీపిల్లవాని విద్యవలెనే, దీనిసౌందర్యమును శోభిల్లుచున్నది. ఇట్టి చక్కని బాలిక, మనయిండ్లలో నెచటను గానరాదు!" అని పలికెను.

ఆమాటల యర్థమంతగాఁ దెలియక యూరక చూచుచుండు శారద నా పురుషులిద్దఱును, "ఇఁక నీవు ఆడుకొనుటకు వెళ్ళుమమ్మా!" యని చెప్పిరి. పంజరమునుండి తప్పించుకొనిన చిలుకవలె శారద యట్టెపరుగిడి, యాటలోనుండు చెలికత్తెలను గలసికొనెను.

ఆసాయంకాలమె, యూరిలోని నీలాటిరేవు దగ్గఱఁ జేరిన యమ్మలక్కలు, "శారదకు సంబంధమువచ్చిన దమ్మా" యనియును, "వివాహము నిశ్చయమైనదమ్మా" యనియును జెప్పుకొనసాగిరి. తన పెండ్లిజరుగునని తెలిసినప్పుడు, శారద లేఁత హృదయమున కొక్కింత

సంతసమును, గొంతభయమును గలిగెను. కాని పెండ్లి యనఁగా, „ బాజాలును " „ బూరెలతో భోజనములును " మాత్రమె యని చెలికత్తెలు చెప్పుకొనుచుండునప్పుడు, శారద ముఖపద్మమధికానంద ముతో వికసింపఁ జొచ్చెను.

---

3. వ-ప్రకరణము.

గీ. పడుచుపంపుమన్న పలుకుచేఁ జెవిగ్రాఁగె
గుండెపగిలె దిగులు నిండెమిగులఁ
గలఁగెడెంద మేటుగాఁ బాఱె కన్నీరు
కన్నతల్లినెనరుగాననయ్యె.

—పాంచాలీ పరిణయము.

శారద పెండ్లియంతట మహావిభవముతో జరిగెను. కాని, యేలయోగాని, వివాహదినమునుండియే పెండ్లికూఁతురు బంధువులతో క్రొత్తబంధువులకుఁ బోరాట మారంభమయ్యెను. శారద సౌందర్య మును గుఱించి యెవరైనఁ బ్రస్తావించినపుడు, ఆమె యత్తయును, నాడుబిడ్డలును సంతసించుటకు మాఱుగా, „ తెల్లముఖము ’’ అని యును, „ బెదరుచూపులపిల్ల యనియును, „ వేశ్యబాలిక ’’ యని యును శారదను గేలిసేయుచుందురు! పాపము, వారిమాటల యర్థము పూర్తిగాఁ దెలియని శారదమాత్రము, అత్తవైపువారిట్టి పలుకులు పలుకుటలో కాచారము గాఁబోలునని యూహించి, తానుగూడఁజెఱు నగవునగుచుండును.

దేశాచారము ననుసరించి, శారదచేఁ దల్లి నోములుపట్టించెను. సాయంకాలమగువఱకు నూరఁగల పూవులను దెచ్చి „ మోచేటిపద్మ ము’’ నోచుకొనుటకు శారద కెంతోసంతోషముగనుండును. „మూఁ గనోము,, పట్టి, రాత్రి శారదపల్లెరములోఁ గుంకుమమును నక్షత్ర లును నుంచుకొని, పేరంటాండ్రకు కవియిచ్చుటకై, చుట్టుపట్టులనుం

ను నిండ్లకుఁ బోవునప్పుడు, చెలికత్తెలును, గొంటెపిల్లవాండ్రును, „ ఏమిశారదా! మగనినిఁజూచుకొనిన మురిపెమాయిది? బొత్తిగామాటాడకున్నావేమి ? " యనిపలుకుచు, నెట్లైన నామెను నవ్వించి మాటాడింపఁజూతురు ! శారదయును, జెలులును, సంక్రాంతి దినములలో బొమ్మలనోము పట్టుచుందురు. పట్టుచీరఁ గట్టుకొని, యను దినమును వేఱువేఱుగ వంటకములనెంతో యోపికతోఁజేసి తల్లి తన కీయఁగా, వానినిఁదీసికొని, శారద, బొమ్మలు నిలిపిన యింటికిఁజని, బొమ్మలకు నైవేద్యమును బెట్టును. బొమ్మలను „వాలాడించు" దినములలో గ్రామమంతయు నమితోత్సాహముతో నుండును. ముందు వాద్యములు మ్రోఁగుచుండఁగా, నోముపట్టిన స్త్రీలును బాలికలును గూడి, బొమ్మలను, బెరుఁగులో నానఁబెట్టిన యటుకులను, దమపళ్లెములందుంచుకొని, యస్తమింపఁబోవు సూర్యుని యెఱ్ఱని కిరణములు తాము ధరించిన రంగువస్త్రములకును, దమ సుందరాంగకములకును, నూతనసౌందర్యమును దెచ్చిపెట్టుచుండఁగా, తక్కిన పుణ్యస్త్రీలతోను, బిల్లలతోను గలసి, మెల్లఁగనూరేఁగిపోదురు. అంతట వారా బొమ్మలను నీటఁగలిపి, తాము తెచ్చిన యటుకుల నందఱికిఁ బంచియిచ్చి, తాము కొంచెము భుజించి, విడిదిలోనికిఁ బోయి, యచట మంగళహారతులు మొదలగు పాటలు పాడి, తమతమయిండ్లకుఁబోయెదరు.

ఇట్టి వినోదములగు నోములు పట్టుచుండు యౌవనవతియగు శారద యిప్పుడత్తవారింటికిఁబోవలసి వచ్చెను. కొమార్తె నత్తవారింటికిఁ బంపుట తలిదండ్రుల కెంతో కష్టముగ నుండెను. ప్రతి హిందూ బాలికకును విషాదకరమగు నీ సంగతి, ప్రపంచము నెఱుఁగని శారదకు మఱింత దుఃఖావహముగ నుండెను. తల్లి మొదలగు వారియందుఁ గల ప్రేమబంధము నొక్కసారిగఁ ద్రోసివైచి, తా నెఱుఁగని యన్య కుటుంబములోని వారిమీఁదికిఁ దమ హృదయ

మును మఱలింపఁ జేసికొనుట బాలప్రాయమున నుండువారి కెంత కష్టముగ నుండును! దీనికిఁదోడుగా, లేఁతవయస్సుననుండు తమ కోడలు, ఆకుమఱుఁగు పిందె వంటిదని యెంచి, శారదను మఱింత మృదుత్వముతోఁ జూచుటకు బదులుగా, ఆమెకు లేనిపోని పేరులు పెట్టి, యాఁడుబిడ్డలు, హింసింపఁ జొచ్చిరి! వారి మాటల కూరకుండు నప్పుడు శారదనువారు „మిక్కిలి గడుసుపిల్ల" యనియును, నోరు మెదపఁజూచినప్పుడు „ మాటకారి " యనియును బలుకుచుందురు! అనుభవశాలినియైన యత్తయును దన పుత్త్రికలను వారింపక, తన కోడలినే , ఏమే! అప్పుడె యాఁడుబిడ్డలతోఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచున్నావా ? " యనును !

---

౨ వ-ప్రకరణము.

మ. అకటా ! నేఁమనిదూఱుదానమిమునాథా ! వేగుజామయ్యెఁబొం
దికగాఁ బాదములొత్తిరమ్మనుటగానీ, యొంటియేమోకదా
నికటక్షోణికి నేగుదెమ్మనుటగానీ, కొంతనెయ్యంపుఁజూ
నికతోఁ గన్నులు విచ్చి చూచుటయె కానీ లేదయొక్కింతయున్.

—కళాపూర్ణోదయము.

శారదకుఁగల యిక్కట్టులింతియె కాదు. తల్లిచాటుననుండి వచ్చిన యాబాలకందఱును గంటకములవలెఁగానఁబడిరి. చిన్నచిన్నతప్పులకే యత్తయామెమీఁద నలుకవహించుచువచ్చెను. ఆఁడుబిడ్డలు పరిహాసించుచుందురు. విద్యావంతుఁడనియు, గుణవంతుఁడనియు నంపఱి చేఁ బొగడ్తల నందినపతిగూడ నామెయం దాగ్రహముగలిగి యుండెను. "నిర్గంధకుసుమమా" యని శారదనాతఁడు పిలుచుచుండును. ఇట్లిందఱికిఁ దా ననిష్టముగ నుండుటకుఁగారణమేమోయని శారద బాగుగ నాలోచింపఁజొచ్చెను. తనకార్యములందును, బలుకులందునుమిక్కి-

లిజాగరూకత గలిగియుండెను. కాని యెటులుండినను, ఆమె తనవారి దయనుగాంచ నేరకుండెను. ఇంటివారి మెప్పునొంద నేరకున్నను, శారదమాత్ర మిరుగుపొరుగువారి జాలికిఁ బాత్రమయ్యెను. వారామె సుగుణములను మెచ్చుకొనసాగిరి. సమానవయస్సుగల సుందరులామెతో స్నేహముచేసిరి. వారితోడి సంభాషణముల వలన, సాధారణముగఁ బ్రతియింటను, అత్తయు నాడుబిడ్డలును గ్రొత్తకోడలితోఁ బోరుచుందురని శారద తెలిసికొనెను. కాని పురుషోత్తమునికి భార్యమీఁదఁగల నిర్దయత్వమునకు మాత్రము వారికంతగాఁ గారణముగానరాకుండెను. తనవారికొండెములకుఁ జెవియొగ్గియే భార్యమీఁద నిట్టియలుకవహించినాఁ డనుకొనుటకుఁగూడవీలులేకుండెను. ఏలయనఁగాఁ బురుషోత్తమునికిఁగల గుణము లెటువంటివైనను, అతఁడుమాత్రము, తనయుద్యోగపుపనులతోను, తనపుస్తకములతోనుగాలముఁ బుచ్చుచు మితభాషిత్వము గలిగియుండును. కావున వానిమనస్సును దెలిసికొని, యనుకూలవతిగాఁ దానుబ్రవర్తింప నుద్యమించి, శారద సమయము వేచియుండెను.

ఒకనాటిరాత్రి పురుషోత్తముని ముఖకమలమానందముతో వికసించియుండుటఁజూచి, శయనగృహమున శారద, మెల్లగఁదనమృదుహస్తములతో వీవనతో విసరుచు, నాఁడాయనగాంచిన సంతోషమునకు విషయమేమని యడిగెను. నాఁడుజరిగిన ముచ్చటలన్నియు నతఁడు సతితోఁజెప్పెను. భర్తతోడి ప్రసంగమువలనఁదాను గ్రహింపఁగోరిన యొకటిరెండు ముఖ్యములగు సంగతులు శారద గనుగొనఁగలిగెను. వానినిఁబట్టి, విద్యావంతుఁడగు తనభర్తకు, స్త్రీవిద్యయు బరోపకారమును, ప్రియములగు విషయములని శారద గ్రహించె కాని యిట్లు గ్రహించుటవలని లాభమేమి ? బాగుగ నాలో కొలఁదిని శారదకిట్లు తోఁచెను: తాను పతి యనురాగ మసం నుద్యమించినయెడల, నాతనికిఁ బ్రియములగు నీరెండు విష

లందును దానుగూడ నభిమానముగాంచి యుండవలయును. అనఁగాఁ దాను గొంతవఱకు విద్యనేర్చి, ఘనకార్య నిర్వాహకత్వమునందు నాథునికిఁ జేయూఁతయై నిలువవలయును. కావునఁ దన నిర్ధారణ చొప్పున నాచరించుటకామె యారంభించెను.

సాహసమునందు స్త్రీని మించినవా రెవరును నుండరు. అజ్ఞానలై, మూఢాచార ప్రబోధితలై, హిందూకాంతలు నూతనసద్విషయములందు ముందడుగిడుట కోపక, మీఁదుమిక్కిలి భర్తల నట్టి విషయములనుండి మరలింపఁ జూతురని లోకులెంచెదరుగాని, వారి యభిప్రాయమంతగా సరియైనదిగాదు. కన్నులుమూసికొని త్రాగుమని పాలపాత్రయిచ్చినను, ఎవరు సందేహింపకుందురు ? ఒక కార్యము, మంచిదనియును, పవిత్రమైనదనియును, విధ్యుక్తమైనదనియును, హిందూమానినులు మనసారగ్రహించిరేని, యిఁకనట్టి సత్కార్యము నెఱవేఱినదే. ఆ వేసవిదినములు గడచిపోయి, యిప్పుడు వర్షాకాల మాసన్నమయ్యెను. ఒకనాఁటిరాత్రి శారద, చిఱునగవుతో సొంపెసలారు తనచెక్కుటద్దములు దీపపుకాంతిచే మఱింత మెఱయుచుండఁగా, శయ్యమీఁద నపుడె మేనుచేర్చిన పతిమీఁదఁ బూవువలెఁ గోమలమగు తన హస్తమునుంచి, " ఏమీ ! అప్పుడె నిదురింపవలయునా ? మంచిసంగతులేమైన మీ భృత్యురాలికిఁ జెప్పరా ? " యని మెల్లఁగ ననెను. కొంచెము కోపమును, గొంచెము సంతోషమును సూచించు కన్నుగవతోఁ బురుషోత్తముఁడు, " మూఢత్వములోఁ జెరలాడుచుండు నిరక్షరకుక్షులు గ్రహింపఁగలుగు మంచిసంగతులు లేవిగలవు? " అని యామెను గేలిచేసెను. శారద యపుడు " అంధకారముననుండు వారేగదా దీపపుకాంతికొఱకై పరితపించుచుందురు. ముండ్లలోనుండి మగ్గుడ్డివానినిఁజూచినవ్వువారేగానఁబడెదరుగాని, వానినిఁ జక్కని తోఁ ప్రవేశపెట్టుటకెవ్వరునుబూనరు! " అని బదులుపలికెను. ఆ మాటల యర్థము తననెత్తిపొడుచుటయే యని గ్రహించిన పురు

షో _త్తముఁడు కోపముతోఁ దనప్రక్కమీఁదఁ బడియుండిన యొక యాంధవార్తాపత్రికనట్టె తీసి, అది యామె మీఁదవైచి, "అక్షరజ్ఞానము లేని నీకిది చదువుట యెంతయసాధ్యమో, నిన్నుమంచిదానినిఁ జేయింపఁ నాకును నంత యసాధ్యముగ నున్నది!" అని నుడివెను.

---

౫. వ-ప్రకరణము.

చ. వరునకు నెద్దియింపది సువ ర్తనగాఁగఁ దదప్రియం బస
చ్చరితముగాఁగ నెన్నదు నిసర్గము నాకిది మానరాద యా
శ్వరుఁడును వేదముల్ గురుఁడు సర్వము భ ర్తయయేఁదదాజ్ఞ సు
స్థిరమతిఁజేయుచుల్ విధినిషేధము లెవ్వియుఁ గైకొనందుదిల్.

—శశాపూర్ణోదయము.

ఆగ్రహముతోఁ బతి తనమీఁదఁ బడవైచిన వార్తాపత్రికను శారద తీసికొని, దీపముదగ్గఱకుఁబోయి, మెల్లఁగఁ జదువ మొదలు వెట్టెను. ఏమి! చదువ మొదలుపెట్టినదని చెప్పితిమా ? ఔనౌను. మొదట నేమియు నెఱుఁగనిదానివలె నారంభించి, శారద యంతటఁ గ్రమక్రమముగాఁదాఁ జదువుచున్న విషయములను గ్రహించుచుఁ జక్కఁగఁ జదివెను! అక్షరజ్ఞానములేని తనభార్య వార్తాపత్రిక బాగుగ నెట్లు చదువుచున్నదాయని పురుషో _త్తముఁ డాశ్చర్యపడ సాగెను. "మాధవనితా" యని తనచేఁబలుమారు పిలువఁబడుచు, విద్య నేర్వవలసిన బాల్యమును బల్లెటూరిలోని యాట పాటలలోఁ గడపి, యిప్పుడు తమ యింటికివచ్చిన యాసుదతికి వాచక మెట్లు సాధ్యమైనది? "నిర్గంధకుసుమమునకు" బొండుమల్లియలతావి యెట్లు సమకూరెను ? విద్యాధికతయును, నూతన సదభిప్రాయములును గల తనకు విద్యానాగరికత లించుకయు లేకుండునట్టి యీ భార్య యొక గొప్ప శిక్షగాఁ బ్రాప్తించెనని యిదివఱకుఁ దలపోయుచుండు పురు

షోత్తమున కిప్పుడు, దీపపువెలుఁగున శ్రవణసుఖముగాఁ జదువుచుండు శారద శారదాదేవివలెఁ గానిపించెను! అత్యాశ్చర్యము చేతను, నానందముచేతను, గలవరపడిన హృదయముగల పురుషోత్తముఁడంతఁ బడకనుండి దిగ్గునలేచి, యిదియంతయు స్వప్నమాయని యనుకొనఁ జొచ్చెను. భార్యపలుకు లాతని చెవులకతి స్పష్టముగ వినవచ్చుచుండెను. తాను జాగ్రదవస్థయందే యుండినట్లాతఁడు తెలిసికొని, భార్యను దగ్గఱకురమ్మని పిలిచి, యామె చదువ నెప్పు డెట్లు నేర్చినదో యడిగెను.

శారద యపుడు, ,, ఏమని చెప్పవలయును ? స్త్రీ విద్యాభిమానులును, బరోపకార పారీణులును నగు మీదయవలననే నాకుఁ జదువు పట్టుపడినది. నా కదివఱకు బొత్తిగాఁ జదువు రానే రాదు!'' అనెను.

ఆమె విద్యాపోషణము విషయమున నేమి సాహాయ్యమును జేయక, యూరక వ్యర్థపు కోరికలయందే కాలముఁ బుచ్చుచుండు తన నీమాటలవలన భార్య గేలిచేయుచున్నదని గ్రహించి, పురుషోత్తముఁడామెను బుజ్జగించి, మాటలవలనఁ బ్రయోజనము లేదని గ్రహించి, కార్యసాధనముఁ జేయ సాహసించి, ,, నీవు విద్య నేర్వఁబూనితివి ! నీ సాహసము మిగులఁ గొనియాడఁ దగినది. ఈ విషయమున నీవుపడిన కష్టములను వినఁగోరెదను! '' అని పలికెను.

అంతట శారద, తనవిద్యాభ్యాస వృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినట్లుగఁబతితోఁజెప్పెను. తానువిద్యనేర్చి, పతి యనురాగముఁ గాంచెదఁగాకయనిపూని, తనచెలికత్తెలలోనొకతె సాహాయ్యమువలన నక్షరాభ్యాసముఁజేయుటయుఁ,బగటిపూట, పురుషోత్తముఁడుద్యోగస్థానమునకు వెడలిపోయినప్పటినుండియు నెంతో శ్రమకోర్చియక్షరములుదిద్ది, చదువుచుండుటయుఁ, దనపట్టుదలచేత శీఘ్రముగనే చదువను వ్రాయను దానునేర్చుటయు, కోడలు దిగ్గఱ నొక పలకయు,

ప్రాఁతపుల్లయు నుంచుకొని, పుస్తకముఁజూచుకొనుట యత్తకుబొత్తిగ నిష్టము లేకుండుటయుఁ, జదువవలదని యాఁడుబిడ్డలు తనను హేళనముచేయుచుండుటయు, విద్య నభ్యసించి పతినిఁ దనవలలో వైచి కొని, యిఁకఁ దన కోడలు, అత్తమామలను లెక్కసేయదని యత్త చాటుచుండుటయు,- మొదలుగాఁగల తన విద్యాభ్యాసపు వృత్తాంతమంతయు శారద పతికి విన్నవించెను!

---

౬. వ-ప్రకరణము.

తే. గీ. అతనిగేహిని భాగాంబ యవనిఁ బొల్చు
సతుల గుణముల నలయరుంధతినిఁ బోలి
సురభికీర్తులఁ జుట్టాల సురభియగుచు
పతిహితాచార శీలసౌభాగ్యశీల.

—ఘటికాచలమాహాత్మ్యము.

తనయనుగ్రహమునుగోరి, తానునిర్వర్తింపఁ బూనిన ఘనకార్యముల యందుఁదనకుఁదోడుపడనిశ్చయించి, బంధువులు పెట్టిన కడగండ్లనెల్ల సహించి, విద్యాస్వీకారముఁజేయఁబూనిన భార్యముఖకమలమపుడు పురుషోత్తమునికి, వెనుకటికంటె వేయిమడుఁగు లెక్కువ సౌందర్యముతో వెలుగొందుచున్నట్లుగానఁబడెను. పురుషోత్తముఁడప్పటినుండియు, విద్యయందెంతో యభిలాషగల తన సతి కనుదినమును సువిద్యాబోధనముఁ జేయుచు, నామె యందు మిక్కిలి ప్రేమగౌరవములు గలిగియుండెను. తనకుఁ దెలియని యనేక సంగతులను భర్త వలన గ్రహించి, శారద, తన బుద్ధిని జ్ఞానమును బెంపొందించుకొనుచుండెను.

విద్యావతియగు భార్యమీఁదఁ బురుషోత్తముని కెంతయుఁ బ్రేమకుదురుట, శారదయత్తకును నాఁడుబిడ్డలకును మిగుల కష్టముగ నుండెను. వారికి శారదయెడఁ జూపోపమి యెక్కువయయ్యెను. ఆమె

మీఁద వారులేనిపోని నిందలను మోపుచు, వట్టి తప్పుల నారోపించు
చునుండిరి. కాని, సుశీలయగు శారద సామాన్యస్త్రీలవలెగృహకల్లో
లములను భర్తకుఁజెప్పి, యింటనుండు వారిమీఁద నాతని కనిష్టముఁ
బుట్టింపఁబూనక, తనవారుతన్ను భూషించినను, దూషించినను, ఏకరీ
తిగనే వారిని గౌరవించుచు, భర్తదగ్గఱ నింటి సమాచారములను
ప్రస్తావింపక, తన విద్యాభివృద్ధిని మాత్రము గావించుకొనుచుండెను.
జలముపోసి పెంచినను, గొడ్డలితోఁగొట్టినను, మంచి పరిమళమునే
ప్రసరింపఁజేయు చందన వృక్షమువలె, శారద సర్వదా తమ్ము
గౌరవముతో చూచుచుండుటయు, నామెను ప్రాణసమానముగ
భావించుకొనుచుండు పురుషోత్తమునికిఁగూడఁ దమయందు ప్రేమతగ్గ
కుండుటయును గాంచి, శారద యత్తయు నాఁడుబిడ్డలును పలుమా
రాశ్చర్యమునొందిరి. కావున వారు, శారదయందుఁ దమకు నిర్హేతు
కముగఁ గలిగిన యన్యాయ కంతకంతకు సిగ్గుపడసాగిరి. కాష్ఠములేని
యగ్నివలె విషయములేనివారి యీర్ష్యయుఁ గోపమును శీఘ్రకాలము
లోనే చల్లాఱినవి. శారదయందుఁ గన్పట్టు సుగుణములంత వారిహృద
యముల నాకర్షించెను. కొలఁదికాలములోనే, చూచువారి కమితా
శ్చర్యము గలుగునట్టుగా, శారదను వారందఱు నెంతో ప్రేమింపసా
గిరి! మొదటఁ దమ కన్నులకు సూదులవలెఁ దగిలిన యామెచేతఁబ
ట్టినపుస్తకము లిపుడుమిత్రులమందహాసములవలె వారికానందకరము
లయ్యెను. కర్ణకఠోరములగుచు వచ్చిన శారదపలుకు లిపుడు వారిక
మృతోపమానములయ్యెను. శారదనుజూచినపుడెల్లను బెడమొగము
పెట్టి,యామె వెనువెన్కల గుసగుసలాడుచుండుబంధువులిప్పుడు, తీఱిక
సమయములందు, శారదచుట్టునుగూర్చుండి, యామె చదువు సంగతు
లను విని యానందించు చుందురు. విద్యాగంధము లేక, మీఁదు
మిక్కిలి విద్యనపేక్షించువారిని దూఱుచుండు శారదయాఁడుబిడ్డలు,

క్రమక్రమముగా, తమవదెనయొద్దనే విద్యనభ్యసించిరి. వేయేల? చుట్టు పట్టులనుండు వయసుతీఱిన స్త్రీలే, ,, ఓనమాలు ,, దిద్దనారంభించిరి !

పురుషోత్తముఁడు, తన భార్య సాహాయ్యమువలన ననేక ధర్మకార్యములను జేయఁగలిగెను. న్యాయపథమునుండి యతనినిఁ దొలగింపఁ గలుగు నిక్కట్టులనేకము లాసన్నమయ్యెను. కాని, యట్టి సమయములందు, న్యాయమార్గమును దప్పకుండుమని శారద భర్తకు హితము చెప్పుచుండెను. పురుషోత్తమునికిఁ గలిగిన కీర్తి, భాగ్యము, సౌఖ్యము మొదలగు శుభములకెల్లను శారద సుగుణములే చాల వఱకుఁగారణములై యుండెను.

విద్యావంతులగు పుత్రులను, గుణవతులగు పుత్రికలను గాంచి, శారద యిపుడు పతితో సుఖముగఁ గాఁపురము చేయుచున్నది. వీసుండు పట్టణమున, శారదయను పేరు సర్వశుభలక్షణములకును బర్యాయపదమై యున్నది.

చిత్రకథామంజరి.

లీల.

—దొరసాని దుఃఖము.—

ఘనులని శ్లాఘింపఁబడు పురుషులకంటెను, పెద్దపేరు పెట్టుకొను సమాజములకంటెను, ఏపాపపుణ్యముల నెఱుఁగక తన పాఠములను తాను జక్కఁగఁ జదువుకొనుచుఁ జెలికత్తెలతో నాడుకొనుచు నుండు హిందూబాలికయే వేయిమడుంగు లెక్కువ మంచికార్యములఁ జేయఁగలదని నా యభిప్రాయము. దేశమునకట్టి మహోపకారిణులు గాఁగల చిన్నిబాలికలకు విద్యనేర్పఁబూనిన గురూత్తములు సాధారణముగఁ దమ గొప్పయుద్యమమును మఱచి నీచపుటూహలకు లోనగుచుండుట మిగుల విచారకరము. ఈమధ్య నేను గోదావరీ తీరమునందలి ముకుందపురపు బాలికాపాఠశాలను బరీక్షించుటకుఁ బోతిని. ఆపాఠశాలాధ్యక్షురాలగు కార్నిలియా-మే-యను కాంత, అమెరికాదేశపు స్త్రీ. ఈమె తన దేశమునందలి యొక మతసంఘమువారి కోరికచొప్పున మనదేశీయుల యభివృద్ధికై పాటుపడ నుద్యమించి, కొన్నిసంవత్సరముల క్రిందట హిందూదేశమునకు వచ్చెను. అప్పుడీమె యా గ్రామమున స్థాపించిన హిందూ బాలికాపాఠశాల యిపుడెంతో యభివృద్ధిఁగాంచి యున్నది. ఈవనితారత్నమునకీదేశమున నేబంధువులును లేరు. తాను బూనిన ఘనకార్యమే తన జన్మసాఫల్యమును గావించు పుణ్యకర్మముగను, తనయొద్ద విద్యాకారముఁజేయు బాలికామణులే తన బిడ్డలుగను భావించుచు,

ఈసుదతీమణి దినములు గడపుచున్నది. తనపాఠశాలను వీక్షింపనాకుఁ గుతూహలముగలదని నేను జెప్పినపు డామె మిక్కిలి సంతసించి, యొకదినము నేనుజేయు పరీక్షకు వలయు ప్రయత్నములు చేసెను.

పాఠశాలలోని బాలికలలోఁ బెక్కండ్రు మిక్కిలి తెలివి తేటలును నీతియును గలవారుగ నాకుఁ గానఁబడిరి. దాదాపుగ నందఱును విద్యయందు మిక్కిలి యాసక్తిగలిగి, పాటుపడునట్టి వారుగఁ గానిపించిరి. పరీక్షానంతరము నేను వారిలోఁ గొందఱి కయఁదలఁచుకొనిన కొద్దిబహుమతుల నిచ్చి, పాఠశాలలో నిదివఱకుఁ జదువుకొని వృద్ధిఁగాంచిన బాలలసంగతిఁ దెలిసికొనఁగోరి యట్టిసంగతులను దెల్పుపట్టికఁ జూచితిని. దానిలో మొదటిపేరు ,, లీల '' యని యుండెను. ఇట్టిపేరు సాధారణముగ హిందూబాలికల కుండదుగదా. ఈమె క్రైస్తవ బాలికయని తలంచుచుండఁగా, ఆపేరు దగ్గరనే "శూద్రబాలిక,'' "వయస్సు ౧౦ సంవత్సరములు,'' అని వ్రాయఁబడియుండెను. "ఈ బాలికకిట్టి పేరేల కలిగినది? ఇప్పుడెచట నున్నది?'' యని నేను పాఠశాలాధ్యక్షురాలి నడుగఁగా, కలసి మెలసి యుండునట్టి స్వభావముగల స్త్రీయైనను, ఏలయోగాని యామె నామాట వినకయుండునట్లు గానఁబడెను. కుతూహలము ప్రేరింపఁగా నేను మరలనాసంగతి నేయడిగితిని. అప్పుడా స్త్రీ, చిన్నపోయిన ముఖముతో దీనత్వ ముట్టిపడునట్టుగ నావంకఁ జూచి, సన్నని కన్నీటిబిందువులు నేత్రములఁ గూడుకొనుచుండఁగాఁ ,, మిత్రమా! నా హృదయమును వ్యాకులపఱుచు నీవిషయమును దప్పించి, వేఱొకసంగతిని గుఱించి మనము ప్రస్తావింపలేమా? '' యనెను. నలువదిసంవత్సరముల నడివయస్సులోనుండి, తనను బాధించునట్టి కుటుంబభారము లేవియు లేక, దేహారోగ్యము, చిత్తశాంతి మొదలగు సుఖముల ననుభవించుచున్న యిట్టి స్త్రీకేకష్టము గలిగియుండును? ఇట్టి విదేశపు స్త్రీకి ఈగ్రామవాసినియగు నొక శూద్రబాలిక వలన

నేదుఃఖ మాపాదిల్లి యుండును ? అని నేను మనస్సున నాలోచింప సాగితిని. కాని నాయూహకుఁ దెంపులేనందున నామెను జూచి, "అమ్మా ! మీకు దుఃఖకరమగు నీవిషయము నే తెలిసికొనవలయునని నా కెంతో కుతూహలము గలదు. ఒక్కొక్కప్పుడు మనదుఃఖ మితరులకుఁ జెప్పినపుడు, మనశ్శాంతి మొదలగు లాభములు మనకుఁ గలుగుచుండుటలేదా ?" అని నేనంటిని. అప్పు డామె సోదరభావముతో నన్నుఁ జూచి యిట్లు చెప్పఁదొడంగెను.

— దొరసాని పూర్వపు చరిత్రము —

"మీరడిగిన లీలయను బాలిక చరిత్రమునకును నా జీవితమునకును మిక్కిలి దట్టమగు సంబంధముగలదు. కావున నామెను గుఱించి చెప్పునపుడు, నన్ను గుఱించియు, నా సుఖదుఃఖములను గుఱించియును సందర్భవశమునఁ జెప్పుకొనవలసివచ్చును దీనికి మీరు నన్ను మన్నింపవలయును.

"నేను అమెరికాఖండములో సాంఘికసంస్థానములని పేరుతో నొప్పుచున్న దేశములో దమ నివాస మేర్పఱుచుకొనిన యొక ప్రాఁత యింగ్లీషుకుటుంబములోని దానను. సుగుణాన్వితుఁడగు నా భర్త యాకస్మికముగ సంభవించిన యొక యాపదవలన మరణము నొందెను. యౌవనప్రాయములోనుండిన నా కపుడు గలిగినదుఃఖమును గొంతవఱకు శమింపఁ జేయఁగలిగినది నా ముద్దుల కొమరిత యొక్కతియ దప్ప మఱి యేదియు లేదు. నాకు లోకమంతయు నంధకారబంధురమయ్యెను ; కాని, యాపెనుచీఁకటిలో నాకనులను గొంత సేద దేర్చి, నడచుటకు నాకు మార్గమును జూపించుటకు నా పుత్త్రికయందలి ప్రేమయే మిగులసహకారిణియైనది నాకాపుత్త్రికయే లేనియెడల, నేను మతిచెడి, యేవైద్యశాలనో, కారాగృహమునో బలవన్మరణము నొందియుందును. కాని కరుణాభివగు దైవమే నే స్థితులలోనున్న వారి కాయాయోదార్పులను గలిగించుచుండునుగదా,

నా కొమార్తెను గుఱించియైన నే నీ ప్రపంచమున నుండవలయునని యును, ఆమెకుఁ జెల్లింపవలసిన విధికృత్యముల కొఱకైన నేను దుఃఖమును మ్రింగివైచి తలయెత్తి తిరుగవలయుననియును, నేను నిశ్చయించుకొంటిని.

“ కాని దైవము నాకీమాత్రపు సౌఖ్యమైనను జిరకాలము ప్రసాదింపలేదు. భర్తృవియోగము గలిగిన యాఱునెలలలోనే, నా కొమార్తె జ్వరపీడితయై పరలోకముఁ జెందెను. పరమాత్ముని సన్నిధానమున కేగిన పుణ్యవతిని గుఱించి శోకింపఁగూడదని నే నెన్నిసారులు నా మనసునకు సమాధానము చెప్పినను, దుఃఖ మూఁగకుండెను. నేను దుఃఖించుచున్నానను స్పృహ నాకుఁ గలుగకమునుపే, కన్నీరు వరదలై వచ్చి నన్ను ముంచుచుండును. వెనుకటి యూపదకుఁ గాకపోయినను, ఇప్పుడైనను దప్పక నా మనస్సు చలించి, పిచ్చిదానినిగఁ జేయునని నేను నమ్మితిని.

“ నాదురవస్థఁ జూచి, జాలిగొనిన పరాయూరి మతగురువు, ఒకనాఁడు మా యింటికివచ్చి, నన్నోదార్చుచుఁ జాలసేపు మాటాడెను. తుదకు, నా దుస్థితిని బాగుగ గ్రహించిన యాతఁడు, దేశాంతర గమనముఁ జేసి, పరోపకార కార్యములందు మనస్సును లగ్నముఁ జేసినఁగాని, నా మనస్సునకును నాత్మకును శాంతి రాఁజాలదని చెప్పి, తమ మత సంఘమువారి యాజమాన్యముక్రింద నున్న హిందూదేశములోని యేదియో యొక ప్రదేశమునకుఁ బోయి, క్రైస్తవమత వ్యాపనముఁ జేయుమని నాకు బోధించెను. ఆపద్బాంధవుఁడగునట్టి యా సత్పురుషుఁడు చేసిన బోధను నేను శిరసావహించి, యోడప్రయాణముఁ జేసి, మీ దేశమువచ్చి యీ గ్రామములో నివాస మేర్పఱుచుకొంటిని.

—♦ శూద్రబాలికతోడి పరిచయము. ♦—

“జన్మస్థలమును విడిచి వచ్చిన నేను, ఆశ్చర్యమును గలిగించు నీ క్రొత్తదేశపు ప్రజల యాచారములను గనిపెట్టునపుడును, వారి

భాషను నేర్చుకొనునపుడును, ముందు వారికి నా ప్రియమగు పవిత్ర మతమును బోధించు టెట్లని తలంచునపుడును గలిగిన యలజడిలో, నా వెనుకటి దుఃఖములు మఱచిపోతిని. కొలఁది కాలములోనే నా యాత్మ కెప్పటియారోగ్యసౌఖ్యములు వచ్చెను. ' నిజముగా నాభర్తయును, బుత్రికయును, మరణించిరా ? ' యని నేను సంశయింపఁ దొడఁగితిని! లేదు లేదు; వారు పవిత్రతరమైన ప్రదేశమునకుఁ జనిరనియును, మంచికార్యములు చేయుచు, దైవచింతతో నేను దినములు గడపితినేని, నా బంధువులను గలసికొని, వారితో నపవర్గ సుఖముల ననుభవించెదననియు నా మనస్సు నాకు ధైర్యము చెప్పెను.

" ఒకదినమున నాకుఁ గన్నులపండువుచేయునది యొకటి గాన వచ్చెను. నేను బెరటి వసారాలోని కుర్చీలోఁ గూర్చుండి చొక్కా కుట్టుచుండఁగాఁ, జనిపోయిన నా కొమార్తెనుబోలిన యొక హిందూ బాలిక యాకారము నడచిపోవునట్లు గానఁబడెను. కుట్టుచుండు చొక్కాను జిన్నబల్లమీఁగ నునిచి, నేనుబెరటిలోనికి వచ్చిచూడఁగా, నొక పిల్ల పాలుతెచ్చి, వంటలవాని గదిలోనికిఁ గొనిపోయెను. ఆమె తిరిగి వచ్చువఱకును నే నచటనే గనిపెట్టియుండి, చేతిసైగచేత నా బాలను బిలిచితిని. ఆహా ! అనేక విషయములయందు నా కొమార్తె "లిల్లీ"నిఁబోలిన యా బాలికను జూచినపుడు నా హృదయమునకుఁ గలిగిన సంతోష మేమని చెప్పను ! నా కొమార్తెయే, అమెరికాలోని సమాధిలోనుండి లేచివచ్చినదాయని నే ననుకొనఁ జొచ్చితిని ! నా ముద్దుల కొమరితకువలెనే యీపిల్లకును, నల్లని సోగ కన్నులును, గుండ్రని ముఖమును గలవు. ముఖ్యముగ శరీరకాంతి యందుమాత్రమే భేదము గానిపించెను.

"ఇఁక నీబాలను విడుచుటెట్లు? పుత్రికావియోగ దుఃఖముచే బీడింపఁబడుచున్న నాకీవిధమున నూరటగలిగించుటకే దైవము తప్పక

నన్నీ దూరదేశమునకుఁ గొనివచ్చెనని నే ననుకొంటిని. తనను ముట్టు కొనవలదనియుఁ, దల్లి కోపపడుననియును, ఆపిల్లచెప్పుచు వెనుకఁ దీయుచున్నను, నేను బుత్త్రీమోహముచేత నామె చేయిపట్టుకొని, నా చేరువనున్న చిన్న కుర్చీమీఁదఁ గూర్చుండఁబెట్టి, దుఃఖావేశము చేతఁ గ్రమ్మిన బాష్పజలము కనులనుమాంద్యపఱుపఁగాఁ, బ్రేమాతిశయముచేఁ దొట్రుపడుచుండు చేతులతో నా బాలిక ముఖమును గన్నులను ముంగురులనుదడవుచుంటిని! వలదువలదని వారించుచున్నను బాలిక చిన్న పెదవులను, ముఖమును, జెక్కులను, పలుమారు ముద్దుపెట్టుకొంటిని. పోఁగొట్టుకొనిన ధనరాశిని గనుఁగొనిన పేదవలె, నాహృదయ మాదినమున నా బాలికను జూచి యుప్పొంగెను.—

,,నాకుఁ గలిగిన హృదయపారవశ్యమునందు, ఆబాలిక పరుల బాలికయనియు, వారియింటి కామెను వేగమే పంపివేయవలెనని యును నా మనసునకు గోచరింపలేదు. ఐనను, పోయివచ్చెదనని కొన్ని పర్యాయములు లేచి నిలుచుండిన యా బాలికనుజూచి, తీరని ప్రేమతో నాడెందము తల్లడిల్లుచున్నను, మంచిదని నేనుబలికి, యొక ఫలము నామెకిచ్చి "యిదినీవుతిని, యిచటికి రేపు పాలు తెచ్చినపుడు, ఈలోపలికివచ్చి, నాతోఁ గొంచెముసేపు మాటాడితివా, రెండుపండ్లిచ్చెదనని చెప్పితిని. అంతట నాబాలిక తనయింటికి వెడలిపోయెను.

—♦ శూద్రబాలతోడి స్నేహము. ♦—

,, ఆరాత్రి నా కనులకు నిద్దురరాలేదు. ఒకవేళ భారముచే రెప్పలొకింత వ్రాలినను, వెంటనే ,లిల్లీ'యొక్క సుందరాకారము ముందు గానఁబడినట్లుతోఁచి,దిగాలున లేచి కూర్చుందును! ఎట్టకేలకుఁ దెల్లవాఱెను. కానియెంతసేపు వేచియున్నను, శూద్రబాలిక పాలు తెచ్చుసమయము రాకుండెను. ఆబాలిక వచ్చినతోడనే నాకుఁ దెలియఁజేయుమని వంటలవానికిని, దూరమునఁగానఁబడఁగనే నాకువచ్చి చెప్పుమనిగృహపరిచారకునికిని, నాజ్ఞయిచ్చి, యంతటితోఁదనివితీరక,

ముందలివసారాలో రావేగమె నామెను బొడఁగనుటకై యిటునటు దిరుగుచుంటిని. ఎప్పుడును మన మెక్కువ యాతురతతోఁ గనిపెట్టు చుండుసంగతి వెనకకుఁబోవుచుండుట సహజముగదా! ఆదినము గంట యొకదినమువలెఁ గడుదీర్ఘమైనదిగఁ గానఁబడెను.

„తుద కాబాలిక మెఱయుచుండుపాత్ర తనచిన్నచేతి కొకవిధ మగు నందమిచ్చుచుండఁగా, బెదరిన ముద్దుచూపులతో మెల్లమెల్లఁగ నడుగులిడుచు మాయింటిని సమీపించెను. తోడనే పరిచారకుఁడు పాలపాత్ర దానిచేతులనుండితీసికొని, ‚దొరసాని నిన్నురమ్మనుచున్నది. ఇంటిలోనికిఁ బొమ్మ'ని నాయొద్దకుఁ బంపెను.

„మొదటిదినము భీతితోఁ బలుకకుండిన యీ బాల, రెండవ నాఁడు కొంచెము చనవుగలిగి, నేనడిగిన ప్రశ్నములకు మెల్లని కంఠ స్వరముతోఁ గొన్ని యుత్తరము లిచ్చెను. ఆపిల్లను సంతోషపఱుచు టకై నేనుజిత్రప్రతిమలను విచిత్రమగువస్తువులను జూపించితిని సంగీ తపుపెట్టె చూచునపుడును ‚టిక్కుటిక్కు'మను చిన్నగడియారమును వీక్షించునపుడును, ఆబాలిక యత్యాశ్చర్యముతోఁ దనవిశాలనేత్రము లను విప్పిచూచును. అప్పుడామె నాముద్దులకొమార్తె లిల్లీనిసరిగాఁ బోలియుండును! కుగ్రామవాసినిగావున, ఆబాలికకు, విదేశపుస్త్రీ నైన నాగృహము వివిధవస్తుప్రదర్శనశాలవలెఁ గన్పట్టియుండును. కావున నామెనాయింటిగదులలోనున్న ప్రతివస్తువునుగుఱించియు, ‚ఇది యేమిటి? దీనిప్రయోజనమేమి?' యనినన్నుఁ బలుమారడుగఁజొచ్చెను. ఇంతియగాక, మెత్తని మెత్తలుగల నాకుర్చీలు తనచిన్నచేతులతోఁ దడవుచును, సువాసనలిచ్చు ‚లవెండరు' మొదలగు పరిమళద్రవ్యము లుండు సీసాలమూఁతలు దీయుచును, నేనుగుట్టుటయందుపయోగించు సన్నని సూదులను బట్టునంటి దారమును దనవాలుఁగన్నులతో నుప లక్షించుచును, ఆబాలిక నాగదిలో సంతోషముతో నుండెను. నా యింటిగోడల వ్రేలుచున్న ఛాయాపటములలో నామె నాచిన్న కొమ

రిత పటముచూచి 'ఈమెయెవ్వరు?' అనినన్ను బ్రశ్నించినపుడు నాకు బట్టరాని దుఃఖమువచ్చి 'యీామెయు నవలెనే యొక్క చిన్నబాలిక' యని చెప్పి యంతతో నాప్రసంగమును మరలించితిని.

"పాలు తెచ్చునపుడేగాక పలుమారు తాను నాయింటికి రావచ్చుననియును, రావలయుననియును, నేను జెప్పగా, ఆమెవల్లయు నేను ఇంతియగాక తానుమంచిబాలికగా నుండినయెడల, దొరసాని, యెంత పెద్దదైనను, తనచెలికత్తెగనుండునని వినినపుడా బాలికకెంతో యాశ్చర్యమును సంతోషమును గలిగెను! నాటినుండియు నాబాలిక దినమునకనేకపర్యాయములు నాయింటికి వచ్చుచుం బోవుచునుండెను. తాను మంచి బాలికగ నుండుటెట్లని నన్నామె యాతురతతో నడిగినపుడు, 'నీవు అనుదినమును దేహమును బాగుగ దోముకొని నీళ్ళుపోసికొని, శుభ్రమగుబట్టలు గట్టుకొని, యబద్ధ మెప్పుడు నాడక నిజమేచెప్పిన యెడల, నీవు మంచిబాలికవగుదు' వని నేను బలికితిని.

"అప్పటినుండియు నెపుడు నేఁ జూచినను, ఆబాలిక చెట్టుననుండు పుష్పమువలె పరిశుభ్రముగనుండుచువచ్చెను ఆమెవినోదార్థమై నేను జిన్నచిన్నవస్తువుల నామె కిచ్చుచుందును. ఏకాకినినై, వైరాగ్యమును బూని ఈశ్వరధ్యానమునందును మతవ్యాపనమందును దినములు గడపవలయునని సముద్రములనుదాటి, వేలకొలఁది మైళ్ళ దూరము వచ్చిననాబోటిబోటి, నానాటఁ ప్రాపంచికవ్యాపారములందును, సాంసారికబంధములందును దిరిగి ప్రవేశించుట యాశ్చర్యము గదా! కాని విధికృతమున కేమి యడ్డగలదు! అంతకంతకు నాకా బాలికతోటి సఖ్యము దట్టమయ్యెను. ఒక గంట సేపు నాకా బాల కంటికిఁ గానిపించనియెడల, పిచ్చియెత్తినట్లు తోఁచుచుండును! దానితో సుఖసంభాషణముచేయని నిమిషము నానాలుక బెరడుగట్టినట్లులగును! ఇట్లు మామిడిచెట్టునకును మల్లెతీగకునువలె, అమెరికా దేశపు స్త్రీకిని, హిందూబాలికకునునచిరకాలములోనే సఖ్యసంబంధమేర్పడి, దినదినాభివృద్ధియగుచుండెను.

—♦ లీల విద్యాభ్యాసము ♦—

,, నానూతన సఖియగు నీ బాలికను ' లీల ' యను పేరుతోఁ బిలుచుట కెపు డారంభించితినో నాకుఁ దెలియదు. గతించిన నా ముద్దు కొమార్తెయగు లిల్లీని బోలియుండుటచేత నీమెనుగూడ 'లిల్లీ' యనియును, 'లీల' యనియును, నేను బిలువ నారంభించితిని. 'లీలా' యని పిలుచునప్పుడు, స్మృతియనునది యెన్నఁడు నెఱుఁగక నిదురించుచున్నట్టుగ మాత్రమే తోఁచు ప్రేమగుణము, నాహృదయకుహరమునుండి సాయంసమయము నందలి సముద్రతరంగములవలె వెలికిఁ బొంగివచ్చుచుండును. 'లీలా!' యని నేబిలిచినతోడనే, ఆ బాలిక కనుగొనలనుండియు, లేఁబగడములనుబోలిన ముద్దుపెదవులనుండియు, సన్నవెన్నెలవంటి మందహాసము ప్రసరించుచుండును. ఇట్టి గాఢప్రేమబంధముచేఁ గట్టఁబడిన మే మిరువురమునుగూడి సంసారయాత్రను జేయఁజొచ్చితిమి.

,, లీల విద్యాభ్యాసారంభముగూడ నెప్పుడో నాకు బాగుగఁ దెలియదు. నే నప్పుడప్పుడే నేర్చుకొనుచుండిన తెలుఁగక్షరములు గుణితము, మొదలగునవి కొన్ని దినములలోనే లీల నేర్చుకొని నన్నుఁ గలసికొనెను. ఈ చిన్నిబాలతోఁ గలసి చదువునప్పుడు, నా చిన్నతనమున నమెరికాదేశమున బడిలో నేఁ జదివిన ప్రియమగు పూర్వపుదినములును, సంగతులును జ్ఞప్తికి వచ్చెను. కాని, లీలకు నేను సహపాఠకురాలనగుటయేగాక, గురువుగఁగూడ నగుట సంభవించెను. నాపెద్దపెద్ద యింగ్లీషు పుస్తకములను, చక్కని బొమ్మలతోఁగూడిన గ్రంథములను బలుమారు తీయుచు, లీల, ,, నాకీయక్షరములుగూడ నేర్పవలయును '' అని కోరఁగా, నామె కింగ్లీషుభాషగూడ నేరుప మొదలుపెట్టితిని. మా దేశపు బాలికలకంటె హిందూదేశపు బాలికలే విద్య నేర్చువిషయమున నెక్కువ చులుకఁదనముఁ జూపించెదరని నా యభిప్రాయము. నాకింకను తెలుఁగు భాషలో వ్రాయఁబడిన చిన్న పుస్తకములలోని సంగతులు బాగుగఁ దెలియక పూర్వమే, లీల

ఇంగ్లీషుపుస్తకములు చదివి, వానిలోని యంశములను గ్రహింపఁ కలిగియుండెను. నేను లీలతోఁ దెలుఁగున మాటాడుటకంటె, నామె నాతో నింగ్లీషునఁ బ్రసంగము చేయుట మిక్కిలి చక్కఁగనుండెను! ఇట్లు దినదిన ప్రవర్ధమానమగుచు వచ్చిన యాబాలికామణి విద్యాబుద్ధులు, నా హృదయమున కపరిమితమగు సంతోషమును కలిగించెను.

ఉద్యమమునకు విఘాతము

"నేను దెలుఁగు భాషలో మాటాడుటయును, జదువను వ్రాయను నేర్చితినని తెలియఁజేయఁగా, నాపై యధికారులగు మా దేశమునందలిమతవ్యాపనసంఘమువారు, క్రైస్తవమతమును జనులకు బోధింప నారంభింపుమని నా కాజ్ఞనిడిరి. కావున నే నొకదినము లీలను బిలిచి, 'ప్రియమగులీలా! ఇన్ని దినములవఱకును నేను మీ యూర మీభాష నేర్చుకొనుటకై స్థిరముగ నుంటిని. ఇఁక నేను జుట్టుపట్టులనుండు గ్రామములఁ దిరుగుచు, మా సత్యమతమును బోధింపవలయునని మాయధికారు లాజ్ఞచేసిరి. నే నచ్చటచ్చటఁ దిరుగుచున్నను, పలుమా రిచ్చటికి వచ్చుచుందును. అప్పుడు మనము కలిసికొని ముచ్చటింప వచ్చును. మన మిన్నిదినములును సుఖసహవాసముఁ జేసితిమి. కాని స్వసుఖముకంటె స్వామికార్యాచరణమే ముఖ్యముగదా.' యని పలికితిని.

"సామాన్య బాలికలవలె లీల, యూరక కంటనీరు తెచ్చుకొని విలపించునది కాదు. నే నీసంగతి యామెతోఁ జెప్పుచున్నపు డామెకంట జలకణము లొకటిరెండొలికినవి. కాని వివేకవతియగు నా బాల, వానిని మెల్లఁగఁ దుడిచికొని నేఁ జెప్పుమాటల యుక్తాయుక్తములను బాగుగఁ దలపోసి, దీర్ఘాలోచనఁజేసి యిట్లనెను:— 'అమ్మా! మీ పలుకుల యర్థము బాగుగ గ్రహించితిని. మీ మతసంఘము వారి

యాజ్ఞలను శిరసావహించుట యవశ్యమే. ఇది గాక నిజమని మీరు నమ్మిన మతమును వ్యాపనము చేయుటకూడ ముఖ్యధర్మము. మీరు చెప్పిన చొప్పున, స్వసౌఖ్యమునకంటె పరోపకారమే శ్రేష్ఠమైనది. కాని యీ విషయమున నొకటి రెండుసంగతులు నేఁ జెప్పఁదలఁచుకొని యున్నాను.

'ఒక్కొకప్పుడు మనకుఁ దెలియఁబడకయే, మన ధర్మము మనము నిర్వర్తింప నారంభించునటుల దైవము సంఘటించుట మన ముచూచుచున్నాము. ఇదిగాక, మనమారంభించి చేయుచున్న మంచి పనిని, దానికంటె మంచిదగు వేఱొకపని నారంభించుటకై విడిచి పెట్టుట మంచిదిగాదు. ఈశ్వరోద్దేశ మెప్పుడును మన మనుకొనినట్లుండదు. మనము సంతోషముతో నేదో యొక సత్కార్యముఁ జేయఁదలంచుకొనినపుడు ఎదురుచూడని విఘ్నమో, విపత్తో గలిగి, మనలను దుఃఖమున ముంచివేయుటఁ జూచుచుండలేదా? అట్టి సమయమునందు దైవము సంభవింపఁజేసిన కష్టపుస్థితియందైనను శాంతము మొదలగు మంచి నియమములను విడువక కార్యసాధనము చేయుటయే మనుష్యుని ముఖ్యకర్తవ్యము. ఇట్లు మంచిమార్గముననడచి, యేస్థితిలోనున్నపు డందలి పనులనుబాగుగ నిర్వర్తించునపుడే, మనుష్యులు స్వామి కార్యము నెఱవేర్చిన వారగుదురుగదా' యని లీల చెప్పెను.

,, లీల పలుకు లామెకుఁగల యసాధారణ వివేకమును దైవభక్తిని వెల్లడిచేయు సత్యవాక్యములేయైనను, అవియెందుచేతనోగాని నన్నెత్తిపొడుచునట్టి మాటలవలె వినిపించెను. ఆలోచించినదికొలఁది, ఆమె నన్ను గుఱించియె యిట్లుపలికినదని నాకుగోచరించెను. ఇంతియె గాక, ఆమె నా యుద్యమమున కేదో యొక యాతంకముఁ జెప్పఁబూనినట్టుగ నాకుఁ గానఁబడి ,లీలా! వట్టి నీతిబోధనలతోఁ బ్రయోజన మేమిగలదు ? నీమాటల సర్వఁచూడఁగా, నేను మతబోధనా

కార్యమును జేయకుండుట నీ యభిప్రాయమని తోఁచుచున్నది. ఆ పవిత్రకార్యమును జేయుటకేగదా యీ దూరదేశము వచ్చితిని' అని నేను గొంచెము కోపముతోఁ బలికితిని.

,,దీనికిలీల, తనయుద్దేశము, నేను మతబోధనాకార్యమును బొత్తిగవదలిపెట్టుట కాదనియును, చుట్టుపట్టులకుఁ దిరుగుచు మతబోధనఁ జేయుటకంటె నేను బ్రారంభించిన వేరొక మంచికార్యమే బాగుగ నెఱవేర్చుట ముఖ్యమనియుఁ జెప్పెను. అది యేదనఁగా, దనఁకు నేను విద్యఁగఱప నారంభించితిననియును' అట్టి బాలికలవిద్య నింకను నే నా గ్రామమున వృద్ధిఁబొందింపవలయు ననియును, అట్లు చేసినయెడల, దొరసాని కనేక బాలికలు చెలికత్తెలై, యామెకు సహాయముచేసి, యామె యుద్దేశమును నెఱవేర్చెదరనియును జెప్పెను! కుగ్రామమగు నాయూర నొక పాఠశాలను స్థాపించుట కష్టమనియు, నిరుపయోగమనియును నేఁ జెప్పఁగా నామె దాని నొప్పుకొనక, కొంచెము కోపము గలిగిన ముఖముతో నుండెను. అప్పుడు నే నామె నూరడింపఁబూని, 'లీలా! సరే! రేపటిదినమె నే నీ గ్రామమున బాలికా పాఠశాల యొకటి స్థాపించితిననుకొనుము. దానిలోనికివచ్చి చదువుకొనువా రెందఱుందురురో నీకుఁ దెలియునా ? నీవొకతెవె సుమీ! ' యని మేలమాడితిని.

,,అప్పుడు మిక్కుటమగు కోపముతో దిగ్గునలేచిలీల, యెప్పటివలె నాతోఁ జెప్పకయె యింటికిఁ బోయెను!

,,సాధుస్వభావము గలిగియుండు లీల, యా దినమున నేల యిట్లు తగినకారణము లేకయె కోపించెనా యనియును, ఏల యీ బాల నన్ను మతబోధనాకార్యమునుమాని బాలికాపాఠశాలనుస్థాపింపుమనిబోధించెననియును, నే నాశ్చర్యముతోఁ దలపోయుచు, పడకగదిలోనికిఁ బోయి, మంచముమీఁదఁ బండుకొనియుంటిని. అదివఱకు

బాలికాపాఠశాలాస్థాపన మనుసంగతియే నామనసునకు స్ఫురింపలేదు. ఒకవేళ బాలికయగు లీల చెప్పినమార్గమే దైవసమ్మతమైనదికాదుగదా యని యపుడు నేననుకొనఁ జొచ్చితిని. కాని, పై యధికారుల యాజ్ఞల నెట్లుల్లంఘింపఁగలను ? ఇంతేగాక, విదేశీయులనిన దగ్గఱకు రాకుండెడి మూఢజనులతో నిండియుండెడి యీ కుగ్రామమున నేను బాలికాపాఠశాలను బెట్టి, యొకబాలికను దగ్గఱ నుంచుకొని, ప్రొద్దు పుచ్చుచుండుట నవ్వులచేటు గదా !

"ఇట్టి యూహాలు మనస్సున సందడించుచుండఁగాఁ, బడకగది వెలుపల మనుష్యుల సందడి వినఁబడెను. 'ఎవరు వారు' అని యడుగఁగా ముసిముసినవ్వులు నవ్వుచు లీల కానఁబడెను. 'రా రమ్మ!' అని నేను బిలిచి, యిటురమ్మ ! ఒక ముద్దుపెట్టుకొని నీ చిఱుకోపమును సాగనంపెదను !' అనిదగ్గఱకులాగి, యామెను ముద్దాడఁగా, లీల, గది వెలుపలఁ గొందఱు బాలిక లున్నారని చెప్పి, వారు రావచ్చునా యని యడిగెను. అప్పుడు నాకాశ్చర్యము గలుగునట్టుగఁ బదిమంది బాలికలు కిటకిటమని వచ్చి మంచముమీఁదనున్న నన్ను ముట్టడివేసినట్టుగ నా చుట్టును నిలువఁబడిరి! వీరెవరని నే నడుగఁగా వారు నా శిష్యులు కాఁ గోరుచున్నారనియు, వారికిఁ గొంచె మక్షరజ్ఞానము గలదనియును లీల చెప్పెను ! నే నపుడు వారి చేతులలో నున్న చిన్న పుస్తకములను బుచ్చుకొని వేసిన ప్రశ్నములకు వారు మంచి యుత్తరము లియ్యఁజొచ్చిరి. "మీ రెక్కడఁ జదివితిరి ? మీ కెవరు నేర్పిరి ?" యని నే నడుగఁగా, కట్టుగట్టినట్టుగ వారిలో నెవ్వరును మాటాడక నవ్వుమొగములతో నుండిరి. తప్పక చెప్పవలయునని నే నడుగఁగా, వా రింకను మాటాడక, విప్పిన కన్నుగవలతో లీల మొగమువంకఁ జూచిరి. ఆహా ! వీరి రహస్యము తెలిసినది ! లీలయే వీరి సంగతి తెలుపవలదని చెప్పినది ! లీలయే వీరికి నింటికడ విద్యచెప్పి, యిప్పుడాకస్మికముగ వీరిని నాయొద్దకుఁ గొనివచ్చి, న

న్నాశ్చర్యమున ముంచివేయుచుఁ, దనపట్టినపట్టును నెఱవేర్చుకొనఁ జూచుచున్నది ! ఆహా, విద్య నేర్చిన హిందూబాలిక యెంత జిత్తుల మారి, యెంత నేర్పరి !

—♦ బాలికాపాఠశాలాస్థాపనము ♦—

" అప్పుడు నేను సంతోషాశ్చర్యములతో నుప్పొంగి, ,లీలా ! ఇఁక నే నోడిపోతిని. నన్ను వదలిపెట్టుము. ' అని బ్రతిమాలుకొంటిని. అప్పుడు, ,ఇక్కడ బాలికాపాఠశాల త్రేపె స్థాపించెదమనినఁ గాని మిమ్ము వదలము' అని బాలికాబృందము తిన్ననిస్వరములతోఁ బలికిరి ! చలిచీమలు పట్టుకొనిన బల్లివలె నసహాయనై నేనేమిచెప్పుటకును వీలులేకయుంటిని. ఇంతెయెగాక, చదువుకొనుటకు బాలికలు రారను భయము చేతనే నేనుబాఠశాలను స్థాపింపఁజాలనని లీలతోఁ జెప్పితినిగాన, ఇప్పుడు చదువ సిద్ధముగఁ గొందఱు బాలికలుండుట చేత, నేను నాయాడినమాటను జెల్లింపక తప్పించుకొనుటకు మార్గము గానలేకుంటిని. కాఁబట్టి ధైర్యముఁబూని, , సరే ! లీలా ! నీవును, నీ బాలికలదండును, జయము నొందితిరి. త్రేపెమనము పాఠశాల నారంభింతము. ఇఁక మీ యిండ్లకుఁ బొండు ' అని చెప్పి వారి నిండ్లకుఁ బంపి వేసితిని.

,, ఆ మఱునాడు, ముకుందపురమునందు గొప్ప యల్లరి గలిగెను. మేము స్థాపించిన బాలికాపాఠశాలనుగుఱించి ప్రజలు విపరీతముగఁ జెప్పుకొనఁ జొచ్చిరి. ఇంగ్లీషుదొరసానియొకతె పాఠశాలను బెట్టి, గ్రామములోని బాలికలను మతాంతర ప్రవిష్టలఁజేయఁజూచుచున్నదని కొందఱును, ఒక బాలిక క్రైస్తవమైనదని మఱికొందరును, బదిమంది బాలిక లన్యమతమును స్వీకరించిరని యింకఁగొందఱును, జెప్పుకొనసాగిరి ! క్రూరచిత్తయగు నీ పరదేశపుభామిని కందమ పుత్త్రికలను గనఁబడనీయమని యమ్మలక్కలు నీలాటిరే

వున(జెప్పుకొనిరి. హేతువిమర్శనము(జేయు కొలది సంఖ్యగల పురుషులు మాత్రము పాఠశాలకువచ్చి, యచట నేర్పఁబడు పాఠములనుజూచి, భయపడవలదని తమ యిండ్లకడ(జెప్పిరిగాని, వారిమాటలను స్త్రీలు నమ్మకుండిరి.

౹౹ పాఠశాల స్థాపింపఁబడిన క్రొత్తదినములలో, పాపము, లీలకెన్నో కష్టములుగలిగెను. నాయింటికిఁబలుమారు లీల వచ్చుచుఁబోవుచుండుటఁజూచి, యాబాలిక నాతో భోజనముచేయుచున్నదని పామరజనులు గొందఱు కలఁపఁజొచ్చిరి! అందువలన, లీల, కొన్నిదినములవఱకును తల్లియాగ్రహమునకే పాత్రయయ్యెను. నన్నుగుఱించిప్రజలు చెప్పకొనుచుండెడి విపరీతపుపలుకుల కామె సమాధానము(జెప్పవలసి వచ్చెను. ఆమె మాటలు రుచింపనిస్త్రీలు, లేనిపోని చెడుగుణము లామెకుఁగూడ నారోపింపఁజొచ్చిరి. స్త్రీవిద్య యనునది యాప్రదేశమునకుఁ గ్రొత్తవిషయ మగుటచేత. జనులు దాని ననేకవిధముల దూషింపసాగిరి ఇట్టివారితో శాంతముగలిగి మాటాడు భారము లీలపైఁబడెను. జనుల విపరీతాభిప్రాయములవలన, మొదట పాఠశాలకువచ్చిన బాలికలసంఖ్య వేగమె తగ్గిపోయెను. కావున లీల, వారివారి యిండ్లకుఁబోయి, వారి వారి మనస్సులకు సమాధానమగునట్టిపలుకులనుజెప్పి, బాలికల ననుదినమును దనవెంటఁ గొనిరావలసి వచ్చెను. పాఠశాలలో మిక్కిలి పై తరగతిలోఁజేరి తాను జదువుచుండియు, క్రిందితరగతుల బాలికలకు విద్యనేర్పువిషయమునఁ గూడ నామె నాకు సహాయముఁ జేయుచుండును. ఇట్లు వేయి చేతులును, వేయి కాళ్ళునుగల దానివలె నాబాలిక పనులు చేయుచువచ్చెను. వేయేల ? ఆమెసహాయము లేనియెడల, నేను వెంటనే పాఠశాలను మూసివేసి వేఱుపనిఁ జూచుకొనియుందును.

౹౹ లీలను మూఢజను లనేకవిధముల బాధించిరి. క్రైస్త యని కొందఱును, నాస్తికురాలని కొందఱును నామెనుబాహాటవ

బిలుచుచుందురు! నిజము విచారించినచో నిట్లామెకుఁ దగని పేళ్ళిడు వారికంటె నామెయే యెక్కువదైవభక్తి గలిగియుండెను. ఒకదిన మొకస్త్రీలగుంపుదగ్గఱనుండి యా బాలిక నడచిపోవుచుండఁగా, వా రామెను దూషింపఁజొచ్చిరి. అప్పుడామె వారితోఁ బ్రసంగింపఁ జొచ్చెను. ఆబాల చెప్పుమాటలసత్యమునుజూచి వారిలో ననేకు లూరకయుండఁగా నొక వృద్ధాంగన ముందుకువచ్చి, 'నీవిన్నినీతులు చెప్పుచున్నావు నీ పే రేల మార్చుకొంటివి?' యనెను. దీనికి లీల, తాను బేరు మార్చుకొనలేదనియు, తననెంతో ప్రేమతోఁ జూచి, తనకు విద్యాబుద్ధులునేర్పిన స్త్రీమాత్రమె తన్ని ముద్దుపేరుతోఁ బిలుచుననియును సమాధానముఁజెప్పెను. అంతట నా ముదుసలి స్త్రీ 'ఓ బాలికా ! నీకీ పాపపు పరదేశపుపేరిచ్చిన యా దొరసానియే, బలవంతముగఁ బరదేశపుమతములోఁగూడఁ నిన్నుదింపునులెమ్ము!' అని పరిహాసము చేసెను. అంతటఁ గొంచెము కోపముగలిగిన లీల 'అమ్మా ! లీలయనుపేరు పరదేశపుపేరో, యీ దేశములోఁగూడఁ బూర్వముండెనో, నీబోటి దురహంకారముగల వారికేల గానఁ బడును? భక్తాగ్రేసరుఁడగు ప్రహ్లాదుని తల్లియగు పుణ్యవతిపేరు లీలావతియని నీకుఁ దెలియదు కాఁబోలు!' అని యెత్తిపొడిచెను. అప్పుడా స్త్రీలు, 'లీలావతియమ్మవారిని నిందించిన యీముసలిదాని కన్నులు పోవున'ని కొందఱును, 'చిన్నపిల్ల చక్కఁగా చదువుకొనినద'ని మఱి కొందఱును జెప్పుకొనుచుఁ దమదారిని దాము పోయిరి.

—♦ లీల గావించిన మహోపకారము. ♦—

''ఇట్లు, ఈగ్రామమునందలి బాలికాపాఠశాల మెల్ల మెల్లఁగ జనుల యామోదమునకుఁ బాత్రమయ్యెను. మొట్టమొదట నెన్నో విఘాతములు వచ్చెను. కాని యవియన్నియు నాచెవుల సోఁకక మునుపే, లీల, మిగుల నేర్పరితనముతో, సవరించుచుండెను. మొదటి దినములలో, బ్రాహ్మణాద్యగ్రజాతులవారు, తమబాలికలకుఁ బాఠ

శాలలోఁ బ్రత్యేకముగ నున్నతాసనము లిచ్చినఁగాని, వారిని బాఠ శాలకుఁ బంపమనిరి. లీల ,సరే'యని వారితోఁజెప్పి, యొక ప్రక్క బల్లలు వేయించి, యచట బ్రాహ్మణబాలికలను గూర్చుండఁబెట్టుచు, ముందువారికిఁ బాఠములు చెప్పి, పిమ్మటఁ దక్కినబాలికల కడకు వచ్చుచుండును!

,, పాఠశాల కొంతకాలము సాగినపిమ్మట, ఎల్లకాలమును నేను బాలికలను దగ్గఱనుంచుకొని ప్రొద్దుపుచ్చుట యుక్తముగాదని యను బాఠశాలనే పెద్దమనుష్యులకైన నిచ్చివేసి, యుత్కృష్టమగు మతవ్యాపనా కార్యమునకుఁ బోవలయుననియును, నాపై యుద్యోగస్థు లాజ్ఞాపించిరి. వీరి యుత్తరువు లీలకుఁ జూపించి, ,ఇప్పుడైనను నేను మిమ్మందఱిని విడువవలయును, అని చెప్పఁగా, లీల, యుద్ధసన్నద్ధుఁడైన భటునివలె రోషముతో నిట్లు పలికెను:—
,అమ్మా' మీకుఁ గోపమువచ్చినఁ జెప్పలేనుగాని, నే నొకటి చెప్పవలసియున్నది. మీ మతసంఘమువారికి ముక్తివిషయమున విపరీతాభిప్రాయములున్నట్లు తోఁచుచున్నది. ఊరూరఁదిరుగుచు, మొట్ట మీమతము మాకక్కఱలేదన్న జనుల కొకయరగంటసేపు బోధన చేయుటయే మతవ్యాపనమనియు ముక్తిహేతువనియును వారు నమ్ముచున్నారు. అట్లుగాక, చల్లని వర్షజలమునపేక్షించు సస్యంపుమొక్కలవలె జ్ఞానముకొఱకై యెదురుచూచు హిందూబాలికలకు విద్యాబుద్ధులు నేర్పుటయును నట్టి వారిమూలమున దేశమున కంతటికిని మెల్లమెల్లగ జ్ఞానము వ్యాపింపఁజేయుటయును, పనికిమాలిన పనులని వారి యభిప్రాయము. అట్టి జనుల వచనములె మీరు ఈశ్వర వచనములకంటె నెక్కుడుగ శిరసావహింప వలసివచ్చినది గదా!' యని తెలియఁబలికెను.

,,ఆమెవాక్యములు నాకుసమంజసములుగాఁదోఁచెను. కావునవెంటనే నా యుద్దేశము బాలికాపాఠశాలమూలమున నీదేశమునఁ బనిచే

యవలయుననియును, అది తమకు సమ్మతిగాకున్నయెడల నాకును దమకును నంతటితోనే సంబంధము విడిపోయినదని గ్రహించవలయు ననియును, నేను మామతసంఘమువారికి జాబువ్రాసితిని. వారి సహాయములేకపోయినను, నేనుగష్టపడి, ధనసంపాదనముఁజేసి, పాఠశాలను బోషింపవలెనని నిశ్చయించుకొంటిని. నాకుఁ గుడిబుజమువలె నిలిచి సహాయముచేసెదనని లీల వాగ్దానముఁజేసెను. అంతఁగొంతకాలమున కమెరికానుండి వచ్చినజాబులో, నా యిష్టము వచ్చినట్టుగ బాలికా పాఠశాలను నడపి దానిని వృద్ధిలోనికిఁ దెమ్మనియు వలయుధనమును దామిచ్చెదమనియును మా యధికారులొప్పుకొని నట్లుండెను.

,,ఇంకొక సంగతి విషయమునఁగూడ లీల నాకెంతో యుపకారము చేసెను. సామాన్యముగ విదేశీయపు మతగురువులు తలంచునట్లె నేను మొదట హిందూదేశీయుల మతాచారములు మొదలగు వానిని గుఱించి విపరీతాభిప్రాయములు గలిగియుంటిని. నే నెఱిఁగిన సత్యమే లోకములో పరమసత్యమనియు నేను ప్రియముతోఁ జదివిన గ్రంథములే యుద్గ్రంథములనియు నేనుదలంచి హిందువులకుమతబోధనము చేయుటకుఁ దగియుంటిననుకొంటిని. కాని యొకదినము మాటల సందర్భమున లీల తాను హిందూమత గ్రంథముల నంతగాఁ జదువలేదనియును, దమ పూర్వీకు లెవరో వ్రాసియుంచిన ,భాగవతమను' నొక తాటియాకుల గ్రంథమును దాను జదువుచున్నా ననియును నాతోఁ జెప్పెను. అందలి పద్యములు గొన్నిఁటిని జదివి వానియర్థము చెప్పుమని నేను వేడఁగా నామె యట్లుచేసెను. ఆమె చదివిన పద్యములవలననే, సత్యస్వరూపుఁడగు భగవంతుఁ డన్ని దేశములలోను బ్రసన్నమై కొనియాడఁబడుచున్నాడని నా మనసునకు బోధపడెను. నాఁటనుండియు నప్పుడప్పుడు క్రైస్తవమత గ్రంథములతోఁ గూడ హిందూగ్రంథములును లీలతో నేను జదువుచు వినోదించుచుందును.

— లీల పరలోకగత యగుట. —

,, సౌఖ్యము వేవేగమే యస్తమించును. దుఃఖము మాత్రము గ్రీష్మకాలపు సూర్యునివలె నెప్పటికిని దపింపఁ జేయుచుండును. నా

యాత్మ కింకను బుద్ధిఁ జెప్పనెంచెనో యనునట్లుగ భగవంతుఁడు నా కిప్పుడు తిరిగి యొక గొప్పవిపత్తును గలుగఁజేసెను. ఏలయోగాని, లీల కొక విషజ్వరము సోఁకెను. ప్రప్రథమమున మంచి యౌషధ ములు పడక పోవుటచేతనో మఱి యే కారణముచేతనోగాని, యామె వ్యాధి నివారణముగాక, యంతకంత కెక్కువయయ్యెను. తుద కొక నిండువెన్నెల రాత్రి, తీవ్రమగు జ్వరమును సంధియును దన్నుఁ బీడిం పఁగా, లీల, దయామయుఁడగు దేవదేవుని సన్నిధానమునకుఁ బయన మయ్యెను. చనిపోవుటకుఁ గొంచెముముందు నన్ను దనయొద్దకుఁ బిలిచి, శుష్కించిన తనచేతితో నాచేయి పట్టుకొని, 'నాకొకకోరిక గలదు!' అని పలికెను 'ఏదో చెప్పుము, బిడ్డా! అది నేను జెల్లించె దను' అని నేనంటిని. అప్పుడామె, పాఠశాల నెప్పుడును జరుపవల యును సుమీ' యనెను. 'సరే' యని నేను జెప్పఁగా, సంతుష్టినొంది లీల కొంతసేపటికిఁ గన్నులు మూసుకొనెను!

" నా వాగ్దానము చొప్పున నే నింకను బాలశాలను నడపు చున్నాను. సుజనులు గతించి, నా బోటి పాపులుమాత్రము నిలిచియు న్నారు! హా లీలా!" యని యెలుఁగెత్తి పలికి, యంతవఱకును మా టాడుచున్న కార్నీలియా-మే దొరసాని దుఃఖపారవశ్యమున బల్ల మీఁద గొంతసే పొఱగియుండెను.

* * * *

నే నీ పాఠశాలను గుఱించియు దొరసానిని గుఱించియు నా గ్రామములో నడుగఁగా, ఈమె చెప్పిన సంగతులు నిజమైనట్లు తెలిసి నది. తన జీవితకాలమంతయు నీ దేశమునందేయుండి యీస్త్రీ, బాలి కాపాఠశాలాభివృద్ధికై పనిచేయ నుద్యమించినదనియుఁ, దనకమెరికా లోనున్న ధనములోఁ జాలభాగమీపాఠశాలకై యిచ్చివేయుననియు, ఈపాఠశాలకు ముందు "లీల" బాలికాపాఠశాలయని పేరిడుననియు, ఈపేరుతోనే దొరసాని యిపుడు కొన్ని బహుమతుల నేఁటేట నిచ్చు చున్నదనియుఁ దెలిసినది. ఈ కాంత యుద్దేశ మెంతో శ్లాఘనీయ మైనది. దైవ మీామెచేపట్టిన కార్యమును గొనసాగించునుగాక!

కృష్ణవేణి.

౧. కృష్ణవేణి జననము.

రెండువందల సంవత్సరములకుఁ బూర్వము, కృష్ణా గోదావరీ నదులమధ్యమునందు తెలుఁగుదేశమును గోలకొండ నవాబు లేలుచుండిరి. బెజవాడపురము దగ్గఱనిప్పుడు ,,ఆనకట్టు'' కట్టఁబడుటచేత వెన్నువిఱిగి కుంటుచు, మొఱలిడుచు నడుచుచున్న కృష్ణ, ఆకాలమున సత్వగుణప్రధానమై గాంభీర్యమును, శాంతిని వహించి ప్రవహించుచుండెను. వేసవికాలమునందు మిక్కిలి కృశించినను, వర్షఋతువు నందు మాత్రము తన యుదరమునందు సమృద్ధిగ నూతనాంబువులను దాల్చి, పిక్కటిల్లి, నట్టువడక గమ్యస్థానమునకుఁ బోవుచుండెను. కృష్ణానది కుడియొడ్డుననుండి యొకనాఁడు కొందఱు బాటసారులు నడచివచ్చి, నది దాఁటవలెనని యొకనావలోఁ గూర్చుండిరి. మసుసుగనుండుటచేతఁ గొంచెము తాళి మఱి పడవ పాయఁద్రోసెదనని నావవాఁడు చెప్పుచున్నను, ఆవలియొడ్డునఁ దమకు మిక్కిలి తొందర పనులు కలవనియును, వేగమె నావసాగింపుమనియును, ప్రయాణికులు వానిని నిర్బంధపఱిచిరి. సంశయించుచునే పడవవాఁడు నావనుసాగించెను. కాని, కొంచెము కాలములోనే గాలియు, వానయు నధికమై, నదీజలమును దరంగములతో ఘోషింపఁజేసెను. వరదకాలమగుటచేత నది నిండుగనున్నను, అదివఱకుఁ గ్రమముగనే ప్రవహించుచుండెను. కాని యొక నిమిషములోనే, యాకాశము నల్లని మేఘములచేఁ గప్పఁబడిపోయెను. మిక్కుటమగు కోపముతోఁ బటపట పండ్లు కొఱుకుచు నొడుగఱచుచుండు ఘాతుకమృగమువలెనే, నదీ

తరంగములు, రొద చేయుచునురుగుచేఁ గప్పఁబడియుండెను. అప్పటికి నావ నదీమధ్యభాగముఁ జేరియుండుటచేత నెటువైపునకు నడపుటకు దోఁపక పడవవాఁడు నిశ్చేష్టుఁడై యుండెను. ప్రవాహవువడికిని, అలలతాఁకుడునకును లోనై, నావ కొట్టుకొని పోవుచుండెను.

పడవలోనుండువారు. ఏనిమిషమున నావ మునిఁగిపోవునోయని భయముచే వణఁకుచుండిరి. కొందఱు దైవముమీఁద భారము వేసి, తాత్కాలికమగు వైరాగ్యమును బూనియుండిరి. మఱికొందరు, నదీదేవతను శమింపఁజేయుటకుఁ దమయొద్దనున్న ఫలాదులను నైవేద్యములుగ సమర్పించిరి. భీతిచేఁ గళవళపడుచుండు నాబాటసారుల మనసుల నిప్పుడింకొక కష్టమాకర్షించెను. ఆనావలో నెలలు నిండిన యొక కాంత కూర్చుండి యుండెను. భయోద్రేకముచేతనో, సరియైన సమయ మాసన్నమగుటచేతనో, ఆమె కిప్పుడు నొప్పులారంభించెను! అన్ని సదుపాయములునుండు గృహాలోనే మిక్కిలి కష్టముగఁ దోఁచు ప్రసవసమయము మిప్పుడేయాధారములును, ఏయుపకరణములును లేని నదీమధ్యమునఁ గొట్టుకొనిపోవు నావలో మిక్కిలి కష్టముగఁ గానఁబడెననిన నేమియాశ్చర్యము? కాని, యెట్టి యాపదలో నున్నను, సమయోచితమగు కార్యము నాలోచించుట మనుష్యునికి సహజము. వేగమే, పడవలో మధ్యగా నొక తెర వేయఁబడెను. అనుభవముగల స్త్రీలు కొందఱు తెరలోఁ జేరిరి. వైరాగ్యముచేతను, విచారముచేతను మైమఱచిన పడవలోని వారందఱును, ఒక నిమిషములోఁ దిరిగి ప్రాపంచిక విషయములలోనికిఁ జొచ్చిరి. ఎవరి ప్రాణమును వారు దక్కించుకొనవలయునని యాలోచించుచుండెడి వారు, పరోపకార కార్యమున లగ్నమైన హృదయములు గలవారైరి. ఒక పెద్ద కెరటమువచ్చినచో నొకనిమిషములోఁ దాముపరలోక ప్రయాణముఁ గట్టవలసియున్నను, వారందఱును, తెరలోని స్త్రీ సుఖప్రసవమగునా, లేదా యని తల్లడిల్లసాగిరి. ఆహా! మానవహృద

యమా ! నీ నడక లెట్టిచిత్రమైనవి! అపారస్వాతంత్ర్యముగల దాని నంచు విఱ్ఱవీఁగెదవేమి !

ఇంతలో నా స్త్రీ ప్రసవించెను. చక్కని యాకృతిగల స్త్రీ శిశువు జనించెను. చేయవలసిన కార్యము లచటి స్త్రీలు యథోచితముగఁ జేసిరి. కొంచెము కాలములోనే మేఘములు మటుమాయమయ్యెను ; అలలణఁగిపోయెను; నావ యొడమయొద్దఁజేరెను. బాటసారులు సంతోషముతోఁ దమతమగృహముల కేగిరి.

ఇట్లు కృష్ణవేణీగర్భమున జననీగర్భము వెడలిన బాలకుఁ దల్లిదండ్రులు "కృష్ణవేణి" యను నామ మొసంగిరి. ఈబాలజనన సమయమున జనకునికి శరీర స్వాస్థ్యము తప్పియుండెను. అతఁడు జీవింపఁడని యందఱు ననుకొనిరి. కావుననే, నిండుగర్భముఁదాల్చి, పుట్టినింట నుండిన యాబాలికతల్లి, అతిశీఘ్రముగ నిల్లువెడలి కృష్ణదాఁటి, భర్తయున్న విజయవాడపురమునకుఁ బోవలసివచ్చెను. కాని, దైవానుగ్రహమున, కొలఁదికాలములోనే కృష్ణవేణి తండ్రి యారోగ్యమును గాంచెను. ఇంతియెగాక, యదివఱ కేదో స్వల్పమగు నుద్యోగములో నుండిన యాతని కిప్పుడు మంత్రిపదము సంప్రాప్తమయ్యెను. కృష్ణవేణి జనన మిల్లు శుభప్రద మగుటచేత, తల్లిదండ్రులును, బంధువులును, నామె నెంతో ప్రేమతోఁ జూచిరి. ఆకాలమున గోలకొండ నవాబుదగ్గఱ నమాత్యస్థానము నలంకరించి, లోకప్రఖ్యాతి గాంచిన మాదన్న మంత్రి కృష్ణవేణి తండ్రియే.

౨. కృష్ణవేణి బాల్యదశ.

మాదన్నమంత్రి యాంధ్రదేశమునందు విద్యా వివేకములకుఁ బేరు వడసిన యొకనియోగిబ్రాహ్మణుఁడు. ప్రజ్ఞావంతుఁడును, దేవతాభక్తిగలవాఁడును, గొప్పయుద్యోగము నందినవాఁడును నగు వాని కూఁతురగుటచేతఁ గృష్ణవేణికి, నన్నిసుగుణములును స్వాభావికము

గనే గలిగినవనిన నేమియాశ్చర్యము? విశాలమనస్కుఁడగు మాదన్న మంత్రి, తనయేకపుత్రికయగు కృష్ణవేణి కా కాలమునఁ దెలుఁగుదేశమున సాధ్యమగు విద్యలను జెప్పించెను. కృష్ణవేణికి దేశభాషాజ్ఞానమే గాక, కొంతసంస్కృతభాషాపరిచితియు, పారసీభాషలోఁ బ్రవీణతయుఁ గూడఁగలవు. ఇంచుమించుగా నీమెతో సమాన వయస్సుగల నవాబుగారి కొమార్తెయగు జులెయిఖా కాంతకును, కృష్ణవేణికిని, నొకగురువే విద్య చెప్పుచు వచ్చెను. ఇద్దఱును రూపవతులును, గుణవతులునునై, గురువు బోధించిన సువిద్యలను నేర్చి, యొకరియెడనొకరమిత స్నేహభావమును గలిగి, యక్కచెలియండ్రవలె నుండిరి. తానేషాయని హిందువులచేఁ బిలువఁబడుచువచ్చిన ,,అబుల్ హసనుషా'' నవాబు, తన ముఖ్యమంత్రియగు మాదన్నమంత్రిని మిక్కిలి ప్రేమించి గౌరవించెను. తమకొమార్తెల స్నేహము మూలమునఁ గూడఁ గొంతవఱకుఁ బ్రభుప్రధానుల సఖ్యముదట్టమయ్యెను.

కృష్ణవేణికి, జులెయిఖాతోడి సాంగత్యమువలన, మహమ్మదీయ సుదతులకుండు కొన్ని సుగుణములుకూడఁ బట్టువడెను. సర్వకాలములందును సత్యము పలుకవలయుననియు, న్యాయమార్గమునఁ జరింపవలయుననియు, సుఖదుఃఖములందు దైవమునందు సమానమైన భక్తి విశ్వాసము లుండవలయుననియు, జులెయిఖా కృష్ణవేణికి బోధించెను. కృష్ణవేణి సహవాసమువలన జులెయిఖాయును గొన్ని మంచిగుణములను నేర్వఁగలిగెను. సహనము, పరోపకారబుద్ధి, మొదలగు సుగుణములు, కృష్ణవేణి, తననిర్మలచారిత్రము మూలమునను, మృదువాక్యములచేతను జెలికత్తె కుపదేశించెను. ఇట్లు వారిరువురును జెప్పనవిగాని స్నేహభావము గలిగి, వలసినయెడల నొకరికొఱకొకరు ప్రాణములనైనఁ గోలుపోవ సిద్ధముగ నుండిరి.

3. కృష్ణవేణి వ్యాధి.

పదునొక్కటవ సంవత్సరమునఁ గృష్ణవేణి శరీరమున నేకారణముననో యొకకఠినమగువ్యాధి ప్రవేశించెను. ఘనవైద్యులెందఱో యామెకుఁ దమయొద్దనున్న దివ్యౌషధములను బ్రయోగించిరి గాని, యామెకుమాత్రము కొంచెమైనను నెమ్మది గలుగలేదు. తీవ్రమగు నుష్ణ మా బాలదేహమును నిత్యము నావహించి యుండెను. ఇది జ్వరమని కొందఱును, శుద్ధమేహమని కొందఱును, ద్వంద్వమని మఱి కొందఱును, ఇట్లు వేరు వేరు విధముల వైద్యులామె రుగ్ణతను వ్యవహరించుచువచ్చిరే గాని, వారుపయోగించిన యౌషధములు మాత్రము వారి యభిప్రాయములను స్థిరపఱుపఁ జాలవయ్యెను. అంతకంతకుఁ, గృష్ణవేణి శరీరము మిగుల బలహీనమై, మృత్యువున కెదురుచూచుచున్నట్టుగ నుండెను. అట్టి సుగుణవతియగు పుత్రికను గోలుపోవఁ దలిదండ్రుల కమితదుఃఖకరముగ నుండెను. తమశక్తి లోపము లేకుండ, ఘనవైద్యులచే నామెకు మందు లిప్పించిరేగాని, వారింక నేమిచేయఁగలరు ?

కొండవీటిసీమలోఁ బర్వతముల మధ్య నొకవిదేశీయుఁడగు వైద్యుఁడు కలఁడనియును, ఇతరులకు సాధ్యముకాని వ్యాధుల నతఁడవలీలగ నివారింపఁగలఁడనియు మాతన్నమంత్రికిఁ గొందఱు చెప్పిరి. కాని, కేవల సన్న్యాసాశ్రమమును స్వీకరించిన యావైద్యుఁడు, ధనము, కీర్తి, మొదలగువానిని లెక్కసేయఁడని తెలియుటచేత, అతనిని గోలకొండకు రప్పించుట యసంభవమని యాయనకు స్పష్టమయ్యెను. ఇంతియెగాక, యా వైద్యుని దర్శనమునకుఁ బోవునప్పు డెవరుగాని శివికలోనుండక, పాదచారులై పోయి, మిక్కిలి నమ్రతయు, దీనత్వమును దాల్చి యుండవలయునని యును దెలిసెను.

తనపుత్రికకు దేహస్వాస్థ్యము గలిగించు విషయమున నెన్ని కష్టములనైనఁ బడుటకు మాతన్నమంత్రి నిశ్చయించి, కృష్ణవేణిని

దీసికొని పయనమయ్యెను. కొన్నిదినములకు వారిరువురును, వైద్యుని వాసస్థానముఁ జేరిరి. కొండలచాటునఁ గట్టఁబడిన వాని కుటీరము, అన్నివైపులను నడవి వృక్షములచే నావరింపఁబడి, మనస్సునకు శాంతిని, వైరాగ్యమును బోధింపఁజాలియుండెను. అచట వీచుగాలి, వనమూలికలయొక్కయు నడవిపూవుల యొక్కయు సుగంధముల నన్నిదెసలను వెదఁజల్లుచు, దేవుని కరుణాకటాక్షములవలె, చల్లదన. మును, సౌఖ్యమును బ్రసరింపఁజేయుచుండెను. విజనప్రదేశ మగుట చేత నప్పుడప్పుడెలుఁగెత్తి కూయుపక్షుల స్వరములుతప్ప, చెవుల విశ్రాంతిని భంగపఱుచు శబ్దములెవ్వియు వినఁబడకుండెను. చేరువ నుండి పరుగెత్తికొనిపోవు సెలయేటిజలముల సన్ననిరొదలు నిర్మలా నంద మొసంగుచుండెను.

---

౪. నిర్మలానంద యోగి.

తనదర్శనార్థమైవచ్చినమాతనమంత్రిని, గోమార్తెను, ఆయాశ్రమనివాసియగువైద్యుఁడు తగినరీతిని సమ్మానించెను. ఈయన, యేండ్లు గడచియొకవిదేశీయుఁడు. తనజీవితకాలమును, నిశ్శబ్దమగు ప్రదేశమున నీశ్వరధ్యానమునఁ గడపవలయుననియును, దనశక్తియుక్తులను, సోదర సమానులగు మానవుల సేవ్యమునకై వినియోగింప వలయునని యును, నిశ్చయించుకొని యీమహనీయుఁడు, చిన్ననాఁడే తన జనన స్థానమగు పశ్చిమదేశమును విడిచి, సముద్రముదాఁటి, హిందూదేశ మునకు వచ్చెను. ఈయన సాధువర్తనమును, భగవద్ధ్యానతత్పరతను, పరోపకారబుద్ధినిఁ జూచి, చుట్టుపట్టుల నుండువారు, తలిదండ్రు లీయన కిడిన నామమును వదలివైచి, "నిర్మలానందయోగి" యను నామముతో నీయనను వ్యవహరించుచువచ్చిరి. సర్వకాల సర్వావస్థల యందును, ఇతఁడీశ్వర ధ్యానమునందే యుండుటను జూచి,

యీాయన యొక మహర్షి యని దేశనివాసు లనుకొనిరి. కాని యీాయన సాధారణ ఋషిపుంగవులవలెఁ గాక, జనుల సుఖదుఃఖము లను గనుఁగొనుచు, వారిసౌఖ్యముకొఱకై సర్వదా కష్టపడుచుండును. వైద్యవిషయమునఁ దనకుఁగల జ్ఞానానుభవములను రోగపీడితుల బాధలు తొలగించుటయం దెప్పుడును వినియోగించుచుండును. దూరమును, జేరుటకు దుస్సాధ్యమునునగు పర్వతప్రాంత ప్రదేశమం దీయన యుండుటచేత, సాధారణవ్యాధుల నివారణమునకై ప్రజలీయ నను బాధింపక, మిక్కిలి కష్టమగు వానిని గుదుర్పుమనియె వేఁడు కొనుచుందురు. అందుచేత నీయన మనస్సు నిరతము దేహసంబంధ మగు విషయములందే లగ్నమైయుండ నావశ్యకత లేక, వలసినంత కాలము, ఆముష్మిక చింతనలయందుఁ గడపుచు వచ్చెను. ఇట్లీమహ నీయుఁడు, తనజన్మస్థానమును, బంధుమిత్రాదులను విడనాడి, తన జీవితకాలము నీదేశనివాసుల కుపకారములు చేయుటయందును, నీశ్వరసేవయందును గడపెను. ఈయన జీవితము, పరోపకార కార్య ములతోనె గడచిపోయెను. పరులయిక్కట్టులు తొలఁగించుట యందె యీాతనిశక్తి యుక్తులు వినియోగమయ్యెను. బలమును జేవయునుగల ముఖారవిందము నానాఁటముడుతలతోఁ గప్పఁబడియెను. కాని తన జవసత్వము లుడుగుచుండుటకు నిర్మలానందయోగి యించుకయైనను విసిగికొనక తన పాదము లెప్పుడుచు సత్పథమునే ద్రొక్కినందున కును, తనకరములు సత్కార్యాచరణముననే తగిలి యుండుటకును మిక్కిలి సంతసిల్లుచు, తనకింతయుఁ బ్రసాదించిన పరాత్పరునిఁ గీర్తించుచుండును.

౫. వ్యాధినివారణము.

కృష్ణవేణియొక్క వ్యాధివృత్తాంత మంతయు నిర్మలానంద యోగి యామెజనకునివలనఁ దెలిసికొని, యామెశరీరమును బరీక్షిం చెను. దేహము మిక్కిలి శుష్కించియుండినను, ఉష్ణమువూాత్రము

విడువకుండుట యాయన కాశ్చర్యమును గలిగించెను. బాలప్రాయమునని యామెయట్టి వ్యాధిచేఁబీడింపఁబడుట చూచునప్పు డాయోగి కన్నులకు నీరుగ్రమ్మెను. సర్వావయవములును సత్త్వముడిగి మృత్యువు రాకను నిరీక్షించుచున్నటులఁ దోఁచెను. కాని, కృష్ణవేణి విశాలచంచలనేత్రముల కాంతిమాత్రము తగ్గకయుండుటను గనిపెట్టి, వ్యాధి కొంత సవ్యముగనుండుట తెలిసికొని ధైర్యమునొంది, నిర్మలానందయోగి దయారసముట్టిపడు తనచూపులు కృష్ణవేణి కమృతప్రాయముగ నగునట్టుగ నిట్లనియెను—"అమ్మా! నీవ్యాధి చేతికిఁ జిక్కినది. ధైర్యము తెచ్చుకొనుము. ఇదిగో, దైవము నీకమృతము పోయుచున్నాఁడు. నీజిహ్వ కెట్టివస్తువు రుచించునో చెప్పుము?" అనిపలికెను.

ఈతీయని పల్కులు, కృష్ణవేణి హృదయమున నడుగంటిపోవుచుండిన ధైర్యమును గ్రమ్మఱించెను. వైద్యులెప్పుడు తనచేయి చూచినను, "మిగుల కఠినమగువ్యాధి. నివారణము దుర్లభము" అను కఠినపు మాటలే కృష్ణవేణి చెవులసోఁకుచు వచ్చెడివి; నిర్మలానందయోగి పలుకులన్నో, ఆమె కర్ణముల కానందదాయకములయ్యెను. ఇదివఱకెప్పుడును, వైద్యుఁ డామెకు యమునివలెఁ గానఁబడెను. నిర్మలానందయోగి మాత్రము, వైద్యులకుండు కళంకయుతమగు ముఖమును కఠినపు చూపులును లేక జాలియును దయయునుగలిగి తనతండ్రివలెనే గానఁబడెను. ఇంతియగాక, యేవైద్యుఁడును, జిహ్వకసహ్యముగనుండు నేదోయొక మందు మ్రింగుమనుచుండును. కాని, యిప్పటి వైద్యుఁడుమాత్ర మట్లుగాక, "నీకేవస్తువు రుచిగానుండును?" అని యడిగెను! కాఁబట్టి యిన్నికారణములచేతను ధైర్యోత్సాహములను గాంచిన కృష్ణవేణి, చేతఁబడిన పిచ్చుకపిల్ల గొంతువంటిగొంతుతో, "తీయఁదనమును, పుల్లఁదనమును గలిగి, అప్పుడు చెట్టునఁబండిన పండు కావలయును" అని కోరెను!

„చిక్కనవాఁడు సిగ్గెఱుఁగఁడు" అను సామెత చొప్పున, అధికతాపములో నుండిన కృష్ణవేణికి, తీయగను పుల్లగనునుండు ఫలమేదైన హాయి నిచ్చునట్టుగఁదోఁచెనేగాని, తీవ్రజ్వరములోనుండు వారు బోఁటివారి కట్టి పండ్లీయరనిగాని, యట్టి పండ్లు తినఁగూడదని తోఁపలేదు. ఐనను దనకోరికను దెలియపఱుపుమని వైద్యుఁడు పట్టుచేత, ఆమె తన హృదయమును వెల్లడిచేసెను. తానుగ్గి పండు వైద్యుఁడిచ్చు నని యామెగాని, దగ్గఱనున్న తండ్రిగాని యెంచుకొనలేదు. కాని కొన్ని కఠినపువ్యాధులకు రోగికోరికయే నివారణమార్గమును సూచించునని యెఱిఁగిన యాఘనవైద్యుఁడు, అప్పుడు మనస్సులో నేదోకొంత యాలోచించుకొని, లేచి, పెరటిలోనికిఁ బోయి, కొంచెము సేపటికిఁ దిరిగివచ్చి, యానులగు త్రితోనుండు గుండ్రనిఫలములను గొన్ని చేతఁబట్టుకొని, „అమ్మా! ఇవిగో, దైవము నీవు కోరినట్టుగ నీ కీఫలములిచ్చుచున్నాఁడు. ఇవి తిని, బాగుపడి, యాయన మహిమమును గొనియాడుము!" అని చెప్పి, కృష్ణవేణి కా ఫలముల నిచ్చెను! మిక్కిలి యాతురతతో నాబాల, యాపండ్లను నోటనుంచుకొని, తీయగను పుల్లగనునుండు చక్కని యా ఫలముల రుచిని గ్రహించుచు వానిని మ్రింగివైచెను. అంతఁ గొన్ని నెలలనుండి నిద్దురనునది యెఱుఁగని కృష్ణవేణి యానాఁటి రాత్రి యొడలెఱుఁగక నిదురించెను! దైవకృపను గాంచిన వానిపాపమువలెనే, యుష్ణ మామె శరీరమునుండి యారేయి మెల్లమెల్లఁగఁ దొలఁగిపోయెను!

౬. నిర్మలానందయోగితోడి సంభాషణము.

మఱునాఁటి తెల్లవారుజామువనే కృష్ణవేణి మేల్కొనెను. శరీరము నిస్సారముగ నున్నను, అన్ని దినములనుండి తన్నుఁబీడించుచుండినయుష్ణము పోవుటచేత, గొప్పభారము శిరమునుండి తొలఁగిపోయి

నప్పటివలె, ఆమె స్వేచ్ఛను గాంచియుండెను. ఒక్కింతసేపు, తన్నింకను జ్వరము పీడించుచున్న దేమోయని యామె శంకించెను. కాని, యట్లు గాకుండుటెఱింగి, మిక్కిలి సంతోషించెను. అప్పటిసౌఖ్యాయందామె, తన్నదివఱకు వ్యాధిపీడించినసంగతియే మఱచిపో
ె. ఒక నిముషమునకుఁ దన వృత్తాంత మంతయు జ్ఞప్తికి తండ్రి తన్ను వైద్యునియొద్దకుఁ గొనివచ్చుటయు, ఆయన ంతో దయతోఁజూచి తనకోరిక ప్రకారము రుచ్యమగు ఫలములు * తనకిచ్చుటయు, అవి తినినవెంటనే, తనకుగాఢమగు నిద్దుర పట్టుటయు, తలంపునకుఁ వచ్చెను. తనకు గలిగిన యీ గొప్పమేలునకు, వైద్యుఁడు బోధించినట్లు, కృష్ణవేణి తన మనస్సున దేవునిఁ గీర్తించెను.

కృష్ణవేణి శయనించిన గృహమంతయు నిశ్శబ్దముగ నుండెను. ఒకమూలనున్న చిన్నగదిలోమాత్రముదీప మొకటి వెలుఁగుచుండెను. అచటినుండి, పూవులోనుండు తుమ్మెదయొక్క సన్నని రొదవంటి ధ్వనియొకటి యామె చెవి సోఁకి, యెవరో మెల్లఁగ నచటమాటాడుచున్నట్లుగఁ దోఁచెను. తాను నిదురించుటకుఁ బూర్వము, ఆచిన్న గదిలోనికి, నిర్మలానంద యోగి దైవప్రార్థనకై పోయినట్లు కృష్ణవేణి యెఱుఁగును. కావున నిపు డచటినుండి వచ్చు మెల్లనిధ్వని, యా పురుషుని ప్రార్థనయైయుండునని యాలోచించి, మెల్లగఁ దా నాగది గుమ్మము దగ్గఱకుఁబోయి, లోపల నేమి జరుగుచున్నదో యని చూచెను. ఆగదిలో నొకమూల, దేవునరుఁగును బోలిన యొక యరుఁగుమీఁద నొక సుందరి విగ్రహమును, ఆమెచేత నొక

* ఇవి పచ్చి ద్రాక్షఫలములని తోఁచుచున్నది ఐరోపావారికి ద్రాక్షతీఁగను పెంచుట తెలిసియున్నది గావున, ఆదేశస్థుఁడగు నిర్మలానందయోగియును, దన పెరటిలో నీ తీఁగ పెంచియుండవచ్చును.

బాలుని ప్రతిమయును గానఁబడెను. * చుట్టును బూజాద్రవ్యములును దీపములును గానవచ్చెను. ఇదిచూడఁగా, విజయవాడపురమునఁ దన తండ్రి మాతన్నమంత్రిచే మిక్కిలి యభిమానింపఁబడిన కొండమీఁది దేవళములోని కనకదుర్గయొక్క యాకారమును, తన తండ్రియింటఁ బలుమాఱు చేయుశక్తిపూజలును, ఆబాలకుఁ దలంపునకు వచ్చెను. నిర్మలానందయోగి, కన్నులు మూసికొని, మోకాళ్ళమీఁదఁ బడి, యీశ్వరధ్యానము చేయుచుండెను. అచ్చటి సంగతు లన్నియుఁ జూడఁగా, ఆభక్తాగ్రేసరుఁడు, రాత్రి కంటికి నిద్దురనునది యెఱుఁగక, ప్రార్థనయందే కాలముగడపుచుండెనని యామెకుఁదోచెను, ఆపురుషు నందు, గొప్పదయయుఁ బరోపకారబుద్ధియు, నీశ్వరభక్తియుఁ గూడి యుండుట తలపోయఁగాఁ గృష్ణవేణి కమితాశ్చర్యము గలిగెను. అట్టి ఘనుని మూలమునఁ దనకు వ్యాధి నివారణము గలుగఁజేసిన దేవునిమీఁద భక్తిపారవశ్యము గలిగి మెల్లఁగ నామె యా చిన్న గదిలోఁ బ్రవేశించి, తానును మోకాళ్ళమీఁదఁబడి యీశ్వరుని ధ్యానించెను.

కొంతసేపటికి, నిర్మలానందయోగి ప్రార్థననుండి లేచి చూచు సరికి, తనవలెనే భగవద్ధ్యానముఁ జేయుచుండిన యింకొకమనుజుని యాకారముగానఁబడెను. తాను బూజించుచుండిన దేవతయే యిట్లు మానవాకారము గైకొనియుండెనా యని యతఁడాశ్చర్యము నొందెను. ప్రార్థనానంతర మామె లేవఁగా, ఆమె తనదగ్గఱ నౌషధసేవ చేయవచ్చిన బాలయేయని గనిపెట్టి, యామెకుఁగల దైవభక్తికిని, సాహసమునకును మెచ్చుకొని, యామెనాతఁడు వెలుపలకుఁ గొని వచ్చెను.

* ఈనిర్మలానందయోగి, రోమనుక్యాతొలికుభక్తునిగాఁ గానిపించుచున్నాఁడు. ఆమతస్థులు, మరియా కాంత యొక్కయు, ఆమె పుత్రుఁడగు జీససుయొక్కయు ప్రతిమలను బూజాసమయమున నుంచుకొందురు.

నిర్మలానంద యోగి, కృష్ణవేణికి వేఱె యౌషధము లేవియు నీకుఁ, దాను మొదట నిచ్చినపండ్లవంటిపండ్లె, యౌషధముగను ననుపానాహారములుగను నిచ్చుచు వచ్చెను. రెండుమూఁడు దినములలోనే యామె దేహస్వాస్థ్యముఁగాంచి, కొంచెము సత్తువగలది యయ్యెను తండ్రియుఁ దానును శీఘ్రమే యాశ్రమమును విడువవలయునని గ్రహించి, కృష్ణవేణి యొకనాఁడు, నిర్మలానందయోగితో ,,మహనీయుఁడగు వైద్యశిఖామణీ! మీరు నాకుఁ జేసినమేలు నే నెన్నటికిని మఱువఁజాలను. శరీరవ్యాధులనునివారించుటలో మీకంటె నధికు లెవ్వరును లేరు. ఒకశరీరవ్యాధులనే కాదు. మానసికవ్యాధులు గూడ మిమ్ముఁజూచి పెడముఖముపట్టుట నిశ్చయము అట్టి మహాత్ములరగు మీకు నిర్మలమగు మనస్సుతో మ్రొక్కుచున్నాను'' అని చెప్పెను.

నిర్మలానంద యోగి, తనచేతులుసాఁచి యామె శిరమునంటి, ,,పుత్రీ! దైవకృపచేత నీకన్నిశుభములుఁ జేకూఱుఁగాక! నాకేవో ప్రజ్ఞలున్నవని నీ వెంచుచున్నావు. అది సరికాదు. నేను జేయఁగల కొంచెము మేలును, దేవుని కరుణచేతను, అతఁడు దయచేసిన సాధనములచేతను, ఆయన ప్రసాదించిన జ్ఞానానుభవములచేతను, జేయఁగలిగితిని. కాఁబట్టి కీలుబొమ్మవంటి మనుష్యమాత్రుఁడనగు నన్ను భూషింపక, యన్నిటికి నాధారమగు పరాత్పరునే శ్లాఘింపుము!'' అని ప్రత్యుత్తరమిచ్చెను.

కృష్ణవేణి—,, మహాత్మా! ప్రత్యుపకార మపేక్షింపని మీ సుస్వభావము నే నెఱుఁగుదును. కాని, మీ కేదియైన మేలుచేసి, సంతోష పఱుపవలయునని నాకు గొప్ప కోరికగలదు. కాఁబట్టి నా హృదయమునకు సంతుష్టి గలిగింప వేఁడెదను.'' అని యడిగెను.

నిర్మలానంద యోగి—,,సుగుణమునకుసుగుణమే బహుమానము. కాని నాకుఁ బ్రత్యుపకారము చేయఁగోరితివేని, ముందెప్పుడైనను

మిక్కిలి యపరాధము చేసినయెవరైన నొకపురుషుని నాకొఱకై క్షమింపుము; నీకీర్తివలన మఱుఁగుపడనున్న యాపురుషునికే ప్రాముఖ్యము గలుగఁజేసి, నీవె వెనుకఁబడియుండుము!" అని వచించెను.

కృష్ణవేణి:—„తమచిత్తమువచ్చిన చొప్పున నేనడచుకొనుటకు వాగ్దానము చేయుచున్నాను." అని పలికెను.

ఇట్లుకృష్ణవేణి బుద్ధికుశలతకును, సదయహృదయతకును నిర్మలానందయోగి మెచ్చుకొని, తన యాశ్రమముననుండు దినములలో నామెకు మంచి యుపదేశములు కొన్ని చేసెను. పిమ్మట మాతన్న మంత్రియుఁ బుత్రికయు నావైద్యునియొద్ద సెలవు తీసికొని, వాని యాశీర్వచనము గైకొని, బయలువెడలి, గోలకొండపురము వచ్చిరి.

---

౭. కృష్ణవేణి వివాహము.

కృష్ణవేణి పదమూఁడవయేట, ఆమె వివాహప్రయత్నములు జరగెను. రూపవతియు విద్యావతియునగు తనముద్దుల కూఁతునకు మంచి సంబంధము తెచ్చుటకై మాతన్నమంత్రి బాగుగ నాలోచించెను. విద్యాసుగుణములచేఁ జెన్నొందుచు, కులమును గౌరవమును గల యౌవన పురుషు లనేకు లాయనకుఁ గానబడిరి. నవాబుదగ్గఱ తనతోడిమంత్రియు, మిత్రుఁడును నగు అక్కనమంత్రియొక్క మేనల్లుఁడగు శ్రీనాథుఁడనువాఁడు, అందఱికంటెను గొప్పవాఁడనిమాతన్నకుఁ దోచెను. బంధుమిత్రాదులును, ఈ సంబంధమె మంచిదని యూహించిరి. కాని యీసంగతి తన భవిష్యత్తునకుఁ బ్రధానమైనదని గుర్తెఱిఁగిన గుణవతియగు తమపుత్రికయుద్దేశముఁగూడఁ దెలిసికొనఁగోరి యొకనాఁ డాతఁడును, భార్యయును, కృష్ణవేణితో నీసంగతి ప్రస్తావించిరి. సిగ్గుతోఁ దలవంచుకొనిన కృష్ణవేణికిఁ దలిదం

ద్రులు, ఈవిషయమునఁ దమతోఁ గృష్ణవేణి మాటాడుట తప్పిదము గాదనియును, వివాహమును బట్టియె యామె జీవితమునందలి సుఖదుఃఖములును, మంచి చెడుగులును ఏర్పడనున్నవనియును జెప్పఁగా దీర్ఘాలోచనచేసి, కృష్ణవేణి ప్రత్యుత్తరమిచ్చెను. ఆమె పలుకులు వినునప్పుడు మాతన్నమంత్రికిని నతనిభార్యకును నాశ్చర్యాగ్రహములు గలిగెను. ''స్త్రీ బుద్ధిః ప్రళయంకరీ '' యనుట తప్పక నిశ్చయమె యని వారికిఁ దోఁచెను !

కృష్ణవేణియుద్దేశ మేమియో తెలిసికొనుటకై మాచదువరుల కుఁగుతూహలము గలుగవచ్చును. మాతన్నమంత్రికిగోపన్నయనునొక మేనల్లుఁడు గలడు. ఇతఁడు విద్యాపరిశ్రమ మంతగాఁ జేయకపోవుట, చేత, మంచియుద్యోగమునుగాని, గౌరవమునుగాని పొందలేకుండెను, మిక్కిలి నమ్రతయు, దైవభక్తియుఁ గలిగియుండు సాధువగు గోపన్నను మాతన్నమంత్రియు, నతనిభార్యయుఁ బ్రేమించుచుండిరేగాని, యతఁడు ప్రజ్ఞావంతుఁడనిగాని, గొప్పయుద్యోగముల కర్హుఁడనిగాని వారును, తదితరు లెవ్వరును ననుకొనలేదు. ఇప్పుడు కృష్ణవేణి తన్నాతనికిచ్చి వివాహముఁ జేయుఁడనికోరెను! మంచి విద్యాబుద్ధులు గలిగి, తనగొప్పపుట్టుకచేతను, సౌందర్యముచేతను, సుగుణసంపదచేతను శోభిల్లుచుండు కృష్ణవేణి, యేదేశాధీశ్వరుని ప్రధానికో భార్యయై ప్రఖ్యాతిఁ గాంచునని యువ్విళ్ళూరుచుండు తలిదండ్రుల కామె యిప్పటిపలుకులు, అత్యధికాశ్చర్యమును విచారమును గలుగఁజేసెను. సాధువును, సామాన్యపు శక్తియుక్తులు గలిగినవాఁడునునగు గోపన్ననీకృష్ణవేణి వరించుట, మహానదియగు కృష్ణవేణిసముద్రములోఁగాక, కొల్లేటి సరస్సునఁ బడఁగోరునట్లు వారికిఁదోఁచెను! కాని వివేకవంతుఁడగు మాతన్నమంత్రి, సామాన్యజనులవలె నూరక కోపించి, కఠినుమైనను నక్రమమైనను, తనబుద్ధికిఁ దోఁచునట్టి మార్గముననె చేయఁ

జూచువాఁడు కాఁడు. కావున నాతఁడు తనయాశ్చర్యాగ్రహముల చేతఁ బుత్త్రికను నిరుత్సాహ పఱుపక మెల్లఁగఁ గొమార్తెను బుజ్జగించి యిట్లనెను. “అమ్మా నీబుద్ధి సూక్ష్మమునందును, గుణపరిశీలనమునందును నా కెప్పుడు నధికవిశ్వాసముగలదు. కాని యిప్పటి నీవాక్యములు వినునప్పుడు నానమ్మకము చలించుచున్నది. ఐనను, తగిన కారణము లేక నీ వెప్పుడును మాటాడుదానవు గావు. నీ యభిప్రాయమునకుఁగల హేతువులేవో తెల్పి, నన్నును మీయమ్మను సంతోషపఱుపుము.”

కృష్ణవేణి యప్పు డిట్లుత్తర మిచ్చుచున్నది—“నాయనగారూ! విద్యావివేకసంపన్నులగు మీతో నజ్ఞాననగు నేఁ బలుక సాహసించుచున్నందునకు మన్నింపవలయును. పామరజనులవలె విద్యావంతులు వట్టి శరీరగుణములను, బాహ్యవేషములను సంతగాఁ బాటింపఁజాలరు గదా. ప్రజ్ఞావివేకాదిగుణములే, పురుషునందును స్త్రీయందును గౌరవింపఁ బడవలయును. కాని, యీమానసికగుణములకంటెను, ఆత్మోజ్జీవకరములగు దైవభక్తి మొదలగునవియే ముఖ్యములని మీకును దెలిసియున్నది. లోకము మిమ్మింతగా గౌరవించునది, మీరు తానేషాగారియొద్ద ముఖ్యమంత్రి పదవిని బడసియుండుటను బట్టియే గాక, మీకు లోకజననియగు దుర్గాదేవియందలి యపారభక్తిచేతనే గదా. మనము నిర్మలానందయోగి యాశ్రమమున నున్నప్పుడు, అచట నొకచిత్రమగు మొలకను జూచితిని. * ఆమొక్క యుదయముననే తూర్పునకుఁ దిరిగియుండును. సూర్యుఁడాకాశమున సంచరించునప్పుడెల్లను, వానివైపునకే తిరుగుచు, సాయంసమయమున వానితోఁ గూడఁ బశ్చిమదిశకు మరలి, మఱునాడు వానిరాకకై యెదురుచూ

* ఈ మొక్క ప్రొద్దుతిరుగుడు మొక్కయని తోఁచుచున్నది. ఇది యూరపుఖండమున బాగుగఁ బెరుగుచున్నది. మనదేశమునందిపు డచ్చటచ్చట వేయఁబడి, పెరుఁగుచునేయున్నది.

7

చుటకై, తెల్లవారువఱకుఁ దిరిగి తూర్పునకుఁ దిరిగియుండును! మనుష్యుని యాత్మయును, కోటిసూర్య ప్రభావముగల పరమాత్ముని వైపునకే యెప్పుడు నిట్లే తిరిగియుండవలయును. అట్టి మనుష్యుఁడే మనుష్యనామమున కర్హుఁడు. ఎన్నిప్రజ్ఞలున్నను నన్నియు నీశరీరముతోనే తెల్లవాఱును. అధిక దైవభక్తిగల వానిగతి మాత్ర మెప్పుడును భద్రముగ నుండును.

„మా మేనత్త కుమారుఁడగు గోపన్నమంత్రి, శాంతమూర్తియై దైవధ్యానమునందు దివారాత్రములు గడుపుచు, తన శక్తియుక్తుల నీశ్వరారాధనయందే వినియోగించుచున్నవాఁడు. కాఁబట్టి లోక మతనికే పేరు పెట్టినను, అతనినే నేను బురుషశ్రేష్ఠుడని యెంచుచున్నాను. అట్టి మహనీయునిదరి చేరియే, సంసారయాత్ర గడపుట యుత్తమమని నాకుఁ దోచుచున్నది. తరువాత మీచిత్తము!” అని కృష్ణవేణి పలికెను.

కృష్ణవేణి యభిప్రాయములందిట్టి బలిమియు, ధైర్యమును నున్నవని మాతన్నమంత్రియు భార్యయు నెప్పుడుననుకొనలేదు. దైవభక్తియందామెకుఁగల పట్టుదలచూడఁగా వారికత్యాశ్చర్యము గలిగెను. అబలయగు తన కొమార్తె మాటాడు మాటలన్నియు, తన ప్రియదేవతయగుశక్తియే నరరూపమునుధరించి యిట్లుపలుకుచున్నదని మాతన్నమంత్రి భావించెను. అంత, సహేతుకమగు కృష్ణవేణికోరిక చొప్పుననే యామెకును గోపన్నకును వివాహము మహావిభవముతో జరిగెను.

---

౮. కృష్ణవేణి కొండపల్లిలో నుండుట.

శీఘ్రకాలములోనే కృష్ణవేణి భర్తయగు గోపన్నమంత్రికి నవాబు కొలువులో నొక యుద్యోగము లభించెను. కొంతకాలము

గడచినవెనుక, అతనినిఁ గొండపల్లి కోటలో నొకముఖ్యోద్యోగస్థునిగ నియమించిరి. గోలకొండ నవాబుయొక్క రాజ్యమున కంతటికిని కొండపల్లి యుద్యానవనమని యాకాలమున వ్యవహరింపఁబడుచుండెడిది. అచ్చటికోట, శత్రువులకు సాధ్యముగాని యొక పర్వతముమీఁదఁ గట్టఁబడియుండెను. నవాబుయొక్క సైన్యములలో నొక టియాకొండ మీఁదనే విడిసియుండి చుట్టుపట్టులనుండు ప్రదేశములను గాపాడుచుండెను. అప్పు డొక యెత్తగు పర్వతశిఖరమున „ ఒంటి మన్యము ” అను పేరుతో వ్యవహరింపఁబడెడి, ప్రదేశమునందు దివారాత్రములు రాజభటులు కావలియుండి దూరమువనుండు శత్రు రాజుల జాడలు గనుఁగొనుచుండిరి.

తలిదండ్రుల సెలవుగై కొని, కృష్ణవేణి, భర్తతో, గోలకొండ నుండి పయనమయ్యెను. కొలఁది కాలముక్రిందటనే, మచిలీపట్టణము (బందరు) నందలి యింగ్లీషు వర్తకసమాజము వారు, మాతన్న మంత్రికిఁ గానుకగా నొసఁగిన కుసుంబాచీర కృష్ణవేణి సుందరాకారమునకు వన్నె తెచ్చెను. గుళ్ళపల్లి గనులనుండి త్రవ్వఁబడిన చక్కని వజ్రములు, ఆకాంతధరించిన యాభరణములనుండి తళ్కుతళ్కుమనుచుండెను. జులెయిఖారాణి తనకుఁ గృష్ణవేణియెడలఁగల యపార ప్రేమమునకు సూచనగా నొసఁగిన ముత్యములహారము, ఆకోమలి కంఠమును దేజరిల్లఁజేసెను. ఇట్లుదివ్యసౌందర్యముతో నొప్పుపుత్త్రికను సాగనంపుచు, భక్తాగ్రేసరుఁడగు మాతన్నమంత్రి యిట్లు వాక్రుచ్చెను. “అమ్మా! ఇఁక నేను నిలిచెదను, నీవుకొండపల్లికిఁ బోవుట చూడఁగా, ఈపురలక్ష్మిపట్టణ నివాసమునిన విసిగి, యొక్కింతసేపు సేదదీర్చుకొనుటకై వనవిహారముఁ జేయఁబోవు చున్నట్టుగఁ దోఁచుచున్నది! లోక జననియగు దుర్గ దుర్గముల నాశ్రయింపఁ బోవుట న్యాయమేకదా. దయామయుఁడగు నీశ్వరుఁడు మీయుభయులను రక్షించుచుండుఁ గాక!” యని దీవించెను.

తలిదండ్రులను విడిచి పరదేశమున భర్తతోనుండుట కృష్ణవేణికి మొదట దుస్సహముగ నుండెను. సుందరమందిరములలో నివసించుట కభ్యాసపడిన యాసుందరి, యిపుడు పర్వతముల మధ్యనుండు గృహములలోనుండవలసివచ్చెను. ఉద్యానవిహారమున దువినోదించువనితవనమధ్యమందువినోదింపవలసివచ్చెను. చెలికత్తెలసంగీతము లాకర్ణించుచు నల్లననిదురించు కోమలాంగి యిపుడు కర్ణకఠోరముగ నొక్కొకసారికూయు గుడ్లగూబలగీంకారముల కులికిపడుచుండెను. మొదటకొన్నిదినముల వఱకును, ఆమెకీకొండపల్లి కారాగృహముచెఱసాలలో నుండుటవలెఁ దోఁచెను. అచటఁగానిపించు పదార్థము లన్నియును కంటకములవలె నయ్యెను. తానెఱుఁగని యేదో యొక తప్పిదమునకు శిక్షించుటకే తన్నును భర్తను, ఈయటవీప్రదేశమునకు విధిపంపివేసెనని కృష్ణవేణి యనుకొనెను.

కాని యంతకంత కాబాలికి శాంతమును దెచ్చుకొనెను. లోకములో నెప్పుడును సుఖాపేక్ష యుత్కృష్టధర్మము గాదనియును, విధికార్యములను జేయుటయే ముఖ్యమనియుఁ గృష్ణవేణి తన యనుభవమువలన నేర్చుకొనెను. తలిదండ్రుల యొక్కయు, చెలికత్తెల యొక్కయు ప్రేమ మిక్కిలి కోరఁదగినదేగాని, భర్తకుఁ బరిచర్యలు చేయుటయును, దానును, ఆయనయును జేయవలసిన విధికృత్యములు నెఱవేర్చుటయు దానికంటెఁ బ్రియతరమైన పనులని యా వివేకవతి గ్రహించెను. ‘‘ నే నెక్కడనుండిన నేమి ? పట్టణక్రీడలలో నానందించుచుండినను గాఱడవులలోఁ గాసినొందుచున్నను, ఒక సూర్యుఁడే యాకాశమున వెలుఁగుచున్నాఁడు; ఒకభూమియే గానఁబడుచున్నది. ఒక దైవమే రక్షించుచున్నాఁడు!’’ అని తలపోయుచు, ఆమె, బాహ్యప్రపంచము నంతగా లెక్క సేయక, యాత్మవిచారమును జేయసాగెను.

కావుననే యీ జ్ఞానవతి కంతకంతకుఁ బర్వతజీవన మంత దుస్సహముగ లేకుండెను. తీఱిక సమయములం దామె కొండ చరియలనుండి మెల్లమెల్లఁగ స్రవించు సెలయేటి నీటిధారలను వీక్షించుచుండును. ఏ పుస్తకములందును గానఁబడని గొప్ప ధర్మములను నుపదేశములును, ఆ లలన కిట్టి వస్తువులు స్ఫురింపఁ జేయుచుండును. కర్ణకఠోరముగఁ గూయు పులుఁగులధ్వనులైన నామె కిప్పుడు భయమునుగాని, అసహ్యతనుగాని, జనింపఁ జేయకుండెను. జనులందఱును దూషించు తీతువుపక్షి కూఁతలును, గుడ్లగూబల రొదలును, „ ఓ మానవులారా ! ఇఁక మీ మీ చెడుకార్యములను, నీచపు సంకల్పములను, మానివేయుఁడీ ! న్యాయస్వరూపుఁడగు దేవుని యందుఁ జేరుఁడీ ! ” అని ఘోషించు వేదవాక్యముల మాధుర్యమును గాంచెను. చిత్రవిచిత్రములగు పక్షులధ్వనులును, వివిధ వృక్షముల యాకారములును, ఒక్కొక్కసారి నాసికకు సోఁకు మనోహరములగు సువాసనలును, ఆమెకు దేవుని సర్వవ్యాపకత్వ దయామయత్వములు వెల్లడి చేసెను. అగాధములగు కొండలోయలును, అత్యున్నతములగు పర్వతశిఖరములును, ఈశ్వరుని యపారసామర్థ్యము నామె మనస్సునకు గోచరింపఁ జేసెను.

---

౯. భద్రగిరి.

ఇట్లు కొంతకాలము గడచిపోయెను. అప్పుడు గోపన్నమంత్రి, కంబముమెట్టు తాలూకాకుఁ బేష్కారను యుద్యోగస్థుఁడుగ నియమింపఁబడెను. కావున భార్యాభర్తలు, కొండపల్లి విడిచి పోవలసి వచ్చెను. మనుష్యులకుఁ బ్రొఁతవడిన వస్తువులయందును బ్రదేశములందును బ్రేమ గలుగుట స్వాభావికము. కొండపల్లియందలి పర్వత

ములను, సెలయేళ్ళను వృక్షాదులను విడిచిపోవుట, కృష్ణవేణికి బాల్య స్నేహితులను విడనాడుటవలె మిగుల కష్టముగ నుండెను. కాని, లోకములోఁ బ్రేమను గోసివేయుచుండుట వలన మన యాత్మకు బలిమి గలుగుచుండునని గ్రహించి కృష్ణవేణి, స్థితిగతుల ందుఁ గలిగి మార్పునకు వెతనొందుట మాని వేసెను.

కంబము మెట్టు తాలూకాలో, గోదావరినది యొడ్డున భద్ర గిరియను నొక ప్రదేశము గలదు ఆకాలమున భద్రగిరి యొక కుగ్రామముగ నుండెను. శిథిలమయిపోయిన చిన్న దేవాలయమును, జేరువనుండునదియును తప్ప, అందే విషయములును లేకుండెను. ఐనను, భక్తుఁడగు గోపన్నమంత్రి కన్నులను భద్రగిరి యాకర్షించెను. జనసమ్మర్దము గల కంబము మెట్టుపట్టణముననుండక, అతఁడు భద్రా చలమున నివసించెను. తన యుద్యోగపు పనులు క్రమముగ నెఱ వేర్చుచుండినచో నిచ్చటనైనను నివసింపవచ్చునని నవాబు ఆజ్ఞ యిచ్చెను.

గోపన్నమంత్రి మిక్కిలి భగవద్భక్తి గలవాఁడని యిదివఱకే చెప్పితిమి. నిశ్శబ్దముగ నుండునట్టి భద్రగిరియును జేరువను బ్రవ హించు పవిత్రమగు గౌతమీనదియును, శ్రీరాముని యాలయమును, గోపనమంత్రి భక్తినిమఱింతయభివృద్ధినొందించెను. గోపన్న, సామా న్యపురాజకీయోద్యోగస్థులవలెనెప్పుడునుద్యోగపు పనులలోనే మునిఁగి యుండక, ఈశ్వరసేవయందును, దైవచింతనము నందును ననుదిన మును గొంతకాలము గడుపుచుండెను. గోపన్నమంత్రియందుఁ గాని పించు దైవభక్తిని మెచ్చుకొనియే ఆయనను వలచి వివాహమైనది గావున, కృష్ణవేణియును, పతి యొక్క భక్తి పారవశ్యమునకు మఱింత సంతోషము నొందెను. భార్యాభర్తలు ఒక్కొక్క తఱి భగవన్నామామృతమును గ్రోలుచు, ఈ ప్రపంచమును నిండలి విషయములను మఱచుచు నుందురు. ఎచ్చటఁ జూచి

నను వారికన్నులకుఁ జిఱునవ్వుతో నుండుదేవుని సుందరాకారము గానిపించెను. అయన నుపాసించుటకంటె ఘనతరమగుకార్య మీ లోకములో వారికంటి కేదియును గానిపించలేదు. ఏకీభావము నొంది దిన యాసతీపతుల దైవభక్తి దినదినాభివృద్ధి నొందుచుండెను. ఆహా! నిజమైన దాంపత్యమునకు ముఖ్యఫల మిదియేగదా!

---

౧౦. రామదాసు.

లోకములోఁ గొన్ని మిక్కిలి చిత్రములగు సంగతులు గానిపించుచున్నవి. ఒక పర్వతముననే పుట్టిన నదులు భిన్నగతులతోఁ బ్రవహించుచున్నవి. ఒకనది, యడ్డమువచ్చిన గుట్టలను మొత్తుచు, మొరలిడుచు, చెంతనుండు చిన్న చిన్న వస్తువులను మ్రింగివేయుచుఁ బరుగెతుచుండును. రెండవనది, సందుగొందులలో నణఁగుచు, కంటఁబలుకాడక, గమ్యస్థానముఁ జేరుచున్నది. ఏకస్థితి గతుల మనుష్యుల పద్ధతియును గొంతవఱ కిటులేయుండును. టుంబములోనేపుట్టి, భార్యాభర్తలై, ఒక ప్రదేశముననే ్యానము నలుపుచుండువారైనను, కృష్ణవేణియొక్కయు, గోప త్రి యొక్కయు నాత్మలందు భక్తిరసము వేఱువేఱు విధములఁ ుంపసాగెను. గోపన్నమంత్రి, వైరాగ్యమును నివృత్తినిబూని, ిచిక ధర్మములను విధులను లెక్కసేయక సదా యీశ్వరధ్యా నందే యణఁగియుండఁగోరెను. ఇఁకఁ గృష్ణవేణి యన్ననో, వగాని దైవభక్తిచేఁ జెన్నొందుచు, ప్రపంచములోని విధులను ముగ నిర్వర్తింపుచు, నీతి న్యాయము మొదలగువాని నీలోక నుద్ధరింపఁ జూచుచుండును.

భార్యాభర్త లిరువురు నిట్లు కొంతవఱకు భిన్నాభిప్రాయులై డినను, ఒకరి నొక రేవగింపక, దినదినాభివృద్ధిఁ గాంచుచుండు

ప్రేమలతచేఁ గట్టఁబడిన హృదయములు గలవారయిరి. కృష్ణవేణి వంటి శాంతవతియు, వివేకవతియు నగు భార్యయే లేనియెడల, గోపన్నమంత్రి శీఘ్రకాలములోనే దుర్నీతిపరుఁ డనిపించుకొని, బైరాగియై మతిభ్రమణము గలిగి నశించిపోయియుండును. అపారభక్తిపరవశుడఁగు గోపన్నమంత్రియే పతిగానియెడల, కృష్ణవేణియొక్క గంభీరమగు నాత్మకు వలసిన యవలంబము దొరకక, కృశించి, చేయవలసిన ఘనకార్యములను జేయలేకయే యుండవచ్చును.

రాముని దేవాలయముండు భద్రాద్రిలోఁ దానుండుటనుబట్టి గోపన్నమంత్రి „రామదాసు" అను పేరు పెట్టుకొని, యాగుడిని బాగుచేయించి, పలుమారచట రాముని గీర్తించుచుండును. ఇఁక, శివపూజాధురంధరుఁడగు మాతన్నమంత్రికిఁ గూఁతురును, విష్ణుభక్తుఁడగు గోపన్న భార్యయును, హిందూక్రైస్తవ మహమ్మదీయ మతసారమును గ్రోలినట్టిదియును, విద్యావతియు వివేకవతియును... వేణి, ఏస్థలదైవతమునుగాక, సర్వాంతర్యామియగు విశ్వక... యుండెను.

౧౧. కృష్ణవేణి కష్టములు.

భర్త యోగ్యుఁడయి యున్నను, కృష్ణవేణికిఁ గష్టము... పోలేదు. మీఁదు మిక్కిలి, యీభర్తయోగ్యతవలననే యీ... కష్టములు గలిగినవి. ఆకాంతకుఁగల కొన్ని చిక్కుల నిచట ను... రించుచున్నాము; „రామదాసు," ఎల్లప్పుడును రాముని సేవల... సమారాధనములందును దగిలిన మనస్సుగలవాఁడై, తాను జెల్లి... సిన రాజకార్యపు బనులను వదలివేసెను. ఈసంగతి, నవాబునకు... సినయెడల భర్తయుద్యోగమునకు భంగమును, ఆయన చేయు...

మతవిషయికములగుపనులకు విఘాతమును వచ్చునని యెంచి, కృష్ణవేణి పతిచేయుపనులను దానె చాలవఱకుఁ జేయుచుండెడిది. పేరునకు గోపన్నయే "పేష్కారు" ఐనను, ఆయుద్యోగపు పనులన్నియుఁ దానే జేయుచుండెను. ఇట్లున్నను, ఆమె తనప్రజ్ఞ నెవరికిని జాటక, లెక్కలు మొదలగునవి గోపన్నయే సిద్ధము చేయుచుండినట్లుగను, ఇంక నితర కార్యము లన్నియు నాయనయే నెఱవేర్చినట్లుగను, గనపఱచు చుండెను. కాఁబట్టి యుద్యోగపు పనులన్నియును దగినరీతిని జరుగుచుండెను. ఈ రహస్యమును గ్రహింపని ప్రజలు, ఎల్లప్పుడును హరిభక్తియందు మగ్నుఁడైయుండు గోపన్న, తన యపారభక్తి మాహాత్మ్యమువలననే తన యుద్యోగపు కార్యములన్నియును వింతగ నెఱవేర్పఁ గలుగుచున్నాఁడని చెప్పుకొనుచు వచ్చిరి. కృష్ణవేణి, ప్రఖ్యాతినిగోరక, తన మూలమున భర్తకుఁ గీర్తివచ్చుటకై సంతోషించెను.

గోపన్న మంత్రి, రామదాసను పేరుపెట్టుకొని భద్రాద్రియందుండిన ప్రాఁత దేవాలయమును బాగుచేయించెనని చెప్పితిమి. ఆయన పూర్వపు చిన్నగుడిని దొలఁగించి యాస్థానమున నిపుడు గానవచ్చు పెద్దదేవాలయమును గట్టించెను. దీని కధికధనము గావలసివచ్చెను. తాను ధనికుఁడు గాకున్నను, రామదాసు, ఈపని నారంభించుటకు వెనుకదీయక, దొరతనమువారి ధనాగారములోని సొమ్ము ముందుగా వ్యయము చేయసాగెను. శ్రీరాములు ప్రత్యక్షమై యీ ధనమును రామదాసున కొసంగెనని ప్రజలందఱు ననుకొనసాగిరి. కాని నిజ మెఱిఁగిన కృష్ణవేణి, సొమ్మువిషయమై తన భర్తముందు కష్టముల పాలగునని విషాదమునొంది, యొకటి రెండు పర్యాయము లీసంగతి భర్తతోఁ బ్రస్తావింపఁగా, ఆయన "ధనము విషయమై నాతోఁ బ్రసంగింపకుము! నవాబు సొమ్ము నేనెంత వాడుకొనినను, శ్రీరాముని మాహాత్మ్యము వలననే యీకష్ట మెట్లో తొలఁగిపోవును. ఊరక పరితపించకుము!" అని సమాధానముఁ జెప్పెను. కానియిట్టియుత్తరము లామెకే యోదార్పును గలుగఁజేయకుండెను.

రామదాసు మంచితనముఁ జూచి, హరిదాసులమని పేరుపెట్టుకొనినవారెల్లరును, ఆయనగృహమే తమగృహముగఁ జూచుకొనసాగిరి. ఇట్లు వచ్చినవారిలోఁ గొందఱు యోగ్యులుండిరిగాని, మఱికొందఱు నేతిబీరకాయవలెఁ బేరునకుమాత్రమె భక్తులుగనుండి, తమయత్యాశచేత రామదాసును బీడింపసాగిరి. వీరందఱిని కృష్ణవేణి సత్కరించి వీరికి బరిచర్యలు చేయవలసి వచ్చుచుండెను.

రామదాసుయొక్కభక్తి, యాతఁడనుదినమును మోదముతో స్నానముఁ జేయు గౌతమీనదివలె గంభీరముగ నుండినను, ఆనదీజలము వలెనే గొంత మాలిన్యమును దాల్చియుండెను నిష్కామగు నీశ్వరభక్తి కాలయమైనను, ఆయన హృదయము కొన్ని మతోన్మాదములకు లోనయ్యెను. దీనికి ముఖ్యకారణము, ఆయన నెప్పుడును హరిదాసులు పరివేష్టించియుండుటయే. ఈహరిదాసులలోఁ బలువురు, రామదాసుయొక్క నిజమైన యౌన్నత్యమును గ్రహింపఁ జాలక, తమ్మాయన మఱింత యధికముగ గౌరవించునటుల నాయనకు లేనిపోని సుగుణములును మాహాత్మ్యములును నారోపించుచుండిరి. వీరి పొగడ్తల కంతగా నుబ్బివిఱ్ఱవీఁగకున్నను, రామదాసు మాత్రము శ్రీరాములు తనకు నిమిషనిమిషమునకును బ్రత్యక్షమగుచుండెననియుఁ బ్రతికార్యమందును దనకాలోచనలు చెప్పుచుండె ననియును, దన కిష్టము వచ్చిన పనులనెల్లఁ జేయుచుండెననియును విశ్వసించెను!

ఒక సంవత్సరము చైత్రశుద్ధ నవమీ దినమున భద్రగిరి కలకల నవ్వుచుండెను. శ్రీరాముని జనన దినమగుటచేతఁ బ్రతియింటివారును, మహాసంతోషముతోఁ బండుగఁ జేసికొని, రాముని యుత్సవమునకుఁ బోయి వినోదించిరి. రామదాసు, మిక్కుటముగ ధనవ్యయముఁ జేసి, తాను గట్టించిన యాలయములో దేవునిఁ బ్రతిష్ఠాపనముఁ గావించి, యా దినమున మహావైభవముతో నుత్సవముఁ జేయిం

చెను దూరప్రదేశముల నుండి యీ మహోత్సవమును జూచుటకై వేలకొలఁది ప్రజలు వచ్చిరి. ఇఁక జగన్నాథము, రామేశ్వరము మొదలగుప్రదేశములను దర్శించుట యందే తమ కాలము గడపు హరిదాసులు, బైరాగులు, సాధువులును, లెక్కింప శక్యము గాని యందఱు చేరియుండిరి. వీరందఱును రాముని కంటె రామదాసునే యధికముగ శ్లాఘింపఁ జొచ్చిరి. ఆదినమున రామదాసు నిరాహారుఁడై, ప్రాతఃకాలముననుండి యాలయపు మంటపమునఁ గూర్చుండి, రామకీర్తనముఁ జేయుచు, తనకాదినమున రామునిదర్శనము గల్గుననియు, దీర్ఘకాలము సంభాషణము జరగుననియును నమ్మియుండెను. ఇట్లు దినమంతయుఁ గడచెను. దీర్ఘమగు నుత్సవపు సంభ్రమమునందు భ్రమజెందిన హృదయముగలవాఁడై, రామదాసు, సాయంసమయమున నదియొడ్డునకు విచ్చేసెను. ఆకాశమునఁ జంద్రబింబము తేజోవంతముగనుండెను. నదీజలములమీఁదను, చుట్టు పట్టులనుండు వృక్షములు, పర్వతములు మొదలగువానిమీఁదను సన్నని వెన్నెలగాచి, లోకమునంతటిని జిలునవ్వుతో గప్పివైచెను. ఇట్టి ప్రకృతికాంతయొక్క సౌందర్యమును గాంచిన రామదాసుని కన్నులకు తనముందు శ్రీరాముఁడు తాండవమాడుచుండినట్లు తోఁచెను. అంతకంత కాతనిమతిసంచలించి, అతఁడు ఒకనిమిషమున నవ్వునట్లును, ఒక్కింతసేపు శోకించునట్లును, మఱికొంచెము కాలము గంతులువైచునట్లును జేసెను. తుద కాయన ,,లోకమంతయు రామమయము. నేనేరాముఁడను, నేనే యాదివిష్ణువును. అదిగో పాలసముద్రము. అందు శయనింప నిదిగో పోవుచున్నాను! ,, అని యెలుగెత్తి పలుకుచుఁ బాడుచు, నదిలోనికి దిగఁజొచ్చెను!

ఆయనచుట్టునుండు 'దాసులు' వలదని వారింపక, యాతఁడు పలుకుమాటలను దానునుమాఱుపలుకుచు, ఆయనయూహలనుమఱింతస్థిరపఱుచుచు వచ్చిరి. అతనిని శ్రీరాముఁడే నదీమధ్యమునకుఁ గొని

పోవుచుండెననియును దమరడ్డుపడఁ గూడదనియును, చుట్టునుండు భక్తులనుకొనుచు నూరక చూచుచుండిరి. ఈవార్త నెవరో కృష్ణవేణి చెవులఁ బడవైచిరి. తోడనే యామె గోదావరినది యొడ్డునకువచ్చి చుట్టునుమూఁగియుండు జనులనుద్రోచికొనిపోయి,నీటిలోనడచియప్పుడే యగాధజలములఁ బ్రవేశింప నుద్యమించుచుండిన భర్తచేతులు పట్టుకొని, ,,మీరెవరు ? ఎచటికిఁ బోవుచున్నారు?'' అని యడిగెను. దీనికతఁడు, ,,నేను విష్ణుదేవుఁడను. పాలసముద్రమునకుఁ బవ్వళింపఁ బోవుచున్నాను!'' అని ప్రత్యుత్తరమిచ్చెను. ,,మంచిది. నేను లక్ష్మిని; మిమ్ముఁగొనిపోవ వచ్చితిని రండు!'' అని యాయన చేతులను బట్టుకొని, యిటునటు కొంచెము నడిపించి యొడ్డునకుఁ గొనిపోయి, కృష్ణవేణి యాతని యిల్లు చేర్చెను !

---

౧౨ రామదాసు చెలి.

ఆసమయమునఁ గృష్ణవేణికి సమయానుకూలముగఁ దోఁచిన యూహ మిక్కిలి చక్కనిది. తాను లక్ష్మినని యామె చెప్పకపోయినయెడలను, భార్యమాటయందుఁ జెప్పనలవిగాని విశ్వాసము రామదాసునకు లేక యుండినను, అందఱికన్నులయెదుట నతఁడారాత్రి నదీజలములందు బ్రాణములు వదలవలసినదే! ఇంటికిఁ గొనిపోయి, కృష్ణవేణి భర్తకు దైవప్రసాదమని వెచ్చని యావుపాలు ద్రాగనిచ్చి, యాతఁడిఁక నిదురింపవలెనని శ్రీరాములవారి యాజ్ఞయైనదని చెప్పి, యాతనిఁ బానుపుఁ జేర్చెను ! భక్తిపారవశ్యముచేత నెవరుగాని యడ్డగింపనేరని పనులఁజేయఁ జూచుచున్న రామదాసిప్పుడు, కృష్ణవేణిచే జోకొట్టబడి, పొత్తులలోని శిశువువలె నిదురించెను. నిజముగా భార్య నిర్వహింపవలసిన కార్యము లిట్టివియేగదా!

ఇంతటితో భర్తనుగుఱించిన విచారమును గష్టములును గృష్ణవేణికిఁ దొలఁగిపోలేదు. గుడికట్టించుటకై నవాబు సొమ్ముంతోఁ గోపన్నమంత్రి వ్యయముచేసెనని యిదివఱకే చెప్పితిమి. ఆయన గోలకొండకు పంపవలసిన ధన మంతకంత కెక్కువయగుచుండెను. అప్పు తీరు సాధనమేమియుఁ గానఁబడలేదు. నవాబుదగ్గఱ ముఖ్యమంత్రిగాఁ గృష్ణవేణి తండ్రియగు మాతన్నమంత్రి యుండుటచేత, గోపన్న సమయములో సొమ్ము పంపకుండుట కేదో యొకకారణ మాయన చెప్పుచుండెడివాఁడు. కాని యిట్టి మిషలుపన్నుట మాతన్నకుఁగూడఁ గష్టముగఁ దోఁచెను. దీనికిఁ దోడుగా నింకొకటిగూడ సంభవించెను. బ్రాహ్మణులగు అక్కన్న మాతన్నమంత్రులు నవాబుదగ్గఱ ముఖ్యమంత్రులుగ నుండుటకు మహమ్మదీయుల కెంతో కష్టముగనుండెను. ‘ ఇబ్రహీంముఖాను ’ అను నొక మహమ్మదీయుఁడు క్రమక్రమముగా నవాబు కొలువులో గొప్పయుద్యోగములు సంపాదించి, తుదకు నవాబుయొక్క సేనానియై, మంత్రిపదవి నపేక్షించియున్నను, ప్రభు హితమును గోరుచు, ఆయనకు వలసిన యాలోచనలుచెప్పి, యాతని రాష్ట్రమునన్నివిధముల బాగుగఁబరిపాలింపఁ గలిగినవారు, అక్కన్న మాతన్నమంత్రులు తప్ప మఱి యెవ్వరును లేరని తానేపా విశ్వసించి యుండెను. కావున మహమ్మదీయులును, ఇబ్రహీంముఖానును, హిందువుల యౌన్నత్యమునకు భంగము గలుగఁజేయ సదా ప్రయత్నించు చుండిరి.

ఒక దినము, ఇబ్రహీంముఖాను, నవాబువారి నగరునకుఁబోయి చాలసేపటివఱకు నాయనతో నేదో విషయమును గుఱించి ప్రసంగించి బైటికివచ్చి కొంత గుఱ్ఱపుదళమును దీసికొని, వేగమె గోలకొండ నగరమును విడిచెను. ఎంతటి రహస్యమునైనను, దమకు ముందు చెప్పక కార్యసాధనముఁ జేయని నవాబు సేనానాయకుని నెచటికిఁ బంపెనా యని యక్కన్న మాతన్న మంత్రు లాలోచింప

సాగిరి. మొగలాయీలను జయించుటకని కొందఱును, ఓఢ్రదేశము పై దండెత్తుటకని కొందఱును ప్రజ లూహింపఁజొచ్చిరి.

ఇంక నిచట భద్రగిరిలోని వృత్తాంతములను దెల్పెదము. ఒక నాఁడు దేవళములో సమారాధనలు జరుగుచుండెను. హరిదాసులచేఁ బరివేష్టింపఁబడి రామదాసు భజనచేయుచుండెను. అప్పుడు దూర మున నొకసేన నడచివచ్చునట్లు గానఁబడెను. అంతఁ గొంతసేపటికి వారిముందు మహమ్మదీయ సేనాధిపతి గానవచ్చెను. అతఁడు గుఱ్ఱము దిగి, కొంతమంది భటులను వెంటఁదీసికొని, వలదని మొరలిడుచుండు హిందువులమాటలు వినక, దేవళముసొచ్చి యొకజాబునుదీసి గోపన్న మంత్రిచేత నుంచెను. దానిలో నిట్లుండెను —

" అల్లాదయ వలన గోలకొండ రాజ్యమునుబాలించు సుల్తాను అబులు హసనుషా- గోలకొండ- మా తాలూకా కంబముమెట్టు పేష్కారు శ్రీ గోపన్నమంత్రికి వ్రాయుహుకుము. కడచిన రెండు సంవత్సరములకును కంబముమెట్టు తాలూకా పన్ను పైకము మా కేమియుఁ జేరలేదు. మాకుఁ జెల్లించవలసినసొమ్ము, ఇరువదియొక్క వేల రూపాయలును, వెంటనే మా సేనాధిపతి ఇబ్రహీముఖాను సాహేబునకుఁ జెల్లించవలెను. లేనియెడల మిమ్ముఁనుబట్టి తెమ్మని యాయన నాజ్ఞాపించినాము. ఇదె బారాహుకుము. రాజ్యములో అల్లాన్యాయము వ్యాపించుఁగాక ! సుల్తాను హసనుషా ! ''

ఈ యుత్తరము చదివి రామదాసు మూర్ఛనొందెను. చుట్టు నుండువారు గోలపెట్టిరి. కొంచెముసేపటికి రామదాసునకుఁ దెలివి వచ్చెను గాని, తాను జేయుచున్న గొప్పకార్యములకు విఘాతము వచ్చెనుగదా యని యతఁడు మొగమువాల్చి యుండెను. ఒక దిన ములోఁ జెల్లించవలసిన పైక మీయనియెడల రామదాసును గోల కొండకుఁ జెఱఁగొని పోవుటయే కాక, యతఁడు చేసినయప్పునకై

రామునిగుడి బ్రద్దలుగొట్టివేయించి త్రాళ్లు మొదలగునవి యమ్మించెద ననియును, అతని భార్య యగు కృష్ణవేణిని దీసికొనిపోయి నవాబుగారి జనానాలో నుంపించెద ననియును, గుడియుండు ప్రదేశమునఁ దురకల మసీదు కట్టించెదననియును, సేనానాయకుఁడు రోషముతోఁ బల్కి రామదాసునకు సంకెలలు వేయించెను.

---

౧౩. కృష్ణవేణి యుత్తరము.

ఒకనాఁటియస్తమానసమయమునజులెయిఖాకాంత,గోలకొండ లోనుండుతనమేడమీఁదమందమారుతము ననుభవించుచు నొకపుస్తక మును వినోదముతోఁ జదువుకొనుచుండెను. పుస్తకములోనివిషయము లందే మగ్నమయిన మనస్సుగల యామె భుజముమీఁద నేదో బరు వగు వస్తు వాకస్మికముగఁ బడినట్లుతోఁచి, దిగాలునఁ జూచు సరికి, నల్లని యాకృతిగల యొక పావురము తనమీఁద వాలినట్లు కానఁ బడెను, ,,ఓహో వచ్చితివా ! ఏమి విశేషములు తెచ్చితివి!'' అని పలికి యామె యా పావురమును మెల్లగఁ బట్టుకొని, ముద్దిడి, దానిని దువ్వెను. అప్పుడా స్త్రీ పావురమును దన గదిలోని కట్టి తీసికొని పోయి, యొక బల్లమీఁద నుంచి, దాని కాలికిఁ గట్టఁబడిన యొక చిన్న వస్తువును విప్పుకొనెను. అది మడతలు పెట్టఁబడిన యుల్లిపొర వంటి సన్నని కాకితమే. ఆకాకితమునం దే యక్షరములుగాని లేవు. వెంటనే యామె, తన పెట్టెలోని యొక చిన్న బుడ్డినిదీసి, దానిలోని నీరువంటి ద్రావకపుబొట్లను గొన్నిటి నా కాకితము మీఁదవైచి, చేతితో రాచెను, అప్పుడా కాకితములోఁ గొన్ని యక్షరములు గానఁ బడెను. వాని నిట్లాసుదతి చదువుకొనెను:—

,,ప్రియసోదరీమణి యగు శ్రీ జులెయిఖాకాంతకు కృష్ణవేణి యనేక సలాములు. భద్రాద్రిలో కుశలము. గోలకొండలోని మీక్షేమ

సమాచారములు దెలుపవలయును. శ్రీ నవాబుగారి యొక్కయు ఆయన కొమార్తె యొక్కయు దయ మమ్ములనుండి తొలఁగిపోయినటు లున్నది. ఇంతకును ప్రభువుల చిత్తము. ఈదినమే సేనాధిపతియగు నిబ్రహీంముఖాను ఇచటికి నవాబుగారి యాజ్ఞలను గొనివచ్చిరి. మీ మఱంది గారు కంబముమెట్టు తాలూకాలో జమచేసి వాడుకొనిన పన్నుపైకము ౨౧ వేల రూపాయలు నొక దినములోఁ జెల్లించని యెడల, ఆయనకుఁ జెఱయును, మీ చెల్లిలికి మానభంగమును, రామునిగుడికి నాశనమును గలుగనున్నవి ! స్వయంకృతాపరాధము నకుఁ దండ్రిని వేఁడ సిగ్గగుచున్నది. ఇంతియె కాక, నిర్మలానంద యోగి పలుకులను గౌరవించి, నేను మీమఱంది కార్యములను, లోపములను, లోకమునకు వెల్లడి చేయనేరకున్నాను. మీ చెల్లెలి ప్రతిజ్ఞయు, మఱంది పూనికయు, ప్రభువు కీర్తియు, ప్రధానిగౌరవమును గాపాడు భారము మా యక్కగారిమీఁద నున్నది ! ఇట్లు విన్నవించు ప్రియ సోదరి, కృష్ణవేణి,''

---

౧౮. భద్రగిరి నివాసులభయము.

అమఱునాఁటి యుదయముననే, భద్రాచలము రాజవీధిలోఁ బ్రజలు గుమికూడియుండిరి. తమ దేవునికిని, తమమిత్రుఁడగు రామదాసునకును, బతివ్రతాతిలకమగు కృష్ణవేణికిని నేమివిపత్తు రానున్న దోయని భద్రగిరి నివాసులందఱును గడగడ వణఁకుచుండిరి. ఇద్దఱు మాత్రము నిర్భయముగ నుండిరి. వారెవ్వరనఁగా, రామదాసు, కృష్ణవేణియును. సంకెలులు వేయఁబడినప్పటి నుండియును, రామదాసునకు దైవభక్తి యతిశయించెను. తన ప్రియదైవమగు రాముఁ డుండఁగా దన కేవిపత్తును రాదని చెప్పుచు, రామదాసు, కీర్తనలు పాడుచు వచ్చెను. తెల్లవారు నప్పటికి రాముని మాహాత్మ్యము

వలన వాని సంకెలలు పగిలిపోవునని హరిదాసు లనుకొనఁ జొచ్చిరి. ఇఁకఁ గృష్ణవేణియన్ననో, దైవముమీఁద భారముంచి, మనుజుల దయాది సుగుణముల మూలముననే యీశ్వరుఁడు తమ్ముఁ దప్పక రక్షించుననియును, ఒకవేళ, తానుమానమును, నీతిని గోలుపోవల సినయెడల, శత్రుల మాయోపాయముల కన్నిటికిని విఘాతము గలి గింపఁగల యాత్మహత్య యనునది తన చేతిలోనే యున్నదనియు నెంచుకొని, దృఢమైన మనస్సు గలిగి యుండెను.

తెల్లవాఱెను. బాలసూర్యునికిరణములచేఁ దమవాఁడి కత్తులు తళతళమని మెఱయుచుండఁగా, మహమ్మదీయభటులు, సంకెలలు వేయఁబడిన రామదాసును రాజవీథిలోనికిఁ గొనివచ్చిరి. రాజాజ్ఞ చొప్పున రామదాసు పన్ను చెల్లించలేదు గావున, తాను జేయవలసిన క్రూరశిక్షలు జరపవలసి వచ్చునని సేనానాయకుఁడు చెప్పివేసెను. తా మూహించినట్లు రామదాసు సంకెలలు వాని యంతట నవి యూడకుండుటకు హరిదాసు లెంతయు వగచిరి. పైకేమియు నెఱుఁ గని వారి వలెఁ గానఁబడినను, తురకలవలనఁ దమవారి కేమైన విపత్తు వచ్చినచో, తురకభటుల నందఱిని జంపివేయవలయునని యాగ్రామ వాసులు లోలోన నిశ్చయించుకొనిరి.

తనశత్రువగు మాతన్నమంత్రి కిప్పుడు పరాభవము గలిగించు టకు సమయము చిక్కెనుగదా యని సేనానాయకుఁడును, అన్య మతస్థులగు హిందువుల దేవాలయమును బగులఁగొట్టి, యందుండు సొమ్ములను హరింప సమయమువచ్చెనని మహమ్మదీయభటులును, సంతోషముతోనుండిరి. వారిలో నొక్కఁడు మాత్రమే యానందిం పకుండెను. అతఁడు సేనాధిపతికిఁ దరువాతి యుద్యోగస్థుఁడగు "మీ రాను" అనువాఁడు. ఈ మీరాను చిన్ననాఁడు, జులెయిఖా కృష్ణ వేణులతో నప్పుడప్పుడు పాఠములు చదువుకొనుచుండెడి యొక గొ ప్పవంశస్థుఁడగు మహమ్మదీయుఁడు. తనకుఁ జెల్లెలివంటి కృష్ణవేణికిఁ

గలుగనున్న యుపద్రవమునకై యతఁడు మిగుల ఖిన్నుఁడై యుండెను. కాని, తాను సర్వాధికారిగానందునఁ జేయునది లేక యతఁడు విచారముతో మాత్రముండెను.

నియమితకాలము దాఁటినందున, గోలకొండ ప్రయాణమునకు సిద్ధము కమ్మని కృష్ణవేణికి సేనాధిపతి వర్తమానము పంపెను. ఇదె వచ్చెద నని ప్రత్యుత్తరముఁబంపి, కృష్ణవేణిపోవ సిద్ధముగనుండు నప్పు డామె దగ్గఱ రెండుపావురములు వ్రాలెను. మిక్కిలి సంతోషముతో నామె పావురముల కాళ్ళకుఁ గట్టబడిన రెండుకాకితపు మడతలను దీసికొని, వానిమీఁద నొక ద్రావకము వేసి, స్ఫుటముగఁ గానిపించిన యక్షరములను ఆశ్చర్యానందములతోఁ జదువుకొని, యామడతలను జేతనుంచుకొని రాజవీధిలోనికిఁ బ్రయాణమయ్యెను.

---

౧౫. చిత్రమైనమార్పు.

ఆనందముతోను బవిత్రతతోను వెలుఁగొందుచుండు కృష్ణవేణి ముఖపద్మము, చూపరుల మనసుల కమితాశ్చర్యమును గలుగఁ జేసెను. అట్టి మానవతిని రచ్చకీడ్చినవారు, పూర్వము ద్రౌపదిని సభలోఁ బరాభవించిన కౌరవసంతతివలె వేగమెనశించెదరని ప్రజలు చెప్పుకొనసాగిరి. కోపమును దుఃఖమును నుడుగుడనిపలికి, కృష్ణవేణి, మహమ్మదీయ సైన్యముదగ్గరకువచ్చి, యందఱికి నాశ్చర్యము గలుగునట్టుగ రెండవ సేనాధిపతియగు మీరానును జేతిసైఁగతోఁ బిలిచి, వానిచేత నొక యుత్తరము పడవైచెను. అతఁడా యుత్తరము నిట్లు చదువుకొనెను.

"అల్లాదయవలన రాజ్యమేలు సుల్తాను అబుల్‌హసనుషా—భద్రాద్రిపంపఁబడిన రెండవసేనాధిపతియగు మీరాను సాహేబునకుఁబం

పిన జరూరుహుకుము:—ఇబ్రహీముఖానును సేనాధిపతిగాఁ దొలఁగించివేసితిమి. అతనిని జోడు సంకెలలువేసి, గోలకొండ తీసికొని రావలయును. నిన్ను సేనానాయకునిగా నియమించితిమి. గోపన్నమంత్రిని జెఱవదలించి యాయన కెప్పటి యుద్యోగమును గౌరవమును నిచ్చివేయుము. ఆయన కొఱకై శ్రీరాములవారు పంపిన పైకము క్రమముగఁ జేరినది. రశీదులు వెనుకనుండి పంపుచున్నాము. శ్రీకృష్ణవేణి పేరిటఁ గంబముమెట్టు తాలూకాలో నొక గ్రామముకట్టుట కుత్తరువిచ్చినాము. మాహాత్మ్యముగల భద్రాద్రిరాముని కైంకర్యము నిమిత్తము కొన్నిగ్రామము లగ్రహారములుగ నిచ్చివేసితిమి. వెంటనే సేనను నడపించుకొని నీవుగోలకొండబయలుదేఱుము. ఇట్లు అబుల్ హసనుషా"

ఈయుత్తరము చదివికొని, మీరాను, ఇబ్రహీముఖానునకుసంకెలలు వేయించి, మొహరుతోనున్న జాబు నందఱికినిజదివి వినిపించెను. అప్పుడు భద్రాద్రిప్రజలకుఁ గలిగిన యానందపారవశ్యము వర్ణింపఁజాలము. ఆదినము రాత్రిరెండుజాములవఱకును దేవాలయమునఁ బూజలు జరగుచునే యుండినవి. బ్రాహ్మణులు, తమప్రార్థనలయందు తానేషా నామమును బలుమా రుచ్చరించుచువచ్చిరి. రామదాసుయొక్క భక్తి నిక్కమైనదనియు, భద్రాద్రియందుఁ దప్పక శ్రీరాములు ప్రత్యక్షమైయున్నారనియును, ప్రజ లప్పటినుండియు నిప్పటివఱకును జెప్పుకొనుచునే యున్నారు

---

౧౬. రామదాసు పైకము నవాబునకుఁ జేరుట.

తానేషా కొమార్తెయగు జులెయిఖాయే పైని జెప్పఁబడిన నవాబుచే వ్రాయఁబడిన జాబును, ఇంకొకటిని, బెంపుడు పావురముల కాళ్ళకుఁ గట్టి కృష్ణవేణికిఁ బంపెను. కృష్ణవేణి మొదట నామెకు

వ్రాసిన లేఖనుగూడఁ బెంపుడు పావురమే గోలకొండ తీసికొని పోయి నది. పావురము లతివేగముగాఁ బరుగెత్తఁగల పక్షులు. మన దేశము నందును, ఇతర దేశములందును, తంతివార్తలు లేని పూర్వకాలము లందు, ఈ పక్షులవలననే మిక్కిలి త్వరితముగఁ జేరవలసిన వర్తమా నములు పంపఁబడుచుండెను. అక్కన్న మాతన్న మంత్రులీ పెంపుడు పావురముల యుపయోగమును గనిపెట్టి, రాజకీయవ్యవహారములందు వాని సహాయముఁ బొందుచు వచ్చిరి. వారు తఱచుగ బెజవాడపుర మునం దుండియే గోలకొండలోనుండు నవాబున కాలోచనలు చెప్పు చు, రాజ్యమును బాగుగ జరపుచు వచ్చిరి. దీనినిఁజూచి, పామరజను లు, బెజవాడనుండి గోలకొండ పట్టణమునకు భూమిలోనుండి యొక సొరంగముండెనని యనుకొనుచు వచ్చిరి. ఈ పెంపుడుపావురములే యిపుడు కృష్ణవేణిమానమును, రామదాసుయొక్క కీర్తినిరక్షించినవి!

ఇఁక, జులెయిఖా కృష్ణవేణికి వ్రాసిన రెండవజాబులోని సమా చారమునుగుఱించి చెప్పవలసియున్నది. కృష్ణవేణిజాబు తనకుఁ జేరిన తోడనే, జులెయిఖా యొక చిత్రమగు నాలోచనఁ జేసెను. తానేపా తన యుద్యోగస్థుల నెవ్వరిని నమ్మక, తన ధనమంతయు నగరిలోనే యుంచి, తనకొమార్తెను ధనాగారముగాపాడ నియమించియుండెను. జులెయిఖా, తనకుఁ గృష్ణవేణి జాబువ్రాసినదినము రాత్రి నిశీథసమ యమున నెవ్వరికిఁ దెలియకుండ ధనాగారములోని రెండు వరహాల సంచులనుదీసి, వానిమీఁద "కంబముమెట్టు తాలూకాపన్ను గోపన్న మంత్రి పంపినది." అని వ్రాసి, వానిని నవాబు శయనించుగది గుమ్మ ముదగ్గఱనుంచి, తానొక ముసుగువైచికొని, మెల్లమెల్లగఁ దప్పటడు గులు పెట్టుచు వచ్చి, నిదురించు నవాబుచెవిలో "రామదాసుపైకము తెచ్చితిని! రసీ దిప్పించుడి:"యని పలుమాఱు మెల్లగననెను. గాఢ నిద్రనుండి సగము మేల్కొనిన నవాబు కన్నులు తెఱచి చూచునప్పు

టికి, ముసుఁగు వేసికొనిన వారు వెడలిపోవునట్లుండెను. నవాబు లేచి, గదిలో వెదుకఁగా నెవ్వరును గానరైరి. గది తలుపు వేసియుండెను. అతని చెవిలో నింకను ,,రామదాసు పైకము, రసీదు'' అను పలుకులు వినఁబడు నట్లుండెను. గుమ్మము దగ్గఱకువచ్చు నప్పుడు వాని పాదములకు ధనముండు సంచులు తగిలెను. దీపము తెచ్చి చూడఁగా, వాని మీఁద యక్షరములు గానవచ్చెను. అవి యచటకు వచ్చుటకును, స్వప్నములోఁ దనకీమాటలు వినఁబడుటకును గారణము తెలియక నవాబు, తనగదితోఁ జేరియుండిన జులెయిఖాగది దగ్గఱకుఁబోయి, ,, అమ్మా ! అమ్మా ! " యని పిలిచెను. గాఢనిద్రనుండి లేచిన దానివలె జులెయిఖా లేచి, ,,నాయనగారూ! ఏమిసమాచారము?"అని యడిగెను. ,,ఎవఁడో మనుష్యుఁడు వచ్చినట్టుగనున్నది. నీకేమైనఁ దెలియదుగదా!''యని తండ్రియడుగునప్పుడు, జులెయిఖాయాశ్చర్యమును నటించి, దీపమునుదీసి, నలుదిశలును వెదకెను. అంతఁ దండ్రియుఁ గొమార్తెయును ధనాగారమునుజూఁచి వచ్చిరి. దానితలుపులు, లక్కపట్లు మొదలగునవి సరిగనే యుండెను. పిమ్మట, నవాబు, తనకు నిద్దరలో వినఁబడినశబ్దములసంగతికొమార్తెకుఁజెప్పి, యామెకుసొమ్మునంచులుచూపి, యిట్లనెను. ,,ఈరామదాసు అనఁబడెడి గోపన్నమనఖజానాకుఁ గొన్ని వేలరూప్యములు పంపవలయును. అవి వసూలుచేయుటకు సేనానాయకుని బంపితిని. ఈసొమ్మునంచులెవ్వరో తెచ్చి, యిక్కడఁబడవైచి, , రసీ దిప్పించుఁడు' అనినన్నడిగిరి. ఇదియంతయుఁజూడఁ గారామదాసుమహానుభావుఁడనితోఁచుచున్నది. ఇచ్చటికిసొమ్ము తెచ్చి పడవైచినవారు, అతఁ డారాధించు శ్రీరాములేయని తోఁచుచున్నది. అట్టివాఁడు కడుదుర్మార్గుఁడని మన సేనానాయకుఁడు నాకుఁ గొన్ని దినములక్రిందట చెప్పఁగా, వేగమెపోయి సొమ్ముతీసికొని రమ్మని వానినిబంపితిని. ఇప్పుడేమిచేయవలయునో చెప్పుము!'' అనియడిగెను,

దీనికి జులెయిఖా యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "నాయనగారి యూహా పరిపూర్ణమైనదని నేను వేఱెచెప్పనక్కఱలేదు. రామదాసు మిక్కిలి యోగ్యుఁడు. దైవము మనుష్యుఁడునుగూడ నాతనిఁ బ్రేమింపఁజూతురు. ఆతనిభార్య కృష్ణవేణి మిక్కిలి మంచిది. మన సేనాధిపతి దుష్టుఁడు. అతఁడు హిందువులను హింసింపఁ జూచుచుండును. రామదాసును, నతనిభార్యను సేనాధిపతియీపాటికి బాధలుపెట్టుచుండునని నాకును దోఁచుచున్నది. లేనియెడల, వారి దైవమగు శ్రీరాములు మనకీసొమ్మునేల తెచ్చి యిచ్చును ? తమ చిత్తమువచ్చిన యెడల వెంటనే జాబు నొకటి పావురముద్వారా పంపవచ్చును. జనుల యాపదలు తప్పించుటకంటె మనుష్యుని కెక్కువధర్మము లేదుగదా! " యని పలికెను.

అంతట వెనుక వివరింపఁబడిన జాబులు వ్రాయఁబడి, భద్రగిరికిఁ బంపఁబడెను. కొన్ని గడియలలోనే పావురములు భద్రాచలము వచ్చి, కృష్ణవేణికి జాబు లిచ్చినవి.

---

౧౭. కృష్ణవేణి తరువాతి వృత్తాంతము.

ఇట్లు కృష్ణవేణి, తనమిత్త్రురాలి కొకరికిదప్ప నితరు లెవ్వరికిని దెలియకయే, భర్తనాపదనుండి తొలగించి, యతఁడుచేయుచుండినపనికేమియు విఘాతము రాకుండఁజేయుటయేగాక, భద్రాద్రిరాముని సేవ యెన్నటికిని జరుగునటుల నేర్పఱిచెను. ఆమె, కీర్తికాశపడక, తనభర్త యొక్క శ్రేయస్సునేకోరి, యతఁడు తలపెట్టిన కార్యము నిరాతంకముగ జరుగునట్లు చేసెను. ఈమె తరువాతి వృత్తాంతము మనకంతగాఁ దెలియదు. ఇదివఱకు మేము వ్రాసిన సంగతులన్నియు హుసేను అను మహమ్మదీయచరిత్రకర్త పూర్వము వ్రాసెను. కొంతకాలమునకు, ఔరంగజేబు అనుమొగలాయి చక్రవర్తి దండెత్తివచ్చి, గోలకొండ

దుర్బునటుల రాజుగారిచే నొప్పించితిని. కావున మనమిప్పుడు బాగుగ నాలోచింపవలయును. ఆవన్నెలాడి గుణాతిశయము మొదలంట నణంగం ద్రొక్కుట కిదియె మంచిసమయము. రాజకుటుంబములోని బాలయైనను, ఈమెకు గొప్పసంబధమేమియు నిశ్చయింపక, నిఱుపేదయును, ఒకరి పెట్టుపోతలకాశించువాడునునగు యొక రెడ్డికీమె నీయవలయును. నీవు వేగమె యాలోచింపవలయును" అనిపలికెను. రౌతునుబట్టి గుఱ్ఱమును, రాజునుబట్టి మంత్రియును నడచుచుండుట౦ గాంతుము. పరిచారికయును దేవి యుద్దేశమున కనుగుణముగనే యాలోచించి, యిట్లువచించెను: "అమ్మా! దీనికింత విచారింపనేల? కొలందికాలము క్రిందటనె రాజుగారి కొలువులోంజేరి, చిత్రగుప్తుండు గనున్నపోతనరెడ్డి బాలాంబకుం దగినవరుండు. ఆతనిస్థితిగతులు తమకంగీకార్యములుగనేయుండును. వుట్టిననాంటినుండియు నొంటిప్రక్కయన్నమునకే యతని కడుపలవాటుపడినది!" అనుసఖపలుకులకు సంతసిల్లి, రాణి, "ఇదేసిద్ధము. తిండిలేని పోతన్న దిక్కులేని బాలమ్మకు మగండు! భళీ!" యని నిర్దేశించెను.

౧-వ ప్రకరణము.

"తానొకటి దలంచిన, దైవమొకటిదలంచును"—లోకోక్తి.

పోతన రెడ్డికి బాలాంబ నిచ్చుటకుం గారణము, ఆరెడ్డిమీంద రాజునకును రాణికిని నిర్హేతుకముగ జనించిన యనుగ్రహమె యని కొండవీటి నివాసు లనుకొనంజొచ్చిరి. అత్తచేయుపని కాఅడిలేదు గదా. ఊరును బేరును లేని యొక పేదరెడ్డిని బరిణయమగుటచేత, బాలాంబ సతతము సిగ్గుతోం దలవాల్చియుండునని రాణి లోలోన హర్షించెను. కాని, వివాహానంతరముగూడ బాలాంబ ముఖబింబము, కళంకములేని పున్నమనాంటి చంద్రబింబమువలె భాసిలుచుండుటం

జూడఁగా, సుందరీదేవి మనస్సున నాశ్చర్యము జనింప సాగెను. బాలాంబ సుస్వభావమును, కొలఁది ఫలముతోనె గొప్ప యానందమునుగాంచు బుద్ధిమహిమము నే దీనికిఁ గారణములని యూహించి, రాణి యూరకుండెను.

సత్యము మాత్రమది కాదు. బాలాంబపరిణయమైనవరుఁడు ఆమెకును, ఆమె ప్రేమమునకును, అదివఱకపరిచితుఁడు కాఁడు. నవయౌవనాంగియు, వినయాది సుగుణభూషితయును నగు బాలాంబ, పూర్వమొక నాఁడు, అంతఃపుర సౌధమున విహరించుచు, రాజుగారి కొలువుకూటము గానఁబడు నేకాంతపుజాలకములనుండి యట్టె చూచుచుండెను. నిండుకొలువుండిన రాజామెకన్నులకుఁ గానఁబడెను. ప్రధానులును, తక్కిన యుద్యోగీయులును, దమతమ గద్దియలందు హాయిగఁ గూర్చుండి, యించుకమాత్రము, ఉద్యోగపుఁ బనులను జూచుకొనుచు విశ్రమించుచుండిరి. దూరమున నొకమూలనూత్ర మొక యువకుఁడు, తనముందు వేయఁబడిన తాళపత్రములను శ్రద్ధతోఁ జూచుచు వేవేగమె క్రొత్తపత్రులను వ్రాయుచునుండెను. కాని యతఁడు వ్రాసినకొలఁదిని, పై యధికారులచేఁ బంపఁబడుచు వచ్చిన తాళపత్రము లధికముగ ముందుగుప్పింపఁ బడుచుండెను! ఇతరుల హృదయకాఠిన్యము వలనను, వారి స్వార్థపరత్వముచేతను బెఱుఁగుచుండు తనపనియనిన నెంతమాత్రమును విసుగుకొనక, చేతిగంటము నలయికతీర్చుకొనుట కొకసారియైనఁ గ్రిందనుంచక, లిఖించుచుండు తరుణుని ముఖకమలమును, దనవిశాలనయనములు మఱింత సోగలగు నట్లుగ నాశ్చర్యముతో రాజకన్యక చూచుచుండెను. అతిపరిశ్రమము వలన నెఱ్ఱఁబాఱినయాతని ముఖచంద్రుని, గ్రీష్మకాలపు వేడిమిచే జనించిన చెమ్మటబిందువులు, రిక్కలరేనిం జుక్కలవలె నలంకరించి, వాని యాకారమున నొకవిధమగు చెలువమునే యొసంగెను! మనుజుల భావికాలపు సంగతులనెల్ల నతిజాగరూకతతో లిఖితరూప

మున నిరూపణచేయు బ్రహ్మవలె నాలేఁతవయసువాని రూపమామె సుందరనయనముల కపుడు గన్పట్టెను. తోడనే, పవిత్ర ప్రేమాంకురములాకాంత హృదయమున జనించెను. తాను వివాహమాడఁదలచినచో నీపురుషుఁడె తగినవరుఁడని బాలాంబ తలపోసెను.

ఆవేసవికాల మట్టెగడచిపోయెను. వర్షకాలము, శీతకాలమునుగూడవచ్చి, తమదారిని దాము వెడలి పోయెను. కాని యెప్పుడు చూచినను, ఆసుందరి నయనములకుఁ దలయెత్తకుండ వ్రాయుచుండు నాసుందరుని యాకృతియె గానవచ్చునుండెను ! ఈమధ్యకాలములో ననేకులు క్రిందియుద్యోగస్థులు గౌరవస్థానములఁబడసిరి; పెక్కండ్రు బిరుదులను, రాజసమ్మానములను గాంచిరి. కాని సత్యబుద్ధితోఁ బనులుచేయుచుండునా కార్యనిరతుని స్థానమునందు మాత్రమేమార్పును గలుగదయ్యెను.

ఇట్లాయువకుని నా సుందరి ప్రేమింపసాగెను. కాని తనమనోరథ సాఫల్యమును గుఱించి యాయబల యేమిచేయఁగలదు ? ఏమి యాలోచింప నోపును ? ఇతరుల పోషణములోనుండి, వారినిగ్రహానుగ్రహము లనుభవింప వలసిన యాలేమ, తన యుద్యమమును సాధించు టెట్లు ? ఇట్లు దినములు గడచిపోయెను. " దిక్కులేనివారికి దైవమేదిక్కు " అనునట్లుగఁ దుదకు, పరుల దురాలోచనలె యామెకిట్లు మేలుగఁ బరిణమించెను. బాలాంబకును బోతనరెడ్డికిని మహావైభవముతో వివాహమయ్యెను. బాలాంబమనస్సంకల్పమెంతో యాశ్చర్యకరమగు విధమున ఫలించెను !

---

3 వ-ప్రకరణము.

,, ఆ. వె. సిగ్గువడుటగల్గి - సింగారమునుగల్గి । భక్తిగల్గి
చాల-భయముగల్గిన! యముఁ బ్రియముగల్గి - నరనాథుచిత్తంబు।సీత
దనకు వశముసేసికొనియె. ,, శ్రీరామచరిత్రము.

రాజుగారి మేఁకోడలగుటచేత, బాలాంబయుఁ బాలకోటయర ణమీయఁబడెను. ఆమె భర్తయగు పోతనరెడ్డి యిట్లు పాలకోటకు రాజయ్యెను. పోతనరెడ్డి పాలకోటకును జుట్టుపట్టులనుండు కొన్ని గ్రామములకును బ్రభువై, యేటేటఁ బ్రతాపరెడ్డికిఁ గప్పముగట్టుచు, అతని యాజ్ఞానుసారమునడచుకొనుచుండెను- తానువలచినపురుషుని బరిణయమైతినని బాలాంబయును, దనయాత్మకన్నివిధములఁబరిపూర్ణా నందము నిచ్చుభార్యలభించెనని పోతనరెడ్డియును, మిగులనానందించి యును, ఎంతమాత్రమును గర్వింపకుండిరి. పూవునుదావియును వలె వారి దాంపత్యమెంతో హర్షదాయకముగనుండెను - బాలాంబ, రా జ్యములోని ప్రజలను దనపుత్త్రులవలె భావించి ప్రేమించెను - భార్యనే తనకు ముఖ్యమంత్రిగ నేర్పరచుకొని పోతనరెడ్డి దేశమేలుచుండెను.

దేశరాజధానియును, సుందరీదేవికి వాసస్థానమును నగుకొండ వీటికిఁ జాలదూరముననున్న పాలకోటలోనున్నను, బాలాంబ, సర్పము పడగనీడనున్న కప్పవలెనుండెను. బాలాంబయొక్క యరణపుదేశము నందలి ప్రజలుప్రభుభక్తిగలిగి సుఖజీవనము చేయుచున్నారని భర్త తనతో సంతోషముతోఁ జెప్పునపుడెల్లను, సుందరీదేవి, పైకెంతయా నందించినను లోలోపల దుఃఖింపసాగెను - తానుబాలాంబను బాదు చేయుటకింక నుపాయములామె వెదకుచుండెను.

౨-వ ప్రకరణము.

" సీ. తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁగావఁ జింతించువాఁడు. "

ప్రహ్లాదచరిత్రము.

ఒకనాటి ప్రాతఃకాలము, పాలకోటకొండమీఁద నిద్దఱుస్త్రీల యాకారములుగానవచ్చెను. పలుచనిమంచుతోఁ గప్పఁబడి పర్వతమిం

కయు నంధకార బంధురముగనుండెను. పర్వతమునకుఁ దూర్పు దెస నుండిన పాలకోట యందలి కుక్కుటము లప్పుడె "కొక్కొరుకో" యను శబ్దముల నిడుచుండెను, పర్వతపు వృక్షముల మీఁద నిదురించుచుండిన చిన్న చిన్న పక్షులు, తెలివొంది, తీయనిరుతములు చేయ సాగెను. సూర్యబింబము తూర్పుదిక్కు నింక నలంకరింపకున్నను, ఆదెస తెల్లబారియుండెను. క్రిందిగ్రామములోని వారింక నెవ్వరును బడక విడువలేదు.

ఇద్దఱి స్త్రీల యాకారము లాపర్వతముమీఁదఁ గానవచ్చెడి నని పైని జెప్పితిమి. వారిలో నొకతె సుమారిరువది సంవత్సరముల వయస్సుగలది. ఆమె యనసూన సౌందర్యమునుజూచి, దిశలు తెలివొంది యప్పుడే కలకల నవ్వుచున్నవా యనునట్లుండెను. కాని పాప మేలరూగాని యాముద్దులొల్కు మొగమునందొక కొంతవిచారము కానవచ్చెను. ఆమెతోనుండు స్త్రీ ముప్పది సంవత్సరముల వయస్సు గలది. ఆమె యాకారమును, ధరించిన వస్త్రములు భూషణము లును, మొదటఁజెప్పిన జవ్వనికీమె పరిచారికయని సూచించుచుండెను. ఈపరిచారిక, తన యాజమానురాలు చెప్పనేదోయొక సమాచారము నెంతో జాగరూకతతో వినుచుండెను.

భారములన్నిటిలోను రాజ్యభార మెక్కువ దుస్సహమైనది గదా! మిక్కిలి బరువగు కట్టెలు మోచువాఁడు, దుర్భరమైన భారముతో నడుమువంచినను, పొలమునుండి వెడలి గ్రామముఁ బ్రవేశించినతోడనే, శ్రమనివారణమును గాంచుచున్నాఁడు. సార్థవాహులు వైచిన పెద్దమూటల నిసుకయెడారులలో మెడలు వాయునట్లుగ మోచినను, గమ్యస్థానముఁ జేరినతోడనే ఒంటె సుఖించుచున్నది. ఇఁక రాజ్యభార మన్ననో నానాఁట హెచ్చుచు, రాత్రులైనను భరించువారిని పీడకుండును.

పై యిరువురి స్త్రీలలోఁజిన్నది మన కథానాయికయగు బాలాంబయే. ఆమె చెలికత్తెతో నిట్లనుచున్నది:- ,, సీతా ! వేగమె నీవు పోవలయును. నాథుఁడగు రాజుగారు నాతో నన్ని రాజకీయ విషయములను ముందుఁ జెప్పుచుండునుగదా. ఐనను మామేనమామగారు పంపిన యీయుత్తరువు సంగతి నాకు బొత్తిగాఁ జెప్పలేదు సుమీ. నిన్నరాత్రి, వేగముగఁ గొండవీటినుండి యొక రాజభటుఁడు వచ్చి, కొలువుకూటములోనికి వారిని బిలిచి, యాయనచేతిలో నొక యుత్తరము నుంచెను. దానిని రాజుగారు చదువుచుండఁగా నేను వింటిని. దానిలోని సంగతులేవనఁగా:-

‘ ప్రియమిత్రుఁడగు పోతసరెడ్డిని, రాజు చినవేమరెడ్డిదీవించి, తెలియఁజేయునాజ్ఞ:- మీరాజ్యములోని పాలకోటగ్రామ నివాసులు మాయెడల భక్తిలేనివారై, తాము మాప్రజలు కారనిచెప్పుచు, పరుని కొకనికిఁ దాము పట్టముగట్ట నుద్యమించినట్లు మాకొకరివలనఁ దెలిసినది. ఇది నిశ్చయమగు వార్తయనుటకే సందియమునులేదు. కావున మీకిప్పుడు మేముచేయునాజ్ఞ యేమనఁగా, ఈవార్తయొక్క సత్యాసత్యములుగాని, దీనినెవ్వరుదెలిపియుందురాయన్ను మొదలుగాఁగల సంగతులుగాని, ఆలోచించుటలో కాలమువ్యర్థపుచ్చక, మీరుఈయుత్తరముచేరిన మఱుసటిదినమున వేకువనె, పాలకోట నివాసులనందఱిని, దయాదాక్షిణ్యములు వదలి, తెగటార్పించవలయును. యుద్ధములందు నిపుణులగు నేఁబదిసైనికులనిందుతోఁ బంపుచున్నాను. శిరశ్ఛేదనా కార్యమును వీరిచేతనె గావింపవలయును. కార్యము జరగునటులను, నీముఖ్యస్నేహితులకైనను, తుదకు భార్యకైనను, ఈసంగతి చెప్పఁగూడదు. మాయాజ్ఞ నెంతమాత్రమైన నుల్లంఘించినయెడల, మీరు మాయాగ్రహమునకుఁ బాత్రులగుటయెగాక రాజ్యమును బ్రాణమును దప్పక కోలుపోయెదరు. రాజు చినవేమారెడ్డి, అనియున్నది! ,,

సీత: "అమ్మా! కొండపీటి ప్రభువిట్టి కఠినమగు నాజ్ఞ నేల యిచ్చియుండును? ఇపుడు నేనెచటికిఁబోయి, యేమిచేయవలయును!"

బాలాంబ: ,, చేటికా! మామేనత్త సుందరీదేవి నామీఁదఁ గల పగ సాధింపఁదలచి, యిట్లు నాప్రజలను హింసింపఁ జూచుచున్న దనుటకే సందియమును లేదు. మాపరిపాలనమునందుఁ బ్రజలు సుఖించుచున్నారను వార్త యామహానీయురాలికిఁ గర్ణకఠోరముగనున్నది కాఁబోలు! అయ్యో! జనులారా! మత్కుణములనుబట్టి మంచమునకు దెబ్బలనునట్టు, నామూలమున మీకీయాపద తటస్థించుచున్నది గదా! సీతా! వెఱ్ఱివాఁడై మామేనమామ, భార్యమాటలకుఁ జెవియొగ్గి యీయాజ్ఞనిచ్చెను. న్యాయమూర్తియగు నాభర్త యీయాజ్ఞశిరసా వహింపవలసినదే - దీనివలన మాయందఱికిని శాశ్వతమగు నపకీర్తి వచ్చును; నరకము ప్రాప్తించును - ప్రాణిహింస కంటె నెక్కువగు నాపద లేదు. నేనొక యాలోచనచేసితిని. పైయుత్తరములోని సంగతులు మావారు చెప్పకయె నాకుఁదెలిసినవి కావున, పాలకోట నివాసుల నిట్టిఘోరవధనుండి నేనుదప్పింపఁ జూచుటయక్రమముగాదు. కాఁబట్టి నీవు వేగమె పర్వతముదిగి, పాలకోటయూరిలోనికిఁ బోయి, నడివీధిఁ జొచ్చి, ,, మీకత్యంత ప్రియసఖియగు బాలాంబరాణి మిమ్మందఱిని వెంటనే యూరువిడిచి యోజనముదూరముపోయియుండు నటులగోరు చున్నది. మీయిండ్లలోనుండు సొమ్ములు, వస్తువులు మొదలగునవి సురక్షితముగనే యుండును. మీప్రాణములను వలచి మీ రాణిమాటలను గౌరవించెదరేని, యరగడియలోనే వెడలిపోవుఁడు! ,, అని మెలుఁగ పలికి, వారికి విశ్వాసము గలుగుటకై నాయీ యంగుళీయకమును జూపుము. ప్రజాక్షేమమునకును, ధర్మసంరక్షణమునకును నింకేకార్యమైనఁ గావలసినయెడలఁ జేయుము. వేగ మెపొమ్ము"

అని తన యుంగర మామెకిచ్చి, వెంటనే చేటికనుబంపి, తాను బర్వతముమీఁద నుండు తమకోటలోనికిఁ బోయెను.

సూర్యోదయమగు నంతకు, రాజభటులు కత్తులు మొదలగు యుద్ధసాధనములతోఁ బాలకోట గ్రామముఁ జొచ్చిరి. కాని వారికే యింటనొక మానిసియైనఁ గానరాకుండెను ! ఒక స్త్రీమాత్రమా గ్రామమునఁ గానఁబడి, తానాగ్రామనివాసిని యను సంగతి తప్ప నింకేమియుఁ బలుకకుండెను. భటులామెకు రాజాజ్ఞను జదివి విని పించినను, ఆమె మాఱుమాటాడక, సంతోషపూర్వకముగ నా భటుల యాయుధములకుఁ దన ప్రాణముల నప్పగించెను. ఈమె పాలకోటనివాసుల నూరినుండి పంపివేసి, వారి ప్రాణములు రక్షించి, తానధికముగ మాటాడినయెడల, తన యజమానురాలికేమైన యాపద ఘటింపవచ్చునను తలంపుచేత, తన యాయువుల నామె యెడఁ గల భక్త్యనురాగములకొఱకై ధారవోసిన చేటికామణిగు సీతయె ! ఆహా, ఏమి యీమె ధర్మప్రవణత !

౫-వ ప్రకరణము.

" సీ. సుందరీముఖములఁ జూడఁగోరుచుఁజూడ్కి-
దావకాకృతులపైఁ దగులువడదు. "

భాగవతము.

బాలాంబ చెలికత్తెలిట్టివారు ; ఆమెకుఁ గల ప్రజావాత్సల్యమి ట్టిది. పాలకోటలో నొకస్త్రీతప్ప నెవ్వరును లేకుండుటచేత, నరవధ చేయుటకు వలనుపడకుండెనను వార్త తెలిసినప్పుడు, సుందరీదేవికిఁ గలిగిన విషాద మింతింతనికాదు. సతిదుర్బోధనలచే మొదటఁ దాను ఘోరమగును త్తరువుచేసినను, చినవేమరెడ్డి, కొంచెముమంచి స్వభావ ముగలవాఁడు గావునఁ బరితాపమునొంది, యీఘోరకృత్య మెల్లో జరుపకుండుట కెంతయు సంతసించి, యిట్టి విపత్తు బాలాంబ మంచి

యాలోచనవలననే తొలంగియుండునని యూహించి, తన మేనకోడలి కొక బంగారు కిరీటమును గానుకగాఁబంపి, పాలకోటజనులు హాయిగ నుండవచ్చునని యాజ్ఞనిచ్చెను. కాని మఱుసటి సంవత్సరము పాలకోటజనుల కింకొక విపత్తుతటస్థించెను. అనావృష్టివలనఁ బైరుపండకుండెను. అట్టిసమయమున రాజుప్రజలయెడ మఱింతదయఁజూప వలయునుగదా. కాని, తిరిగి సుందరీదేవిచే బ్రబోధితుఁడై, కొండవీటిరాజు, ఆగ్రామ నివాసులెప్పటికంటె నెక్కువ కప్పము కట్టవలయునని విధించెను! జనులందఱును భయముచేవణఁకసాగిరి. కాని, బాలాంబ తనకుఁగానుకగా నీయఁబడిన బంగారుకిరీటమును మామకుఁబంపి, దానిని దనప్రజలకప్పమునకు మాఱుగాఁబుచ్చుకొమ్మనెను!

ఇట్టి కార్యములవలనఁ గోడలత్తకు బుద్ధిచెప్పెను!

కానిబాలాంబ మరణమునంగతి వినినప్పుడు మాత్రము మనుష్యమాత్రు లెవ్వరికేని గంటనీరురాకమానదు. ఆకాలమునఁ దురుష్కులు హిందూస్థానమునుండి దక్షిణదేశమున కప్పుడప్పుడు దండెత్తి వచ్చుచుండిరి. అప్పుడుహైదరాబాదు రాష్ట్రముండు ప్రదేశమునఁ దురకప్రభువులు రాజ్యములేర్పరచుకొనఁజొచ్చిరి. వారిలో నొకఁడగు నిమాం అనునతఁడు ముప్పదిసంవత్సరముల వయస్సుగలిగి, విద్యావంతుఁడై, తనరాజ్యమును నలుదిక్కుల వ్యాపింపఁ జేయఁజూచెను. అతఁడు, బాలాంబ సౌందర్యమును జారులవలనవిని, యామెను జెఱపట్టవలయునని యెంచి, యొకసేనతోఁ బాలకోటను ముట్టడి వేసెను. దురదృష్టవశమున నాసమయమున బాలాంబభర్త యేదో ప్రభుత్వ సంబంధమగు కార్యమునుగుఱించి, కొండవీడు వెడలిపోవుట తటస్థమయ్యెను. పాలకోటలోఁ గొంచెము సైన్యము మాత్రమేయుండెను. రాణిగారి సెలవైనచో, తురుష్కులతోఁ దమసేనను యుద్ధము చేయించి, జయము సంపాదించెదనని సేనాధిపతి బాలాంబకుఁ దెలియపఱిచెను.

కాని, యెప్పుడును బాలాంబవివేకమునుదాక్షిణ్యబుద్ధియువిడిచి యుండునట్టి స్వభావము గలదికాదు. బలముగల తురుష్కులు తమ చిన్నసైన్యము నవలీలగఁ బరిమార్చి, ధనాగారమును గొల్లవెట్టి జనులనుదోచి బాధించెదరనియు, తనమూలమున నిన్ని విపత్తులు వచ్చుటకుఁ దనకెంతమాత్రము నిష్టములేదనియును జెప్పి, యామె, తన సైనికులకుఁ గోటనుమాత్రము బాగుగఁ గాపాడుఁడని బోధించి, తానొంటరిగ బయలుదేరెను.

ఇట్లామె కోటవిడిచి, పర్వతపు పశ్చిమదిశనున్న యొక దేవళముఁగోఁజొచ్చెను. అదిదుర్గదేవాలయము. లోనికిఁబోయి, బాలాంబ, దేవికిఁ బ్రణమిల్లి, ,,తల్లీ! శక్తీ! నీవిదివఱకు నాగౌరవమును, నా ప్రజల సౌఖ్యమును, నాభర్తయాయువును గాపాడితివి. నీకుఁ దెలియనట్టియు, నీశక్తికి మీరినట్టియు నేసంగతిగాని యుండనేరదు. నాకొక కోరికగలదు. అది యేదనఁగా, మనస్సునందైన నన్యపురుషునెఱుఁగని నా దేహమిప్పుడె తురుష్కుని హస్తములలోనికి రానున్నది. కావున నామానముగాపాడి, వానితప్పును సైరింపుము!,,

ఆమె యింకనిట్లు దేవీప్రార్థనముఁ జేయుచుండఁగనే దూరమున గుఱ్ఱపుగొరిజలశబ్దము వినవచ్చెను. అంతకంతకాశబ్దముసమీపించెను.

ఇట్లు వచ్చినది మహమ్మదుఇమామే. అతఁడు దేవాలయముఁ జొచ్చి, బాలాంబకొఱకుఁ జూడఁగా, ముకుళించిన కరకమలములతో సాగిలపడియుండిన యామెగానఁబడెను. ఆమెదేహమునుండి యప్పుడే ప్రాణములు వెడలిపోయినవి!

---

౬ - వ - ప్రకరణము.

,, ఉ. కేవలమూఢుఁ డజ్ఞుఁడఁగిల్బిషమగ్నుఁడ నిన్ను వేఁడెదన్.
గావుముకావుమోవరద! గావుమనాథుననుందయానిధీ! ,,

—మునివినోదిని

ఇట్లుసాగిలపడి, ప్రార్థనమునందే దేహపరిత్యాగముఁ జేసినయా మానవతి యాకారము గానఁబడఁగనె, తురుష్కుని మానసము నొక వైపున నాశ్చర్యమును, ఇంకొకవైపున ఖేదమును గలంపసాగెను. అట్టి సుందరాకారముగల కాంత నాతఁడెన్నఁడును జూచియుండ లేదు! అట్టి లావణ్యవతి మరణమెవ్వరికి విషాదకరము కాదు ? భక్తి పారవశ్యముచేత నప్పుడామె మోము, వేయిమడుఁగు లెక్కువసౌంద ర్యముతోను, మహిమతోను వెలుఁగొందుచుండెను !

అంతఁదురుష్కుఁడు తనచేతనున్న కత్తినిగ్రిందఁబడవైచి, ,,ఆ రే అల్లా ! చెల్లెలివలె భావింపవలసిన యీ స్త్రీని నేనింకొక విధముగఁ దలచితిని! ఈమె నాకుఁజెల్లెలు. నాకిక బుద్ధివచ్చినది! '' అని నొచ్చు కొని, రాజ్యమును, ప్రాపంచికభోగములను వదలి, తానొక మహ మ్మదీయ సన్న్యాసియై, యాస్థానముననే యొకమసీదుకట్టించి, రేయుం బగళ్ళు ఈశ్వరధ్యానమును జేయఁజొచ్చెను. ఇప్పటికిని బాలాంబ మృతినొందిన దేవళమును, ఇమాముతపస్సుచేసిన మసీదును, గొంత వఱకు శిథిలములయ్యును గానవచ్చుచున్నవి. పశ్చాత్తాపము నొంది ముక్తుఁడైన యిమాము నొక గొప్ప యీశ్వర భక్తునిగ నచటివా రెంచుచున్నారు. ఈసుగుణవతి పేరటభర్తగట్టించినఅంబాపురగ్రామమే యిపుడు అంపాపురమని జనులచే వ్యవహరింపఁబడుచు, బెజవాడకు సమీపమున నున్నది.

ఉత్తమపుష్పము

౧ వ-ప్రకరణము—రత్నాంబ కల.

పూర్వకాలమునందుఁ దన బాహుపరాక్రమముచేతను, విద్యాధికతచేతను, సుగుణసంపదచేతను, రాజన్యశ్రేష్ఠుఁడని బిరుదునందిన కృష్ణదేవరాయలు విజయనగరరాజ్యము నేలుచుండెను. ఆ రాజునకు ''రత్నాంబ'' యను ముద్దుకూఁతురుగలదు. రత్నాంబ, తాను మహారాజపుత్త్రికనని యెంతమాత్రమును గర్వమునొందక, తలిదండ్రులయందు భయభక్తులు గలిగి, వారు తనకుఁ జెప్పించు సువిద్యలన్నియు మిగుల శ్రద్ధతో నేర్చెను. కావుననే, పదునాలుగు సంవత్సరముల లేఁతవయస్సులో నున్నను, రత్నాంబ, యాకాలమున గొప్పయింటి బాలలు నేర్వవలసిన విద్యలను, ధర్మములను నేర్చి, తన పుట్టుకచేతనే గాక తనసౌందర్యముచేతను, బుద్ధిచతురతచేతను, నయసంపదచేతను, దప్పక ''మహారాజుపుత్త్రిక''యె యని యందఱిచే ననిపించుకొనెను. సాధారణ భాగ్యవతులవలె రత్నాంబ వ్యర్థమగు నాటలయందును, సుఖములయందును గాలము గడుపక, యుపయుక్తములగు విషయములను గుఱించి, తన చెలికత్తెలతోఁ బలుమారు ప్రసంగించుచుండును,

ఒకనాఁడు ప్రాతఃకాలమున రత్నాంబ తన యుద్యానవనమున నొక వేదికమీఁదఁ గూర్చుండియుండెను. చెలికత్తెలు చుట్టునుగూర్చుం డిరి. చల్లనిగాలివీచి, తోఁటలోనుండు పూవుల సువాసనలచే వారి నందఱిని సంతోషపఱచుచుండెను. అట్టి మంచిసమయము నూరక గడుపుట కిచ్చగింపక, రత్నాంబ చెలికత్తెలతో నిట్లుసంభాషించెను.-

,,సఖులారా! నిన్నటిరాత్రి నాకొకచిత్రముగుకలవచ్చినది. కలలో, నేనొక మిక్కిలి చక్కనిపూవునుజడలో ముడుచుకొనినట్లును, అప్పుడు మీరును, ఇంకనితరబాలలును నాచుట్టునుజేరి దాని యందమును, మిక్కిలికొనియాడుచుండినట్లునునాకుఁదోఁచెను. ఆపూవేమియైయుండునా యని నేను దలపోయుచున్నాను. మీలో నెవరైన దానిని నిర్ణయించి, నాసంశయమును దీర్చినయెడల, వారిని నేను నాప్రాణసమానముగాఁ జూచుకొనుచు నొకమంచిబహుమతి గూడ నిచ్చెదను!'' అనిపలికెను. తమ మిత్రమగు రత్నాంబకలగనిన పూవేమియో గనుగొనవలెనని యామెనలుగురు చెలికత్తెలును బాగుగ నాలోచింపసాగిరి. అంతఁ గొంతసేపటికి ,,దుర్గావతి'' యను బాలిక యిట్లు చెప్పఁదొడగెను.

౧వ పరికరణము—కమలము.

దుర్గావతి: ,, చెలియలారా! మన చిన్నరాణియగు రత్నాంబ కలలోఁ జూచిన పూవు కమలమని యెంచెదను. పుష్పములలోఁ దామరపూవు మిక్కిలి రమ్యమైనదని చెప్పవచ్చును. కొలని మధ్య నుండి బాగుగ వికసించిన తన సుందరాకారముతోఁ జూచువారి కన్నులను, హృదయములను నాకర్షించుచుండు నీ పూవెంత దర్శ నీయముగనుండును! ముత్యముల మధ్యనుండు కెంపువలెను, ఆకాశ ముననుండు సూర్యబింబమువలెను, జలమధ్యముననుండి ప్రకాశించి, కమలము, ఎల్లని తనసుందరాకారముతోఁ గన్నుల రంజిల్లఁ జేయుచు

న్నది. ఆహా ! తామరపూవునుండి వెడలు సువాసన లెంత యింపుగ నుండును ! తక్కినపుష్పములవలెఁ బద్మము తన యధిక సువాసనలచే నాసికను మొత్తక, కొంచెముమాత్రమె మంచి వాసనల నిచ్చుచు, ఘ్రాణేంద్రియమున కొక విధమగు నిర్మలానందము నొసఁగుచున్నది ! ఇంకఁ దామర పూవును గోమలత్వమునందు మించినది పుష్పజాతిలో నేదైన కలదా ? మృదుత్వమే పుష్పమున కుండవలసిన ముఖ్యగుణము. మెత్తఁదనములేని కుసుమము, తీయఁదనములేని తేనెవంటిదే. తామరపూరేకులను మనము చేతులతోఁ దాకినప్పుడు, మన కమితానందము గలుగుచున్నది. ఇన్ని విధములఁ బ్రసిద్ధినొందినదగుటచేత, కమలమే యుత్తమపుష్పమని యెంచెదను !" అని దుర్గావతి చెప్పెను.



3-వ ప్రకరణము.— చేమంతిపూవు.

స్నేహితులతోనున్నప్పుడు, మన మనసులోఁ గొంచెము సందియమును దాఁగనేరదుగదా ! "విశాలాక్షి"కి దుర్గావతి పలుకులు కొంత వఱకు నిజమేయనితోఁచినను, కొన్ని సంగతులం దామె వేఱే యభిప్రాయము గల్గియుండెను. కావున విశాలాక్షి పట్టుదలతో నీక్రిందివిధముగాఁ జెప్పెను—"చెలియలారా ! రాణి రత్నాంబ ప్రశ్నము

నకుఁ దన యుత్తరమే సరియైనదని దుర్గావతి యనుకొనుచున్నది కాఁబోలు ! పూవులలోఁ జేమంతిపూవే శ్రేష్ఠమని నేను దలంచెదను. చేమంతి పూవునందుఁ గమలమునకుఁ గల యందము లన్నియునున్నవి. దానికిఁగల లోపము లేమియు లేకపోవుటయేగాక, మఱికొన్ని మంచి గుణములు గూడ దీని యందుఁ గలవు. మృదుత్వమునకుఁ జేమంతి, తామరపూవునకుఁ దీసిపోవునా ? సువాసనలకు దీనికిని దానికిని బోలికయే లేదని చెప్పవచ్చును. వాదమునకే దుర్గావతి కమలము యొక్క గుణములను వర్ణించినట్టు తోఁచుచున్నది. దుర్గావతి పలుకులలోను, కవులవర్ణనలయందునే, పద్మములకుఁ జక్కని వాసన గలదు గాని, స్వాభావికముగఁ గానఁబడదని యెవరికిఁ దెలియదు ? తామరపూవు యొక్క రంగును, జలమధ్యమున రేకులు విప్పుకొని యున్నప్పటి దాని యాకారమును, దుర్గావతి వర్ణించుట, కాషాయవస్త్రములనుధరించి, విజనప్రదేశమునఁ దపస్సు చేసికొనుచుండు యోగినిని వర్ణించుటను బోలియున్నది ! చాలు చాలు ! పూవున కాకారమే ప్రధానముగదా. పుష్పమనునది చిన్నదిగనుండి ముద్దు లొల్కుచుండవలయునే గాని, తామరపూవువలె గంపంతగానుండిన నేమి సొగసుఁదనము ? అట్టి పూవును బూఁబోండ్లు జడలో ముడుచుకొనుటెట్లు ?

ఇంతేకాదు; రంగులలో నెల్ల పసుపురంగే ప్రధానము. లోహములలో నెల్ల సువర్ణ మెట్లౌన్నత్యము గాంచి మెఱయుచున్నదో, పసిమిరంగుతో మిసమిసలాడు చేమంతియును, జూపరుల నయనహృదయముల నానందింపఁ జేయుచు, పుష్పజాతిలో నాధిపత్యమును వహించుచున్నది. నల్లని కురుల మీఁదికి బంగారమును బోలిన పచ్చని చేమంతిపూవే యందముగ నుండునుగాని, యుండియు లేనట్టుగనుండు నెఱుపురంగును దాల్చిన కమల మేమిబాగుగనుండును? కావున నేవిధమునఁజూచినను బూవులలోఁ జేమంతిపూవే ప్రశస్తమైనదని తలంచుచున్నాను!" అని విశాలాక్షి చెప్పెను.



౮ వ ప్రకరణము—మల్లెపూవు.

వాదమున కంతమును, సముద్రమునకు లోఁతును గానిపించుట దుర్లభము. అదివఱకెంతో యన్యోన్యభావముతో నుండు చెలికత్తెలకు వాదము మూలమున నిట్లు కోపమాత్సర్యములు గల్గుటచూడఁగా, రాణి రత్నాంబకుఁ గొంతభయము గలిగెనుగాని, వారి వైరము క్షణకాలముమాత్రమె యుండుననియును, ఇట్టివాదనల మూలముననె సత్యమును నిర్ణయింప వచ్చుననియును నెంచి, యీ విషయమునఁ దక్కిన యిద్దఱు చెలికత్తెలుగూడ మాటాడవచ్చునని రాణి సెల విచ్చెను. అప్పుడు „శ్యామలాంబ" యిట్లు చెప్పఁదొడంగెను.—„చెలికత్తెలారా! ఇదివఱకుఁ జెప్పిన యిద్దఱి వాదములను మనము ముచ్చటతో వింటిమి. కాని, వారిరువురునుగూడ నొక పొరఁబాటు పడుచున్నారు. పుష్పమునకుఁ బ్రధానగుణము మృదుత్వమని యొకరును, రూపమని మఱియొకరును దలంచుచున్నారు. ఈ యిద్దఱిమతమును సరియైనదికాదు. కుసుమమునకుఁ బరిమళమే ముఖ్యమైనది. సువాసనలతోఁగూడ మంచిరూపమును మెత్తఁదనమును నుండినచో, పుష్పముయొక్క చక్కఁదనమునకు మఱింత వన్నెవచ్చును. పూవులకు రాణియనఁదగుమల్లెపూవును జూడుఁడు. ఒక్కొకసారి దానిపరిమళము నాఘ్రాణించితిమేని, హృదయమున కపారమగు సౌఖ్యము గలుగును; మనస్సునకు సుఖదాయకములగు సంగతు లెన్నో స్ఫురిం

చును; ఎన్నో పవిత్రమగు నూహలు జనించును. ఒకటేల! మల్లెపూవుల తావి యాత్మ నన్ని దెసలను బొంగించి, యొక్కింతసేపు, ఈ శరీర బంధములనుండి పాపి యాత్మకాముష్మికమును సాక్షాత్కరింపజేయును!

రంగులలోఁ దెలుపే యుత్కృష్టమైనది. నిర్మలమగు తెల్లనిరంగును దాల్చిన మల్లెపూవు మనకు మలినపు కోరికలనుగాక, పవిత్రమగు వానినే స్ఫురింపఁజేయును. నవరత్నములలోను నుత్తమమగు వజ్రము వలెనే, పుష్పజాతిలో మల్లెయును దెల్లనియాకారమును దాల్చి తేజరిల్లుచున్నది. మల్లియల తెల్లనిరంగు కడమ రంగులవలెఁ గొంతసేపటికిఁ గన్నులకు బాధ గలుగఁజేయక, సేదదేర్చుచున్నది. మల్లెపూవు లెంత కోమలములుగ నుండును! బొండుమల్లియవంటి స్నిగ్ధమగు పదార్థము మఱియొకటికలదా ? ఇన్నివిధములఁ బ్రఖ్యాతిఁగాంచిన మల్లెపూవే రాణి రత్నాంబకలలోనికి వచ్చియుండు'' నని శ్యామలాంబ చెప్పెను.

౫వ-ప్రకరణము—ఉత్తమపుష్పము.

ముప్పురు చెలికత్తెలవాదమును వినిన రత్నాంబ, ఉత్తమ పుష్పము వీరుచెప్పిన మూఁడుపూలలో నేదోయొకటియై యుండవలయు ననియును నింతకంటె వేఱుగా నుండనేరదనియును దలపోయుచుండెను. కావుననే, తానుగూడ మాటాడెదనని "సత్యవతి'' లేచుట యామెకమితాశ్చర్యమును గలుగఁజేసెను సత్యవతి వర్ణించుట కింకొకపుష్పమేదొరకదనియును, అందుచేత నామెను మాటాడ నిచ్చుటయే వ్యర్థమనియును రాణిరత్నాంబ యెంచెనుకాని, యందఱివలెనే యామెనుగూడ మాటాడ నిచ్చుట న్యాయ్యమని యామెకుఁబిమ్మటఁదోఁచెను. ఇంతేగాక సత్యవతి యందఱివలెను బెక్కుమాటలాడు బాలగాక, మితభాషిణియై శాంతస్వభావమును గలిగియుండునది. కాఁబట్టి యట్టి

గుణవతిని (మాటాడవలదు నుటకు నోరురాక, మీఁదు మిక్కిలి, యామె చెప్పఁబోవు సంగతులు తప్పక మంచివిగనే యుండునని యెంచి, “సత్యవతీ ! నీవుగూడ మాటాడవచ్చును.” అని రత్నాంబ పలికెను. అంత సత్యవతి యిట్లు ప్రసంగించెను.

“సోదరీమణులారా ! నేఁడు మిక్కిలి చక్కని పుష్పమును గుఱించి మీరుచేసిన ప్రసంగములు మిగుల యోగ్యముగనున్నవి. నేను గూడ మాటాడుట యనావశ్యకమని నాకుఁదోఁచినను, తోఁచిన సంగతులు చెలులయొద్ద చెప్పకుండుట యుక్తము కాదనియెంచి, మీతోఁ బలుక సాహసించు చున్నాను.

“ఇదివఱకుఁ జెప్పినవారు పూవుల యందు మృదుత్వము, సురూపము, సౌరభమునను మూఁడుసుగుణములుండవలయునని చెప్పిరి. అదిసత్యమే. కోమలముగనుండని పూవులను గంటకములతో సమానముగఁ జూచుచున్నాము. సుందరముగ నుండనివానినుండి యంధకారమునుండి వలె కన్నులు మరలుచున్నవి. నిర్గంధకుసుమములను నాసిక నిరసించుచున్నది. ఈమూఁడుగుణములును, నాయా పుష్పములం దాయా విధములుగ నున్నవి. బొత్తిగా నీమూటిలో నొకగుణమైనను లేని పూవుండుట యరుదు. ఒక్కొక పుష్పమునం దొక్కొకగుణ మతిశయించియుండును ఒక పూవునందే యన్నిగుణములును మిక్కుటముగ నుండుటయును నరుదే. మృదుత్వమునందుఁ గమలమును, సురూపమునందుఁ జేమంతియు, సుగంధమునందు మల్లెయును బేరువడసినవని యందఱు నొప్పుకొందురు. పూవులయొక్క స్వతస్సిద్ధములగు ధర్మము లెట్లున్నను, వానియొక్క గౌరవము, ఆనందించు మనుష్యుల మనసులనుబట్టిగూడఁ గొంతవఱకుండును. కొందఱికిఁ బచ్చనిరంగుగల పూవులును, కొందఱి కెఱ్ఱని రంగుగలవియును, మఱి కొందఱికిఁ దెల్లనివియును, నిష్టము. ఇట్లే పరిమళాదులను గ్రహించుటయందును మనము కొంతవఱకు వేఱువేఱు అభిప్రాయములను గలిగియున్నాము.

కాఁబట్టి యీవిషయమున మనము సత్య మిదియేయని నిష్కర్షగాఁ జెప్పుట సాధ్యముగాదు. సత్యము నిర్ణయింపలేమని నిరుత్సాహము నొందఁ బనియును లేదు.

,,పూవులయందు సురూపము, సౌరభము, కోమలత్వమును నను మూఁడు సుగుణము లుండునని మన చెలికత్తెలు పలికిరి. కుసుమము లందుండునవీ మూఁడుసుగుణములే యననేల ! తీయని మకరందము నిచ్చి పూవులు నాలుక కెంతసంతోషపఱుచుచున్నవి! మందమారుతము వీచునప్పుడు, తమ సంతోషమును బట్టఁజాలక కొమ్మలనుండి క్రిందికిఁ దుముకుచున్నవా యనునట్టుగ నేలపై రాలు పూవుల జలజల ధ్వనులును, గుసుమముల సుగంధముచేతను, మకరందపానముచేతను, నమితానందమునొంది, శ్రవణసుఖముగ గానముచేయు తుమ్మెదల రొదలును, మనకర్ణమున కెంతహాయి నిచ్చుచున్నవి! కాఁబట్టి, పూవులమూలమున నొక కొన్ని యింద్రియములేగాక, యన్నియింద్రియములును సుఖించుచున్నవి ఒక పంచేంద్రియములే యననేల, మనసు గూడ వానినిజూచి మిన్ను ముట్టుచున్నది.

,,నరుల కిట్లెన్నివిధములనో పూవులు సంతోషము నొడఁగూర్చుచున్నవి. కాని మనుజులుమాత్రము, పూవులు మన సంతోషమునకే గాక, యితరప్రయోజనమునకును నేర్పడినవని గ్రహింపవలయును. చెట్టుయొక్క ముఖ్య ప్రయోజనము, పండ్లుగాచుట. పూవులె యట్టి పండ్లుగాచుట కాధారమగుచున్నవి. పూవు బాగుగ లేనియెడల, ఫలము మంచిదిగ నుండనేరదు. ఫలము లుత్పత్తిగానియెడల, విత్తనములులేక, యచిరకాలములలోనే, చెట్లు నశించును. కాఁబట్టి పూవులత్యంత ప్రయోజనకారులుగదా.

,,కాఁబట్టి మన మిప్పుడీసంగతు లన్నిటినిఁబట్టి, మిక్కిలి చక్కని పుష్పమేదో నిర్ధారణ చేయవలయును. ఉత్తమపుష్పము సకలేంద్రియములకును, హృదయమునకును నధిక సంతోషమును, గలుగ

జేయుచు, మంచిఫలములనుదాల్చి, వృక్ష మీలోకమున శాశ్వతముగ వర్ధిల్లునట్లుచేయవలయును. మంచిపుష్పములం దీగుణములలో ననేకము లున్నను, అన్నిసుగుణము లత్యధికముగ నుండుట మనము చూచు చుండుటలేదు. ఈనిమిషమున రేకులువిప్పి మందహాసము చేయు చుండు పూవు, ఒక్కింతసేపటిలోనే, తలవంచుకొని, యణఁగిపోవు చున్నది. ఏ పూవుయొక్క తావియును క్షణభంగురముగ నున్నది. మకరందము, కోమలత్వము మొదలగునవి గడియలో మటుమాయ మగుచున్నవి. కాఁబట్టి యిట్టి విఘ్నములకు లోనుగాక, శాశ్వతాభి వృద్ధి నొందుచు, శాశ్వత సౌఖ్యముల నిచ్చుచుండు పూవేదియైనఁ గలదా ?

,,చెలియలారా ! లేదని భీతిల్లవలదు. దయ యనుకుసుమమున కీ సుగుణము లన్నియుఁగలవు. దయ దాల్చినవారిరూపమె రూపము. దయార్ద్రహృదయమునకంటెఁ దీయని మకరందముగల పూవు గాన వచ్చునా ? దయగలవారి పల్కులకంటె శ్రవణానందకరమగున దేమి గలదు ? కరుణాన్వితులకీర్తివలెఁ బూవులతావులు వ్యాపింపఁగలవా ? జాలిగలవారి క్రియలకంటెఁ దామరపూవు లెక్కువ మృదువైనవిగ నుండునా ! ఆహా ! దయయను నుత్తమపుష్పము, మనుజుల కిట్లమిత సౌఖ్యము నొడఁగూర్చుచున్నదిగదా ! కోమలత్వము, సుగంధము మొదలగు వానిని కొలఁది కాలములోనే పుష్పము గోలుపోయి, వ్యర్థ మయి, నశించుచున్నది. దయాకుసుమమట్లుగాక, పెరిఁగిన కొలఁదిని వన్నె గాంచుచు, నితరుల సౌఖ్యము నభివృద్ధిఁజేయుచున్నది. దయ యను పూవునందుఁ గలుగు ఫలములను నేను వర్ణింపఁ జాలను. సుగుణజాలమను నీఫలములు, ఆత్మ యను తమ మూలవృక్షమును, గొంతకాలము వఱకే కాక, శాశ్వతకాలమును వర్ధిల్లు నట్లు చేయు చున్నవి !

,,కావున, భూలోకమునందలి పుష్పములలో దయయను నదియే యుత్తమ పుష్పమని మెచ్చుచున్నాను. అట్టి కుసుమమును ధరించిన

యెడల, మనరాణి సౌందర్యమును, మహిమమును, సర్వకాలములందును, సర్వ దేశములందును వ్యాపించి, జనుల కానందము నిచ్చును. మోక్షమునకు హేతువగును'' అని సత్యవతి పలికెను.

రత్నాంబ, ఇట్లు తనచెలికత్తెల సంభాషణములువిని, మిక్కిలి చక్కనిపూవును సత్యవతియే కనుగొనినది యని నిర్దేశించి, యామెకొక గొప్ప బహుమతి నిచ్చి, యప్పటినుండియు నామెను దనముఖ్య మిత్రిముగఁజూచుకొనుచుండెను. నాటినుండియును, రత్నాంబదయయే తన ముఖ్య భూషణముగఁగైకొని, తన సద్వర్తనముచేతను, ధర్మకార్యములచేతను శాశ్వతకీర్తిని సంపాదించెను. బాలికలారా! రత్నాంబవలెనే మీరును మిక్కిలి చక్కని పుష్పమగుదయను దాల్చి, వన్నెకెక్కవలయును.

గౌతమి.

బాల్యావస్థ.

నే నెక్కడ జనించితినో, నాతలిదండ్రు లెవరో నాకుఁ దెలియదు. నా చిన్ననాఁటి దినములు జ్ఞప్తికిఁ దెచ్చుకొనునప్పుడు, ఉన్నతమైన కాయమును తెల్లని ముఖకాంతియును గల యొక కుక్కయాకారము స్ఫురించుచుండును. స్తన్యపానము చేయుచు దాని వెనువెంటనే నేను దుముకుచుఁ బోవుచుండుట నాకుఁ దోఁచుచుండును. కాని యానాఁటి సంగతులు వివరముగను వరుసగను నేను జెప్పఁజాలను. పిమ్మటఁ గొంతకాలమునకుఁ దటస్థించినవి మాత్రమే నేను గుర్తెఱుఁగుదును.

ఒకానొక దినము నేను వాయువేగముతో గ్రామములో నొక క్రొత్త వీథిని బరుగెత్తి పోవుచుంటిని. ఇరుపార్శ్వముల నుండియు నప్పుడు కుక్కలు నన్ను ముట్టడింప సాగెను. నేను వానిని లెక్కసే

యక, పిక్కబలము చూపి పోసాగఁగా, నా దేహమంతయు గాయము లతోఁ గప్పఁబడెను. శత్రువుల గోళ్ళగీఱులును, పండ్లకాటులును దిగి నాశరీరమునుండి రక్తధారలు సెలయేళ్ళవలె స్రవింపసాగెను. కాని యింతటితో శునక సమూహమునకు మత్సరము శమింపలేదు. అలసట చేతను బాధచేతను గొంతవడికి నేను నేల బడితిని. కుక్కలు చుట్టును జేరి నన్నింకను బాధింపఁ జొచ్చినవి. ఒకటి చెవిపట్టిలాగును ఇంకొకటి తోఁక పెఱుకును. వేఱొకటి కాలు కొఱుకును. ఇటు లుండఁగా గుభాలునఁ బెద్ద శునక మొకటి యెచటినుండియో వచ్చి నాగొంతును పట్టుకొనెను. అంతటితో నాకుస్మృతి తప్పిపోయెను. మరణ మాసన్నమయ్యెనని తలంచితిని.

కాని కొంతసేపటికి నాకు స్మృతికలిగెను. మృత్యుదేవత యప రావతార మనఁదగు ఆపెద్దశునకము వాతనుండి నన్నెవ్వరు తప్పించిరో, ఎంతకాలము నేను స్మృతిలేని యవస్థయందుంటినో, నాకుఁ దెలియదు. కాని యిపుడు నేనొక నిశ్శబ్దమగు చావడియం దుంటిని. నాశరీరమునందలి గాయములకు మందు దట్టముగఁ బూయఁబడి యుండెను. అప్పుడప్పుడు వయసుదీరిన యొక మనుజుఁడు వచ్చి నాముఖమును నిమురుచు, తన కన్నులనుండి రాలు బాష్పములను తుడుచుకొనుచు, నాబాధను శమింపఁజేయఁ జూచుచుండును. ఇట్లాయనవచ్చి నాకుపచారములు చేయునపుడెల్లను నేను దోఁక నాడించుచుందును. నాకు దగ్గఱగఁ జాఁపబడిన యాతని హస్తమును నాకుచుందును. ఆపత్కాలమునఁ గనిపెట్టినవారేగదా నిజమైన తలిదండ్రులు! అమిత బాధచే నహర్నిశమును నేను గనులు మూసికొని మూలుగుచున్నను, ఈయన వచ్చి నాచెంత నుండునపుడు మాత్రము నాబాధకుఁ గొంత యుపశమనము గలుగుచుండును.

—♦ మిత్రులు . ♦—

ఆయింట నుండునది నారక్షకుఁడగు నీపురుషుఁడుగాక యింకొ రిరువురు మాత్రమే. వారు, ఒక వృద్ధస్త్రీయును, ఒక బాలికయును.

నాకు గంజిపోయునపుడు మాత్రమే యవ్వ వచ్చుచుండును గాని, బాలిక తన తండ్రియగు నారక్షకునితో వచ్చి నన్ను పలుమాఱు సందర్శించుచుండును. మొట్టమొదట నన్ను సమీపింప నామె వెఱచుచుండినను, అంతకంతకు నే ననిన రోఁత వెలవులు లేక, తండ్రివలెనే నాకు సాహాయ్యముఁ జేయుచుండును. జ్వర తీవ్రతవలన నా కాఁకలి నశించి యాహార మసహ్యమైన యా దురవస్థయందు నాకుఁ దిరిగి భోజనమం దిష్టము కలిగించిన మహనీయురా లీమెయే. చిఱునవ్వుతో నలంకరింపఁబడిన యీమె వదనపద్మము నాకన్నుల యెదుటఁ దోఁచిన తోడనే, నా బాధకుఁ దీక్ష్ణత తగ్గుచుండును. ఈమె చిన్నిచేతుల పోయు గంజి యెంతో మధురిమఁ దాల్చియుండును. నాయం దపరిమిత మగు దయ గలిగి యాబాల రొట్టె ముక్కలు మిఠాయి మొదలగు స్వాదినవస్తువులు దెచ్చి నాజిహ్వకుఁ దిరిగి చైతన్యము గలిగించెను. ఆబాలిక దయాపూర్వకముగ నా కిచ్చుచుండు ముద్దుపేరులకు లెక్కలేదు. ఆమె నా యెడలఁ జూపించిన కరుణయును ప్రేమయును నే నెన్నఁడును మఱచి పోఁ జాలను.

ఇట్టి గృహస్థుల దయయే కారణముగా నేను బునర్జీవము నొందితిని. నానాఁట నాగాయములు మానిపోయెను. శరీరమునకుఁ గ్రొత్త నెత్తురు పట్టెను. సోయగ మిగిరించుచుండ నే నంత గ్రామములో రాకపోకలు సేయుట కారంభించితిని. మావీధిని గల శునకము లన్నియును నా బలమును జూచి నన్ను మన్నింపసాగినవి. ఏ యుపద్రవమును లేక నేను మావీధిలో నిచ్చావిహారము సలుపుచుందును. పగలంతయును గ్రామములోని రాచకార్యములను చక్కపెట్టి రాత్రి పూఁట నిలుసేరుచుందును. అంత సత్యాదరముతో నా రక్షకు నింట నా కాహార మిడుదురు.

—♦ దినచర్య. ♦—

ఆకాలపు నాఁటి నాదినచర్య నాకు జ్ఞప్తిలో నున్నది. వేకువనె నేను నిద్రనుండి లేచునప్పటికి, నారక్షకుఁడు లేచి గ్రంథకాల

క్షేపము చేయుచుండును. అంత నే నాయన దగ్గఱకుఁ బోఁగా, ఆయన నా దేహము నిమురుచు, ,,ఇఁకఁ బోయిరా ! '' యని పలుకును. వారి యనుజ్ఞగైకొని నేను వీథిలోనికిఁ బోయి గ్రామవ్యవహారములు చక్కఁ బెట్టుచుందును. వీథిసంరక్షణము శునకజాతికి విధికృతమైన కార్యము. గ్రామములోని ప్రతి వీథియును, ప్రత్యేక శునక సమాజ పరిపాలనమునకు లోనయి యుండును. వీథిలోనికిఁ గ్రొత్తవా రెవరును రాఁగూడదను నది మా సమాజపు మొదటి నిబంధన. ఇది మాత్రము మానవులయెడఁ బూర్తిగ వర్తింపఁజేయుట మాకు సాధ్యము గాదు. కావుననే మానవు లిన్ని యనర్థముల పాలగుచున్నారు. కాని మావిధి మేము నెఱవేర్చుకొనుచుందుము. క్రొత్త మనుష్యుఁడు గాని, క్రొత్తవేషము ధరించినవాఁడు గాని, వీథిఁ బడఁగనే, మేము మొరుగుచుందుము. ఇంకొక వీథి కుక్క కానఁబడఁగనే మేము మొఱుఁగుచు, దానిని ముట్టడింతుము. అదిపారిపోయి తప్పించుకొనినఁ గాని దాని పరువు నిలువదు. అది తోఁక ముడుఁచు కొని నచో నింక దాని వంకఁ బోము. వీథిలోనుండి పిల్లులు మొదలగు క్షుద్రజాతి జంతువులను బాహాటముగ మేమునడవనీయము. వన్యమృగము లేవైన దూరమున నుండఁగనే మేము పసిపట్టి, ఆజాడ లూరి వారికిఁ దెలియునట్టుగ బొబ్బలిడెదము. ఒక్కొకసారి రాత్రులుమాకన్నులకుఁ బగ లెన్నఁడును గానరాని వికృతాకారములు పొడసూపును వెంటనే మేము, ఆకాశమువైపునకుఁ దలలెత్తి పాలికేకలిడుచుందుము. వీథిలోనుండు కుక్కలన్నియు నొక్కపెట్టున నేడువఁగా నాయాకారములు మటుమాయమగును ! ఏదో యొక కాలమునందు తప్ప, సామాన్యముగ శునకజాతివారందఱును నిరంతరముమిత్రతతో నుందురు. ఊసు పోనపుడు మేము చెరలాటములతోను, కృత్రిమపుఁ బోరాటములతోను గాలము గడపుదుము.

ఇటువంటి బయటి పనులు చక్కబెట్టుకొని నే నిలుచేరి యజమానుని దగ్గఱకుఁ బోఁగా, అప్పు డాయన ప్రేమము ఉట్టిపడునట్టుగ నాశరీరమును స్పృశించును. తోఁక యాడించుచు, నాయన చేతిని దాఁకుచు, ,,కుయ్యో'' యని మొఱుఁగుచు, నాయనయెడల ననురాగము నగపఱచుచుందును. అంతట నాయన స్నానమొనర్చి భోజనము నకుఁ బోవును. ఆ సమయముననే యవ్వ నన్నుద్దేశించి, ,,గంజిమూఁకుడు తెచ్చుకొమ్మ '' అని పలుకును. నే నపుడు దొడ్డిలోనున్న మూఁకుడు దెచ్చుకొందును. దానిలో నాకుఁ గావలసిన యన్నమును గంజియువైతురు. అది భుజించి, తిరిగి మూఁకుడు యథాస్థానమునఁ జేర్చి చావడిమీఁద నేను విశ్రమింతును.

మధ్యాహ్నసమయమున నేను యజమానుని జేరరాదు. ఈనిర్బంధముయొక్క యర్థము మొట్టమొదటి దినములలో నాకుఁ దెలియక, నామీఁద యజమానునికిఁ గోపమువచ్చెనా యని తలంచుచు వచ్చితిని. కాని, యంతకంతకు, నాయన సిష్టాపరుఁ డనియును భోజనానంతరమున నను స్పృశింపఁనొల్లఁ డనియును నేనుగుర్తెఱిఁగి, జాగరూకతతో నేనాయనకు దూరము గనే తిరుగుచుందును. అవ్వగారిని నేనెపుడును సమీపింపనే కూడదు. నాయజమానుని కొమార్తె యగు "మీనాక్షి''కిని నాకును జెప్పనలవిగాని మైత్రి. ఆమె యిల్లు విడిచి యెచటికిఁ బోయినను దిరిగి యిలుసేరువఱకును నేనామెను వెంబడించుచుందును. ఆమెచెలికత్తెలమీఁదికి నే నెన్నఁడును పోవుదానను గాను. కాని దుష్టులెవరైన నామెకుఁ జెఱుగు చేయఁజూచినచో నిఁక వారి కర్మము మూఁడినదే. ,,గౌతమీ! ''యనునామె పలుకు నాకెంత దూరమున వినవచ్చినను, కనుతెప్ప గీటునంతలోనేను మీనాక్షి దగ్గఱకుఁ బోయిచేరుదును. ఆహా !ఆమె ముద్దు పలుకులకును ఇతరుల మాటలకును ఎంత వ్యత్యాసముగలదు ! నాహృదయమునకు మీనాక్షికంటెఁ బ్రియతరమగు వస్తువేదియును గానరాదు. ఆమె నాబహిఃప్రాణమే.

—♦ యజమానుఁడు. ♦—

శునకజాతి జంతువునగు నాకు మానవుఁ డగు నా యజమానుని యూహాపోహములు కష్టసుఖములు నేమి తెలియఁ గలవు? ఐనను నేను బగటిపూఁట చావడిమీఁదఁ బండుకొని యుండునపుడు, సదా కనులాయన వైపునకే త్రిప్పి ఆయన ముఖావలోకనము చేయుచుందును. ఆయన మితభాషి, నైష్ఠికుఁడు. గ్రంథకాల క్షేపమునందును ధ్యానమునందును గాలము గడపుచుండును. ఆయన యాలోచనల విషయములు నాకు దుర్గ్రాహ్యములైనను, అవి యుత్కృష్టమైనవని మాత్రము నా దృఢవిశ్వాసము. ఆయన యాజ్ఞలను జవదాఁటకుండుటయే నాముక్తి. ఆయన యభిమతము నెఱవేర్చుటయె నాకు మోక్షము. అట్టి మహనీయుని వాక్కులనే నిదానముగ జేసికొని, ఆయన కనుసన్నలనే మెలఁగవలె నని నాయుద్యమము. కావున శునకజాతి చర్యలందు నాకు వాంఛ క్రమక్రమముగ తగ్గసాగెను. ఒక్కొక్కప్పుడు కొన్ని దినములవఱకును నేను తోడి శునకములను దర్శించుటకు వీథిలోని కడుగైన నిడను. నాయజమానుని ముఖమునందు నిమేష నిమేషమునకును గానవచ్చెడి మార్పులను బరికించుచుందును. అర్థముబోధపడకున్నను ఆయనచదివెడి సంగతులు వీనులాఁరవినుచు, నేను బుద్ధికుశలతఁ దాల్చియుందును. నా కాయనయందున్న వెఱ్ఱి విశ్వాసమున, పరమోత్కృష్టములైన వని యాయనచర్యల నే ననుకరింతును. ఆయన నెలకు రెండుపర్యాయము లుపవసించును. నేను నటుల చేయుటకు అలవఱచుకొంటిని. ఒక్కొక్కతఱి ఆయన రాత్రిపూఁట భుజింపకుండును. నేను నపుడు భుజింపనొల్లను. నాయందు జాలిగొని అట్టిసమయములందు యజమానుఁడు భుజింపుమని నన్నెంత ప్రేరించినను నే నారగింపను!

—♦ మీనాక్షితో నెడఁబాటు. ♦—

ఇట్లు దినములు మాసములు వత్సరములును గడచిపోయెను. మీనాక్షి నాకన్నుల యెదుటనే పెరిఁగి పెద్దదయ్యెను. అంత నా

యజమానుని యింట నొక గొప్ప యుత్సవము జరిగెను. ఎంద ఱెందఱో యతిథులు వచ్చిరి. అందఱు క్రొత్తవారగుటచేత, వారియెడల నేను ద్వేషబుద్ధి వహింప మొదట నుద్యమించినను, మీనాక్షికిని నా రక్షకునికిని వారు హాని తలంపకుండుటచే నేనూరకుంటిని. పల్లకిలో మీనాక్షిని నొకయువకుని నెక్కించి యూరేగించునపుడు, నేనును చెలికత్తె సంరక్షణకై వారితోనూరేగి, యింటి కామెను సురక్షితగఁ గొనివచ్చుచుందును. ఇంతవఱకును ఉదంతములు శాంతతతోనే జరిగినవి. కాని యొకానొక దినము మీనాక్షిని బల్లకిలో నెక్కించి వారందఱు గ్రామాంతరముఁ గొనిపోవ సమకట్టిరి. ఆ సమయముననే నా యజమానుఁడు దేహస్వస్థత లేక మంచము మీఁదఁ బడియుండుట తటస్థించెను. తాను బోవునపుడు బాలిక కంటఁ దడిపెట్టెను. తండ్రికిఁగూడఁ గన్నీరుక్రమ్మెను. అట్టిసమయమున నా చెలికత్తెను వారు పల్లకిలోఁ గూర్చుండఁబెట్టికొని పోసాగిరి. ఆహా! నాకిఁక దీనియర్థ మంతయు బోధపడినది! ఆద్రోహులు, మొదట మిత్రులవలె వీరి యింటఁ బ్రవేశించి, పిమ్మట బాలికను గొనిపోవ నుద్యమించిరి! ఇది మీనాక్షికిని దండ్రికిని దుస్సహముగ నున్నదనుటకు వారిదుఃఖమే నిదర్శనము! కష్టకాలమున స్వామి కార్యము మఱచిన సేవకునిప్రయోజన మేమి? కావున నేను వేగముగఁ బల్లకి మోచుకొని పోవు బోయలకాళ్ళ కడ్డము వచ్చి, వారిని దక్కిన వారిని గఱవ మొదలిడితిని. అంత వారితో నాకుఁ బెద్ద కయ్యమయ్యెను. వారిచేతులనుండి మీనాక్షిని విడిపింపలేకపోయినను, తుదకు నేనామెను విడువకయైన నుండవలెనని నాకుఁ బట్టుదల కలిగెను. కాని యింట వ్యాధిగ్రస్తుఁ డగు యజమానుఁ డేమగునో యని మనస్సు ఉయ్యాలవలె నిటునటు నూఁగెను. యజమానునిమీఁద మనసు తిరిగినపుడు వెంటనే నేను మీనాక్షిని విడిచి యింటికిఁ బోవుదును. యజమానుఁడింట భద్రముగ నుండుటఁ గాంచిసంతుష్టిఁజెంది,

ఇఁక మీనాక్షిని గాపాడవలయు నని యచటికిఁ బరుగు లిడుదును. ఇటు లెన్నియో సారు లిటు నటు నాదినము పరుగెత్తుచుంటిని. నా సందడి కోనే నిటులుండఁగా, దూరపువీథికిఁ గ్రొత్తగ వచ్చిన పెద్ద కుక్క యొకటి, ఒక సందునుండి నేను మఱలుచుండఁగా నన్నాకస్మికముగఁ బట్టుకొనెను. దాని నోడించుటకు నాకు శక్తియున్నను, యుద్ధముచేతఁ గాలహరణ మగుననియును, ఇంతలో బల్లకి మోచు వారాబాలను గొనిపోదు రనియును, నేను బలాయనమైతిని.. ఆదుష్ట శునకము మాత్రము నామనసు గ్రహింపక, నేను బిఱికిదాని నని భ్రమఁజెంది, నా వెన్నుమీఁది కండ గట్టిగఁ గొఱికివైచెను! అప్పటికిని నేను స్వామికార్యమును విడువక బాధ కెటులో సహించి పోతిని. ఇంతలో మీనాక్షిపాలకి చాల దూరము పోయెను. నాకు ఆమె కానిపింపలేదు. అంత నేను విఫలమనోరథనై యిలు సేరితిని.

—♦ మీనాక్షి గానఁబడుట ♦—

ప్రియమిత్రమగు మీనాక్షిని బాసి నే నిఁక నెట్లు జీవింపఁ గలను? ఐనను రోగపీడితుఁడగు యజమానుని పడకను దివారాత్రములు నేను గనిపెట్టుకొని యున్నాను. ఆహారమనిన నాకిపుడు వాంఛ లేదు. ఱేయి కంటికి కొకకునుకైనఁ బట్టదు. యజమానుఁ డెంత యొత్తి చెప్పినను నే నాహారము భుజింపలేదు. శరీరము మనసుకూడ బెద్దకొలిమిలోఁ బడి మండుచున్నట్లు తోఁచుచున్నది! ఇటులుండ నీ ప్రాతఃకాలమున వాకిటఁ బల్లకిమ్రోఁత వినవచ్చుచున్నదే! ఎవరో బాలిక యొకతె నా కన్నుల కగపడుచున్నది! ఆహా యీామె మీనాక్షియే! ఆహా, ఏమి నాపుణ్యము!!

[మీనాక్షికొంతకుఁ బనవి పనవి, ఆమె క్రొత్తగ నత్తవారింట నుండి రావేగమే చూచునపు డానంద పరవశయై, గౌతమి యాకస్మికముగ మరణము నొందెనని యింటివారు చెప్పుచున్నారు. గౌతమి వెన్నుమీఁద నొక పెద్దపుండు ఉండుట గనిపెట్టినది మీనాక్షియే.

వ్యాధిగ్రస్తుఁ డగు మీనాక్షితండ్రి యిన్నాళ్ళు నిది చూడనేలేదు. కాని గతించినదాని కిపు డెవరేమి చేయఁగలరు? ఆదిన మాగృహము రోదనధ్వనులతో నిండెను ఎట్టకేలకు మీనాక్షి తండ్రి ధైర్యము తెచ్చుకొని, గౌతమి శునకజన్మ మెత్తినను ఋజుమార్గమున నడుచు కొనుటచే నది పుణ్యమనుజునివలెనే యుత్తమలోక ప్రాప్తిఁ జెందు నని నిర్ధారణచేసి, దానికి దహనసంస్కారాదిక్రియలు గావించె నని తెలియవచ్చుచున్నది—కథకుఁడు.]

కొ అ వి ద య్యా ము.

కృష్ణామండలమున నొక దాని కొకటి దగ్గఱగ నుండు గువ్వ లూరు గువ్వపల్లె యను రెండు కుగ్రామములు గలవు. ఇవి పెద్ద పట్ట ణములకే కాక, పెద్ద రస్తాలకును జాల దూరమున నుండుటచేత, ఈ పల్లెలకుఁ బోవుట సుకరము గాదు. నేల సారవంతమైనది కాక పోవుటచేత, చిరకాలమునుండి యాగ్రామములు పరిపాలకుల యనా దరణమునకుఁ బాల్పడియున్నవి. ఇటీవల నా రెండు గ్రామములకును ఒక బాట వేయించవలయునని దొరతనము వారు ఆలోచించు న్నారని తెలిసి, తమకు బాటలేవియు నవసరములేదని యా గ్రా వాస్తవ్యులు మహజరు నంపుకొనిరి!

ఈ రెండు గ్రామములకును నడుమ పుంత (డొ కలదు. ఒక యూరినుండి రెండవదాని కొక క్రోసు దూ దారిలోఁ గొంత భాగము బాగుగ నుండును. తక్కి నేల చదునుగ లేక, మిట్టపల్లములుగ నుండును. దచ్చటచ్చట నీరు నిలిచి, ఈ బాటను బాహాటము కష్టముగ నుండును. వట్టి చౌటినేల యగుట వల

నచటఁ జెలియఁగదు. కావున నన్నికాలములందును, పగలు గాని, రాత్రి గాని యా దారిని పోవుట సులభము గాదు.

నూఱు సంవత్సరముల క్రిందట నీ రెండు గ్రామములకును గరణ మొకఁడే. అప్పటి కరణమగు గువ్వలూరి రాజన్న గువ్వలూరిలో నివసించుచు, పనియున్నపుడు మధ్యాహ్నమున గువ్వపల్లెపోయి, రాత్రి కిలుసేరుచుండెను. వేసవి కాలములో నొక దినమున రాజన్న గువ్వపల్లెకు వచ్చి, తన యుద్యోగపుఁ బనులు చూచుకొని, యెండ తగ్గనందు వలనను, తనకా దారి కొట్టిన పిండియే యగుటచేతను, ఎప్పటికంటెఁ గొంచెమాలస్యముగ నింటికి బయలుదేరెను. చీఁకటి పడినను వేఁడిగాడుపులు తగ్గకుండెను. దారిలో సామాన్యముగ నాతని కెవరో సహవాసము దొరకుచునే యుండురు. ఆ రాత్రి మాత్ర మెవరును తోడులేకుండిరి. అది పైగా సంజచీఁకటిరాత్రి. ఏఁబదియేండ్ల వయస్సుదాఁటినను, దేహపటుత్వము గలిగి, కాయకష్టమున నోర్చినవాఁడగుటచే రాజన్న కిట్టి పయన మొక లెక్కలోనిది గాదు. కాని యెండతీవ్రత కాతని కీ సాయంకాలము శరీరము బలహీనమగుచుండెను. అందుచేతనే యీ క్రోశముదూరము నామడ వలె నతనికిఁ దోఁచెను.

పుంతదారిని గొంతనడచి, మిట్టపల్లపుమార్గమునఁ బ్రవేశించి "సగము వచ్చితిని గదా, యిఁక నెంత ! ఈయొడుదుడుకు లగడుగులును దాఁటినయెడల నిఁకేమున్నది ? ఆవల శ్మశా[...]ది దాఁటిన పిమ్మట ఊరిచెరువు, దాని వెనువెంటనే [...] అని తలపోసి, అడుగులిడు చుండెను. ఈ కొలఁది [...]న కిపుడింత భారముగనుండుట కాతఁ డాశ్చర్యపడి, [...]ని తలపోయుచుండఁగనే, యాతనికిఁ గన్నులు బరువు[...]కి వెచ్చనిగాలి వీచుచుఁడినను, వెన్నునుండి యత[...]బయలుదేరెను. అపుడు ముఖమును చేతితోఁబట్టి

చూచుకొని “ ఓహో కొంచెము జ్వరముసోఁకినట్లున్నదే! ఐననేమి?
ఇంక కొంచెము దూరమేకదా నడువవలెను!” అని యాయన
మూఁతలు పడుచున్న కన్నులు విప్పి కొనుచు, తప్పటడుగు లిడు
చుండెను.

నిజముగ నవి తప్పటడుగులే! కన్నులు గానఁబడక, ఒక
గోతిలోనికిఁ గాలుజారి యతఁడు ముందుకు సాగిలపడెను. తోడనే
మెలఁకువ వచ్చి, స్వప్నావస్థలోనుంటినా యని యతఁడు విస్మయ
మందెను. అప్పు డతని కొక వెఱ్ఱిభయము కలిగెను. దీనినిఁ బారఁ
దోలఁగల దివ్యౌషధ మాయన యొద్దనే కలదు. అప్పుడాంజనేయ
దండకమును ఆతఁడు బిగ్గరగఁజదువ నారంభించెను. నిద్రమత్తుచేతను
జ్వరతీవ్రత చేతను నాతనికి నాలుకతడఁబడి, కొంతసేపటికి దండకపుఁ
బదములుకూడ స్ఫురణకు రాకుండెను. చెప్పనలవిగాని భీతి యావ
హిల్లుటచేత దేహమునిండ రాజన్నకుఁ జెమ్మటలు పోసెను. అంతట
కుప్పవలె నాబ్రాహ్మణుఁడు నేలఁగూలెను.

వెంటనే తెలివి తెచ్చుకొని, వేవేగమే యిలు చేరవలెనని
యాతఁడు తిరిగి యత్నించెను. ఐనను తానేదెస కడుగిడవలయునో
యిపుడు బొత్తిగఁ దెలియకుండెను. దారియంతయు మెరక పల్లము
లుగ నుండు టాతనికిఁ దెలియును. ఏమాత్రము జాగ్రతవీడినను,
కాలో చేయియో విఱుగునని యెఱిఁగియుండుటచేత, ఆ గాంఢాంధ
కారమున నెటు కాలు వేయుటకును దోఁపక, యాతఁడు నిశ్చేష్టుఁడై
చెట్టువలె నిలువఁబడియుండెను.

ఇటు లేమిచేయుటకును దోఁపకున్న యాయన కన్నులకు, ఈ
దీనదశనుండి తన్నుఁ దొలఁగింప నేతెంచిన దివ్యవరమాయనునట్లు
దూరమున నొకదీపము గానఁబడెను. ఇంక గట్టెక్కితినని రా
ధైర్యము తెచ్చుకొని, “ నేను వచ్చుచున్నాను. ఆఁగుఁడు! ” అని
దీపమువైపునకు కేకలువేసి చప్పటులు గొట్టెను. “ రండిరండి

యని దీపమునొద్దనుంచి ప్రత్యుత్తరము రాఁగా, ధైర్యము హెచ్చి యాతావున కతఁడు వడిగ నడువఁజొచ్చెను. దారి మంచిది కాక పోవుటచేత, పడుచును లేచుచును రాజన్న యెట్టకేల కాదీపమును సమీపించెను. అచట నొక దీపమే కాదు. అనేక కరదీపికలు (కాగడాలు) వెలుఁగుచుండెను. అది యొక పెండ్లివారిగుంపు. పాలకిలోఁ బెండ్లికూతుఁరు పెండ్లికొడుకును గూరుచుండిరి. బోయలు పాలకి మోయుచు వేగముగఁ బరుగిడుచుండిరి. కూడఁ గొంతపరివారము నడచుచుండెను. "ఇదిగో కరణముగారు వచ్చినారు. వారికి గంధము పూసి, తాంబూలమియ్యండి!" యనువారి పలుకులు రాజన్నకు విన వచ్చెను. తనకుఁ జేయఁబడిన సత్కారముల నందుకొని, కరణము వారితో నడువసాగెను. కాని వారలఁ జూచినకొలఁది నాబ్రాహ్మణుని కాశ్చర్యము కలిగెను. అచటివారందఱును నల్లని కోఁతిముఖములు గలిగియుండిరి! వారికన్నులు చింతనిప్పులవలె నెఱ్ఱగ వెలుఁగుచుండెను! కాళ్లు వెనుకకు వేయుచు వారు నడచుచుండిరి! ఇట్టి వైపరీత్యములు కనిపెట్టియు రాజన్న, "వీ రెటులున్న మన కేమి? పాదములు వెనుకకు వేసి నడచుచున్నను, కానిని నెత్తిమీఁదఁ బెట్టుకొనియున్నను నా కొకటియే! నాకాలు ముందుకు సాగుచున్నఁ జాలును. కన్ను కాలును గానఁబడని చీఁకటిలోని పయనము తప్పి దీపపు వెలుతురున నడచుభాగ్యము నాకుఁ గలిగినదిగదా!" యని మురియుచు వారితో సాగిపోయెను. వారందఱు నిపుడు లోకమంతయు మునిఁగిపోవుచున్నట్టుగ నతి వేగమున నడుచు చుండఁగా, పరుగెత్తు నలవాటు చిన్ననాఁటనే మఱచిన యాకరణ మిప్పుడు తానుగూడఁ బరుగిడసాగెను.

వారు నడచిన నడకకు గువ్వలూరు అనతికాలమునఁ గానఁబడ వలసియున్నను, ఏగ్రామమును గోచరింపలేదు! రాజన్న వేయుప్రశ్నలకు పెండ్లివా రిపుడు సమాధానము లిచ్చుట మానివేసి, కర

ణము నింకను వేగముగ నడువుఁడని సైగ చేయుచు, తాము త్వరిత ముగ నడువసాగిరి. వెనుకఁబడుచున్న బ్రాహ్మణునికి వా రిపుడు చేయూఁతనిచ్చి, యందఱును వాయు వేగమునఁబోవుచుండిరి. ఆ వేగమునకుఁ దానుదాళఁజాలనని యాతఁడు మొఱవెట్టికొన్నను, వాని మాట లెక్కగొనక, వానిని దమతో వడివడిగఁ గొనిపోవుచుండిరి.

ఎంత కాలము, ఎంతదూరము, వారితోఁ దాపిట్లు తిరిగెనో రాజన్నకు జ్ఞప్తిలేదు! కాని వాయువేగమునఁబోవు నాపరివారమున కపుడు ఉద్దండమైన స్తంభమొకటి యడ్డువచ్చెను. దానితాకుడు చేత కరణముగల పెద్దగంటవలె మ్రోఁగి, భిన్నభిన్నములై పాతాళమునఁ బడిపోవుచున్నట్లు తోఁచెను. తరువాత జరిగిన సంగతులు రాజన్న మనఃఫలకమునుండి పూర్తిగఁ దుడిచివేయఁబడి నటులయ్యెను. పెండ్లివారేమైరో యాయనకుఁ దెలియదు.

మఱునాఁటి మధ్యాహ్నము మూఁడుజాములకు గువ్వలూరి గ్రామశ్మశానమునకు దూరమున నొకచెట్టు మొదటఁ బడిపోయి యుండిన యొకమనుష్యునిజాడ, ఆచెంతనుబోవుచుండు నొకగొల్లది గనిపెట్టెను. అతని దేహము పూర్తిగఁ బలుచనిబురదతోఁ గూడి యుండెను. ప్రాణమునిలిచియున్నను, స్పృహయేమియులేదు. ప్రొద్దున నుండియు వేసవియెండకు మాడిదేహము వివర్ణమైయుండెను. శోష పోయిపడియున్న యీ మనుష్యుని ముఖముమీఁద నా గోపకాంత యంతఁ దనకుండలోని చల్లని నీరు చల్లఁగఁ గొంతసేపటి కతఁడు కదలసాగెను. ఆమె తనదగ్గఱనుండిన మజ్జిగబొట్లు నోటిలోఁబోయఁ గానతఁడు మెల్లగ గుటక వేసెను. శైత్యోపచారము లిట్లు చేయఁగఁ జేయఁగ, రాజన్న కన్నులు తెఱచెను. ఇదివిని చేరువనుండు గువ్వలూరు గ్రామమునందలి రాజన్నబంధువు లంత నచటికేతెంచి, పల్లకిలో వానినుంచి, గ్రామమునకుఁ దీసికొని పోయిరి. ఆఱునెలలకుఁ గాని యతఁడు వెనుకటిశరీరస్థితి గాంచలేకుండెను!

గోపకాంత మజ్జిగను రాజన్ననోటఁ బోయుచున్నది.

ఆనాఁటిరాత్రి యాబ్రాహ్మణుఁడు కొఱవిదయ్యపుగుంపునఁ బడి దారితప్పి మోసపోయి ప్రాణావశిష్టుఁడయ్యెనని, యాగ్రామవాసులలో ననేకులంత నిర్ధారణచేసిరి. అతనికన్నులకుఁ గానఁబడిన పెండ్లిపాలకి నిజమైన పాలకి గాదనియును, వాని మేననుండిన చందనము పలుచని రేగటిమట్టి యనియును, పెండ్లి పరివారమంతయును పిశాచగణమేయనియును, వారిసిద్ధాంతము. కాని రాజన్నమాత్రము కాళ్ళు విఱిపోవునట్లు తెల్లవాఱువఱకుఁ దాను బెండ్లివారితో నడచుట నిశ్చయమని చెప్పుచుండెను. అదివఱకే జ్వరమంకురించిన రాజన్నకు, ,,ఊరువానికిఁ గాటిభయము; పొరుగూరువానికి నీటిభ

యము, " అను న్యాయముచొప్పున నారాత్రి శ్మశానవాటిక సమీపించిన కొలంది తాత్కాలిక మతిభ్రమణము గలిగి యాపరిసరములందుం బరిభ్రమింప సాగి, తుద కచటిచెట్టుతగిలి పడిపోయి యుండునని యొకకొందఱు బుద్ధిమంతు లూహించిరి. అతని కన్నులకు దయ్యములుగాఁ దోచినవి, అప్పుడప్పుడు చవిటి నేలలలోఁ బొడఁగట్టుచు నారిపోవుచుండు సామాన్యపు దీపకాంతులే యనియును, దీనికి రాజన్న చెప్పెడి వృత్తాంతమే నిదర్శనమనియును, వారి యభిప్రాయము. కాని వారి మాటలు పాటించువారు లేకుండిరి. కొన్నిదినములవఱకును రాజన్నకు రాత్రులందు జ్వరము తగులుచుండుటఁ గాంచి, యిది తప్పక భూతజ్వరమని యెంచి భూతవైద్యులతనికి విభూతిపెట్టి, మంత్రోదకములు ద్రావించిరి. ఎన్నోజపములు చేయించిరి. దిగదుడుపులు పెట్టించిరి. ఎట్టకేలకు రాజన్న యారోగ్యవంతుఁడయ్యెను.

ఆబ్రాహ్మణుఁ డారాత్రి కాలుజారిపడిన ప్రదేశమిదియేయని యిప్పటికి నాయూరివారొక పెద్దపల్లపుఁ బ్రదేశమును జూపించుచుందురు. వానకాలమున నచట నీరెక్కువగ నిలిచి, దట్టముగ జమ్ము మొలచియుండును. దాని కప్పటినుండియును "బాపనబాడవ" యని పేరు. రాజన్నకన్నులకు మొదటదీపము కానఁబడిన మిట్టనేల కిపుడు "దయ్యాలదిబ్బ" యనిపేరు. ఆచుట్టుపట్టుల గ్రామములలో నేఁటికిని, రాత్రులు మంకుపట్టుపట్టి యేడ్చు పిల్లలను, తల్లులు, "దయ్యాలదిబ్బ మీఁద దిగవిడిచెదము సుమీ!" అనియును, "బాపన బాడవలోఁ బడఁద్రోతుము" నియును జడిపించి, నిద్రపుచ్చుచున్నారు! ఆగ్రామ శ్మశానవాటిక సమీపమున నుండు పల్లపు ప్రదేశమున రాత్రులందట్టిమెఱపులు కానఁబడఁగనే, కొఱవిదయ్యములు ఊరేగుచున్నవని యాగ్రామమునందలి పామరజనులిప్పటికిని భీతిల్లుచున్నారు. సాయంకాలము మొదలుకొని మఱునాఁటి సూర్యదర్శన మగువఱకును ఆబాడవ నైపునకుఁ బోవుటకచట నెవరును సాహసింపరు!



నాగరాజు.

మన దేశములో సర్పముల స్వభావాదులను గుఱించి జనులు సంపాదించిన జ్ఞానము శాస్త్రరూపకముగ మాత్రముగాక, పురాణ గాథలుగాను, మంత్రములుగాను, ఐతిహ్యములుగాను, తరతరముల నుండి వచ్చుచున్నది. నాకుఁదెలిసిన యిట్టివృత్తాంత మొకటియిచట వివరించు చున్నాను. పాఠకులిందలి సత్యము నరయుదురుగాక!

ఆంధ్రదేశమున నొకగ్రామమున సర్పపురివారను నింటిపేరు గల బ్రాహ్మణకుటుంబ మొకటి గలదు. ఇన్నూఱుసంవత్సరములకుఁ బూర్వము, సర్పపురివారి పూర్వికులలో నొక స్త్రీగర్భమున నాగుఁబాము పుట్టెను. దానికి నాగరాజను పేరు పెట్టి, ఆయిల్లాలు సహజానురాగముతో దానిని బాలుబోసి పెంచెను. ఆమె గర్భముననే జనించిన తక్కిన పిల్లలతో నీచిలువకందు కలసి మెలసి యాడుకొనుచుండును. దినదినాభివృద్ధిగాంచుచున్న యీపాము జననిపోయుపాలతోఁ దనివిఁజెందక, తన జాతికి నైసర్గికమగు మాంసాహారమునకై తిరుగుచు, కప్పలుఁ మొదలగు చిన్నజంతువులను వేఁటాడుచు వచ్చెను. అంతకంతకుఁ పెద్దదియై యీపాము, తన మానవ సోదరులతో నెల్లప్పుడు నిఁక గదిసియుండుట కర్తవ్యముగాదని గ్రహించి, నిర్జనప్రదేశ మొకటి చూచుకొనఁ బ్రయత్నించెను. కాని, కన్న తల్లిని, తండ్రిని, నిజసోదరులను విడిచి పోవుట దానికి దుస్సహముగఁ దోఁచి, ఆ యింటనే మెత్తగు కప్పుదగ్గఱను, వెలిసెలలోను, అటకమీఁదను తన నివాస మేర్పఱచుకొనెను. వెనుకటివలె నిపుడు నాగరాజు

పుత్త్రుఁడు నాగరాజు సదా తాండవమాడుచున్నటులుండును. రాత్రులు పాఁపజేనిని గుఱించియే యామెకుఁ గలువచ్చుచుండును. పుత్త్రఘాతుకురాలనని వగచివగచి, దరిలేని సంతాపానలమునఁ గనలికనలి, యాకాంత యంతఁ గనులుమూసికొనెను! ఇంకఁ గొమరుని మృతిదినమునుండియు నేత్రపాటవము తప్పిన జనకుఁడు తన మహాపాతకమునకుఁ బరితపించి, యాఱునెలలలోన కాలగతి నొందెను. చావు లొకటికి రెండుమూఁడయ్యెనే యని వారందఱు మిగుల శోకించిరి.

ఒకరిద్దఱి చావులతో నెన్నఁడు నీప్రపంచనాటక మంతమొందునది గాదు. ఇట్టి విడ్డూరములు జరిగినను, జగతీచక్ర మెప్పటివలె తిరుగుచుండెను. ఆ కుటుంబములో నుండువారికి మాత్రము, తాము కోలుపోయిన సర్పరాజును గుఱించి యెప్పుడును మఱపురాకుండెను. ఇపుడు వారందఱును పెద్దవారలై, వివాహములు చేసికొని, కుటుంబవ్యాపారము నెఱవేర్చుకొనుచుండిరి. ఏలొకో కాని యావంశములోని వారి కెవ్వరికిని సంతతిమాత్రము లేకుండెను! కొందఱు మహనీయుల యాలోచనచొప్పున నంతట వారు, తమ సొంత సొమ్ముతో నాగ్రామమున సుబ్రహ్మణ్యేశ్వరుని కొక దేవళము గట్టించి, అది శాశ్వతముగ జరుగుటకై కొంత భూదానముఁ జేసిరి. తమ సంతతివారి కాదేవుని పేరుపెట్టెదమని మ్రొక్కుకొనిరి. అప్పటినుండియు వారి కుటుంబము తామరతంపరగ వర్ధిలఁజొచ్చెను!

పై వృత్తాంతము జరిగి యిప్పటి కిన్నూఱుసంవత్సరములైనను, ఆవంశమువారి కది నిన్న మొన్న జరిగినదానివలెఁ దోఁచుచున్నది. ఆయింటనిప్పటికిని మొగటిపుత్త్రునకు, పుత్త్రికకును నాగరాజుపేరులే నామధేయములు. సర్పపురివారి వంశమున నెచటఁ జూచినను, సుబ్రహ్మణ్యనాగరాజులును, శేషమ్మ సుబ్బమ్మలునే! వారందఱికిని సుబ్రహ్మణ్యుఁడే యిలువేల్పు.

ఇంకొక సంగతికూడ నిటఁ జెప్పవలయును. సర్పపురివారిలో ననేకులకుఁ బాము మంత్రము బాగుగఁ దెలియును. వారి పూర్వీకులలో నొక రీమంత్ర ప్రభావమువలనఁ దన సర్ప పరివారముతో దాడివెడలి, బలిష్ఠుఁడగు శత్రువు నొకని నోడించెను. ఆవంశము లోని వా రిప్పటికిని సర్పమును గౌరవించుచు, సర్పదష్టులగువారిని మంత్రోచ్చారణము చేతను ప్రక్రియలచేతను రక్షించుచుందురు. వారెన్నఁడును పాములను జంపరు. సొరకాయ, పొట్లకాయ మొదలగు కొన్నిశాకములు ముట్టక, మిక్కిలి నిష్ఠాపరులై యుందురు. వారికి గాయత్రికంటెను సర్పమంత్ర మెక్కువ యాదరణీయము. ఇటీవల వారిలో నొకరు కేరళదేశమునకుఁ బోయి, అచటఁ గొంత కాలము నివసించి, ,పాంబు మేక్కావు నంబూద్రి, యను మహనీయు నివలనను, తదితర ,మలయాళ' మంత్రవేత్తలవలనను, క్రొత్తక్రొత్త సర్పమంత్రములను నేర్చుకొని యింటికివచ్చెను. సర్పదష్టులగు వారి నితఁడు చూడకయే వారిమేనిలోని కెక్కినవిషమును బోఁగొట్టి వారిని రక్షించుచున్నాఁడు. ఎవనినైనఁ బాము కఱచినయెడల, ఆవార్త యాయన కెవనిచేఁ గాని, తంత్రిమార్గమునఁగాని, వేగమే తెలియఁ బఱుపవలయును. అది విని యాయన, ,, నాగరాజా ! విడిచిపో'', యని ముమ్మాఱు ఉచ్చరించును. తాను గట్టుకొనిన వస్త్రమునుండి యొకపేలిక చించి, దండగాఁజేసి, యది వార్త తెచ్చినవాని మెడలో వేయును. అంతఁ గొనయూపిరియున్నను, రోగి లేచికూర్చుండును !

సర్పపురివారు కొన్నిసంవత్సరముల కొకసారి యందఱును తమ గ్రామమునఁ గలిసికొని, తమ కులదేవతయగు నాగరాజుపేర ,,సర్పశాంతి''యను గొప్పయుత్సవము చేయుదురు. ఆదినమునఁ బహిరంగముగఁ బూజలు పురస్కారములును జేయుటయేకాక వారందఱు తమగృహమున నర్ధరాత్రిసమయమున నాంతరంగిక సభ

రొకటి జరుపుదురనియు, ఆసమయమున లోకమునందలి యురగ శ్రేష్ఠములన్నియు నచటి కేతెంచి, వారితోఁగలిసి, తాండవమాడి, సూర్యోదయమునకుఁ బూర్వమే పాతాళమునందలి తమతమ యిరవులకుఁ దిరిగి చేరుననియును బ్రతీతికలదు !

మాణిక్యము.

లోకులు నన్నుగుఱించి విపరీతముగఁ జెప్పుకొనిన నేమి ? వారు పరిహసించినను పొగడ్తలు సలిపినను నాకొక్కటియే. నన్ను గుఱించి న సంగతులన్నియు వారికిఁ దెలియవు. కావుననే వారీవిధముగ నా విషయమై యపోహములు పడుచున్నారు.

వసంతకాలమున లేఁతమామిడి పిందెల సువాసనలు నా కనుకొలుకుల నేల దుఃఖబాష్పములతో నింపవలయును ? ,, ఇస్సీ, మనోహర మెంతటి పిఱికివాఁడు ! అతనికి మల్లెమొగ్గలనిన నెంతో భయము ! '' అని బాలకులు సహితము నన్ను గేలిచేయఁ జూచెదరు. ఇంకఁ బెద్దవారలకు నా బ్రహ్మచర్యము విపరీతపుచర్య. ఎంతయో నియమముతో నేఁబూనిన దీక్షవారు నిరర్థకమును ఛాందసమును ననుకొనుచున్నారు. కానిండు. వారితో నాకుఁ బనియేమి ? పాఠకోత్తములారా ! నాచిన్ననాఁటిసంగతి యొకటి మీకు వినిపించెదను. దానిని బట్టి మీరు సత్యమును గ్రహింతురుగాక !

—♦ మా ప్రయాణము ♦—

పరీక్షలో గెలుపొంది, యుద్యోగమునఁ జేరినఁగాని నేను వివాహమునంగతి తలపెట్టనని చిన్ననాఁడు నియమము పూనితిని. ఎట్టకేలకు నాయుద్దేశము నెఱవేఱె ; రీక్షలోఁదేఱి, యుద్యోగమును స్వీకరించితిని. అంతనాకు వచ్చిన వివాహపు సంబంధములను గొన్ని కన్ను

లారఁ జూచి మఱి పరిణయముగాఁగోరి, నామిత్రుఁడు నేను బయనమైతిమి. ఆ సంవత్సరమున వసంతకాలమున నెండలు తీవ్రముగ నుండెను. పగటిపూటయం దధికముగఁ బ్రయాణముచేసి, వేళకు భోజన సదుపాయములు లేకపోవుటచే, మే మిరువురమును దేహస్వాస్థ్యము తప్పి, యొకానొకనాఁటి యుదయకాలమున నొకగ్రామము చేరితిమి. అదికుగ్రామము. మిత్రుఁడును నేనును డస్సియుంటిమి. ఊరిలో నడుగఁగా, ఒకచోట మాకు బసచూపించిరి. ప్రయాసముతో మేము బండిదిగి, ఎటులో దేహములనాయింటఁ జేర్చితిమి.

అది పూరిల్లు. ఐనను వాససౌఖ్య మెఱిఁగినవారు కట్టినట్టిదిగఁ దోఁచెను. ఇంట నెవ్వరును లేరు. యజమానుఁడు ఉద్యోగపు కార్యములమీఁద నెచటికో పోయి యుండెను. స్త్రీలజాడయైనను గాన్పింపలేదు. మా ప్రయాణములో భోజనవిచారణను గుఱించి స్నేహితుఁడే శ్రద్ధఁబూనుచుండును. ఇపుడతఁ డాయిల్లు నలుదిశలును బరిశీలించి, "ఈ దినము మనకు హరివాసరమే!" యని, తాపత్రయము పంక్తులు మూఁడుగాఁదీర్చి మొగమునఁ జిత్రింపఁబడెనా యనునట్టుగ మోము చిట్లించి, నేను బండుకొనియుండు చాఁపమీఁద దాను నట్టె గూలఁబడెను.

కొంతసేపటికి కోనేటినుండి నీటిబిందె బుజముమీఁదఁ బెట్టుకొని బాలయొకతె వచ్చెను. ఆబాలికతో నేతెంచు పెద్దవారి నెవరినైనఁ బలుకరించెద మనుకొంటిని కాని, అట్టి వారెవ్వరును రాలేదు. పగలు పదిగడియల ప్రొద్దెక్కినది. ఐనను, మట్టమధ్యాహ్న మప్పటివలె సూర్యరశ్మి తీవ్రముగఁ దోఁచెను. ఆఁకలి మమ్మిరువురను బీల్చి పిప్పి చేయుచుండెను. మాటాడుటకైనను శక్తిలేక నామిత్రుఁడుండెను. నేనును శోషిల్లియుంటిని చిక్కిన వారు సిగ్గెఱుఁగరు. నేనపుడు మోమోటము వదలి, "అమ్మాయీ! మేము మార్గస్థులము. మిక్కిలి యాఁకలితోనున్నాము. పాపము, మీయింట నీవుతప్ప నెవరు

నున్నట్టు తోఁపదు. వంటచేయుమని నిన్ను బాధించుట తగదు. మాకుఁ గొంచెము బియ్యమును పాత్రయును జూపించిన యెడల, వంటఁ జేసి కొనెదము'' అని మరియాదకై నేనంటినేగాని, నిజముగాఁ గాలు కదలించుటకైనను మాకు శక్తి లేకుండెను!

సిగ్గు నణఁచుకొని యాలలన, "ఆశ్రమ మీకెందుకు? వంటయాగుచున్నది. మానాయనయు నిపుడె వచ్చెదరు. శీఘ్రమే భోజనము చేయవచ్చును.'' అని పలుకఁగా, మాకామాట లమృతోప

మానములయ్యెను. మేము కోరకయే మాకాతిథ్య మీయనున్న యాబాల, అన్నపూర్ణాదేవిని మాకు స్ఫురణకుఁదెచ్చెను. కృతజ్ఞతను దెలుపుటకు మాటాడుటకైన శక్తిలేక, కన్నుల యానందబాష్పములను మఱుఁగుపఱుచుచు, నేనంత నేల నొఱగితిని. మిత్రుఁడు నేను నంత గాఢసుషుప్తియందు మునిఁగి పోతిమి.

పరులయింట విందు

,, అయ్యా! మిక్కిలి ప్రొద్దెక్కినది. కాళ్ళు కడిగికొని భోజనమునకు రండు!" అను నొక పురుషుని కంఠస్వరము రెండు మూఁడు సారులు నాకు వినఁబడి, నిద్రనుండి లేచితిని. ,,నేను వచ్చువఱకును మీకుభోజనమేల పెట్టలేదని మా యమ్మాయిమీఁద నేనుగోపపడితిని. లెండి.'' యని గృహాధిపతి భోజనశాలలోనికి మమ్ముఁ గొనిపోయెను.

ఆనాఁటి యుదయభోజనపు వృత్తాంతము నాకంతగ జ్ఞప్తి లేదు. ఇంటియజమానుఁడు భోజనసమయమున మాతోననుచుండిన మాటలు బావిలోఁ బడినవాని చెవులకువలె మావీనులకు వినవచ్చుచుండెను. నిద్దురతో మేము తూఁగుచునే భుజించితిమి. కాని యన్నరసము జఠరమునఁ బ్రవేశించిన కొలఁదిని నిద్దురమత్తు కొంతతగ్గెను. మేమొట్టులో మెతుకులు నోటవేసికొని, తిరిగి చావడి మీఁదికిఁ జేరితిమి.సాయంకాలమునందలి యీరెండ గానఁబడువఱకుమాకు నిద్దురనుండి మెలఁకువ రాలేదు. అప్పుడు లేచి చూడఁగా, గృహమేధి యుద్యోగసంబంధపు కార్యమందును, పుత్రిక రాత్రిభోజన ప్రయత్నము నను నుండిరి.

భోజన సమయమునకు మాకుఁ గన్నులు విచ్చెను. అంత వఱకును, ఇంటి యజమానుఁడు ,,మీ దేయూరు? పనియేమి?'' అను ప్రశ్నములు మమ్మడుగలేదు. అడిగియుండినను మాకు జ్ఞప్తి

లేదు. స్థితిగతులు కొంత సన్నగిల్లినను, ఆయన సాధుపురుషునివలె మాకగపడెను. కొలఁదికాలము క్రిందటనె పత్నీవియోగము సంభవించుటచేత, తనకీ యేకపుత్రికయే యాధారమని యాయన చెప్పినప్పుడు, మాకు విషాదము కలిగెను. తనగోడవలో మా సమాచారమడుగ మఱచితినని యాయన పలుకఁగా, నా మిత్రుఁడు రామనాథము మాప్రయాణవృత్తాంతము సంగ్రహముగఁ జెప్పి, ,,అయ్యా! మామనోహరము పెండ్లిపయనములలో నిట్లు మాజవసత్త్వములుడిగి పోవుచున్నవి. ఒకటి కుదిరిన నొకటి కుదురకున్నది. చదువున్నఁ జక్కఁదనము లేదనియు, సంగీతములేని సౌందర్యమేల యనియును, సందియములతోఁ దల్లడిల్లుచున్నాఁడు. ఈతని పెండ్లిసంగతి యిఁక దేవునికిఁ దెలియునుగాని, నేను శీఘ్రమె యిలుచేరనిచో మాట దక్కునట్లుతోఁపదు!'' అని యతఁడు చెప్పివేసెను.

రామనాథము మంచివాఁడు. శాంతమూర్తి; ఏపనిగాని వేగిరపడి చేయువాఁడుకాఁడు; ఇతరులు చేసిన నోర్చువాఁడును గాఁడు. ఆ రాత్రి నిద్రించుటకుఁ బూర్వము మేమిరువురమునుగలసి మాటాడుకొంటిమి. ,,మనోహరమూ! పెండ్లివిషయమున నీ కింతటి గట్టిపట్టు ఉండఁగూడదు. ఇంక ఖండాంతరములు గడచిపోయినను, నీకంటికింపగు కాంత గానఁబడుట కష్టము!'' అని విసుగుచుఁ బలికెను.

మఱునాటి యుదయమున రామనాథము మాటలు వినఁబడి, పడకనుండి దిగ్గున లేచితిని. ఒడలంతయు భారముగఁ దోఁచెను. కన్నులు మండుచుండెను. బండిచప్పుడు వినఁగనే రామనాథము నాయొద్దకువచ్చి, ,,మనోహరమూ! నేను బోయివచ్చెదను. నీ వీబడలికతోఁ బయనము చేయఁగూడదు. పరులయింట నుభయులమును నిలిచియుండుట భావ్యముగాదు. కాన నేను బోవుచున్నాను. నీకు నెమ్మది గలిగినతోడనే బయలుదేఱుము'' అని నాకు బోధించెను. అంత నేను, ,,సరేకాని, మనము వచ్చినపని పూర్తికాలేదే! యని

పలుకఁగా, ఎప్పుడుపోవుదునాయని యాతురతతో నపుడే బండిలోఁ గాలుపెట్టుచుండు నా మిత్రుఁడు ,,దానికేమిలే! మనసు కుదిరినచో మనువెంతసేపు?'' అనుచు బండి సాగించెను.

ఆదినమంతయు తీవ్రజ్వరము నన్నుఁ బీడించెను. ప్రాద్దెక్కిన కొలఁదిని ఉష్ణమతిశయిల్లెను. కాలుసేతులు పీఁకుకొనిపోవుచుండెను. దగ్గఱనుండు స్నేహితుఁడుకూడ విడిచిపోయెనే యని నేను బరితపించితిని. పగటికంటె రాత్రి నాబాధ యధికమయ్యెను. అప్పుడప్పుడు కనులుతెఱచి చూచునపుడు, నాకుఁ గాళ్ళుపట్టుచు గృహస్థుఁడును, పానీయమిచ్చుచుఁ గుమార్తెయును, కలలోని బొమ్మలవలెఁ గానవచ్చుచుండిరి!

—♦ క్రొత్తబంధువులు. ♦—

ఒక పవలు రాత్రియు మాత్రమే నన్ను జ్వరము పీడించినను, నాశరీరము నందలి జవసత్త్వముల నది మొదలంటఁ గొనిపోయెను. అన్నమనిన బొత్తిగ నితవులేకుండెను. పడక విడిచి రెండడుగులు వేయఁగనే కన్నులు గిర గిర తిరుగుచుండెను. ఆపరిస్థితులందు నాకా గృహస్థుఁడే దిక్కు. ఆయన సౌజన్య మింతింత యని చెప్పఁజాలను. ,,చుట్టమై చూడవచ్చి దయ్యమై పట్టుకొనె'' నన్నట్లు, అతిథిగానే తెంచి వారింటికడ నేను దినములకొలఁది నిలిచితినని నామీఁద నించుకయు నాతఁడువిసివికొనఁడు. వలసిన యౌషధము లిచ్చుచును, ఇంపగుమాటలు చెప్పుచును, దైవమువలె నన్నాయన కాపాడెను. అధికముగ నాకు సహాయము చేయలేదనియే యాయన నొచ్చుకొనుచుండును!

ఇంక నాయన పుత్రికను గుఱించి యేమని చెప్పఁగలను? జనకుని శాంతభావమంతయు స్త్రీరూపము దాల్చివచ్చెనా యనునట్లుగ నాబాల గానఁబడెను. అంతటి లేవయస్సున నట్టి వివేక సౌజన్యములను గలిగియుండు వారెచటఁ గలరు! కలిగియుఁ గలుగని నిపుణత

తోనే యామె యింటిపనులు దిద్దుకొనసం, కోపము విసువు ననునవి యెఱుఁగక, అన్నమనిన వాంఛలేకుండు నాజిహ్వాకుఁ దిరిగి యాహార మునందు రుచిగలుగఁజేయుటకై, లెక్కలేని చిన్న చిన్న పచనములు పచ్చడులును గల్పించుచుండును! సదయహృదయయగు నాకోమలి యుపచారములవలననే నేను దెప్పిఱిలి, తప్పటడుగులిడుచుఁ గ్రమ మున శక్తిగలవాఁడనైతిని. బాలికలందునైసర్గికముగ మాతృగుణ ములు దాఁగి యుండునను శాస్త్రవచనము నాకప్పుడు స్ఫురణకు వచ్చెను. ఈ మాణిక్యము మాణిక్యమేయని నేనపుడు గ్రహింపఁ గలిగితిని!

ఒకనాఁటి మధ్యాహ్న సమయమున నేను మంచముమీఁదఁ బండుకొని నాస్థితిగతులను గుఱించి యిట్లుతలపోయ సాగితిని: ,,ఆహా! దైవసంఘటనము లెంత విచిత్రములు! ఒకకార్యార్థమై మిత్రునితో బయనముచేయుచు మార్గమధ్యమున దేహస్వాస్థ్యము తప్పి పరుల యింటఁ జేరితిని! ఇప్పుడు నాకీ గ్రామమే జన్మస్థల మయ్యెను! ఇంటి వారు చిరకాలపు స్నేహితులైరి! కాని పరులయింట నీ లంకణముల లోని మనుగుడుపులలో నామనువు సంగతి మటుమాయ మయ్యెనే!,, యని, యిట్టి విధ్వారమున కాశ్చర్యపడితిని.

పథ్యపు మెతుకు లొంటఁబట్టిన కొలఁది, పూర్వపు వేగముతో నామనస్సు తిరుగఁ జొచ్చెను. రామనాథము వెడలిపోవుచుఁ బలికిన పలుకులు మఱల మఱల తలంపునకు వచ్చుచుండును. అతని వాక్కు లేనిక్కమైనచో, ఇంకను, ధాత నా కొఱకు వధువును సృజింపనే లేదు! కానిచో, చూచిచూచి లోపములతోనున్న యేబాలనో నేఁ గట్టుకొనవలయును! ఇట్లు నువు సంగతి నాలోచించిన కొలఁదిని తెంపులేని యూహలకుఁ దావలమై నామనస్సు డస్సిపోవుచుండుట చేత, అది యెట్లులైన మఱచిపోవుటకుఁ బ్రయత్నించు చుందును.

—♦ మాణిక్యము. ♦—

మనస్సునకు వేఱు వ్యాయామము లేక పోవుట చేత, ఆదినములలో నేను జుట్టునుండు వస్తుసముదాయమును బరిశీలించుటయందే ప్రొద్దు పుచ్చుచుంటిని. ఈ జగన్నాటకరంగమున నాకన్నుల కవుడు గోచరమగు పాత్రములు రెండే. వారు మాణిక్యము, ఆమె జనకుఁడును. పితాసుతల గుణావలోకనమే యపుడు నేను మనస్సునకు ముఖ్య విషయముగఁ గల్పించుకొని వినోదించుచుందును. జనకుని సౌజన్యాది గుణములు మాణిక్యమునందు ద్విగుణీకృతమై యొప్పారుచుండును. కాని యాలలన రూపలావణ్యాదుల పోకడలుమాత్రమంతగ జనకుని యాకృతియందుఁ బొడకట్టవు. మాణిక్యముయొక్క రూపవర్ణనము చేయునపుడొక సంగతి పరికింపవలయును. పదిమంది బాలికలనడుమనిలువఁబడినపుడు మాణిక్యము యొక్కయంద మంతగఁ గానవచ్చునది గాదు. శరీరసౌకుమార్యమునందును, ముఖకాంతియందును, ఆకాంతనుమించు మించుఁబోఁడులు పలువురుగానవచ్చెదరు. ఆచాన చక్కఁదనము చూచినతోడనే చూపఱకన్నుల మిఱుమిట్లు గొల్పునట్టిదిగాదు, అట్టి సుదతుల సౌందర్యమును గుర్తించుటయందు పురుషులు సామాన్యముగ మోసపోదురు. జ్ఞానముచే నుత్తేజితమగు నాసుందరిచక్షువులను బరిశీలించు వారికిమాత్ర మా చెలువ చక్కఁదనము విస్పష్టమగును. సోగకన్నులనుండి సౌందర్యలహరి బయలువెడలె మందగమనమున నాముదిత ముఖసీమయంతటను నాట్యము సల్పుచుండునటులఁ దోఁచును.

మాణిక్యముయొక్క యందము, ఆకలికి విశాలనయనములందే గాక, పలుకు పలుకు నందును, చేయు ప్రతికార్యమునందును, ప్రకటీకృతమగుచుండును. ఆ ముద్దియ ముద్దుపల్కులు, నిర్మలినమును గరుణాపూరితమునునగు హృదయము యొక్క ప్రతిబింబములే. ఆ త్రొయ్యలి తేనెపలుకులు దేహమనఃక్లేశములను దూరీకృతము చేయు

టకు సమర్థములుగా నుండును. ఆడుచుఁ బాడుచు నాచేడియచేయు చిన్నపనులు, గృహకృత్యములం దారితేరినవారు చేయువానికంటె హృద్యములుగ నుండును. వానియందు లోపములున్నను, ఆ లోపములె వానికిఁ గ్రొత్తరుచులను గల్పించునటు లుండును!

గ్రామ నివాసియగు మాణిక్యముయొక్క యాటపాటలు వినోదములును నేనుగుతూహలముతోఁ గనిపెట్టుచుందును పనులన్నియుఁ దానే చక్కఁబెట్టవలసి వచ్చినను, ఎప్పుడును వానిలోనే మునుఁగుచుఁ దేలుచునుండుక, అప్పుడప్పు డా యువిద విశ్రాంతి గైకొనుచుండును. మధ్యాహ్న మాకోమలి కాటవిడుపుసమయము. అప్పు డాబాల పొరుగిండ్లకును, పొరుగింటి బాలికలు వీరింటికిని, రాకపోకలు సలుపుచుందురు. ఆటలలో వీరు ధరించు భూషణములు పెరటిలోని మల్లెమొగ్గలును, కోనేటిలోని చెంగలువపూవులును. మాణిక్యమీనగలను బిమ్మటను దాల్చుచుండును అపుడా యెలనాగ సోయగమునకుఁ గ్రొత్తవన్నె వచ్చినటు లుండును!

మనువుసంగతి మఱచిపోవలయునని ప్రయత్నించు నామనమునకిట్టు మాణిక్యము రూపగుణావలోకనము మఱల దానినే జ్ఞప్తికిఁ దెచ్చెను! కాని యీమాఱు రామనాథము మాటలసత్యము నాకనుభవమునకు వచ్చెను. నామనస్సును వెతనొందించెడి సందియములింక వీడినవి. పరిణయ మపేక్షించితినా నేను జేసికొనవలసిన బాల లోకములో నొకర్తుకయ కలదు! "ఆ కన్నియ చేకూరెనా, నాకిహలోకసౌఖ్యము. లేనిచో గృహస్థాశ్రమమునకు వెలియయ్యెదను!" అని నేను నిర్ధారణ చేసికొంటిని.

ఆబాల యెవ తెయో పాఠకులకుఁ దెలుపవలయునా?

—•దుఃఖవార్త.•—

తరువాతి వృత్తాంతము త్వరితముగఁ జెప్పవచ్చును. నా యుద్దేశమును మెల్లఁగ మాణిక్యము జనకునితోఁ జెప్పితిని. ప్రథమమున

నాశ్చర్యనిమగ్నుఁడయ్యెను, బాగుగ నాలోచించి యాయన దానికి సమ్మతించెను. ఆయనవలనఁ దన వివాహపు వృత్తాంతమును విని యుండిన మాణిక్య మంత నాకంటెఁబడుటమానెను. ఇంక నొకటి రెండు దినములలోనే నేను బయలుదేఱి స్వగ్రామమునకు మఱలి వచ్చితిని.

పట్టనమందలి వృత్తిసంబంధమగు వ్యాపారములలో నేనంతఁ దిరిగి ప్రవేశించి, పనులు జరుపుకొనుచుంటిని. అల్లు దినములు, వారములును గడచిపోయెను. నేను ఉద్యోగస్థానమందలి కృత్యములలోఁ గొట్టుమిట్టాడుచుండుటవలన మాణిక్యముసంగతి తఱచుగఁ దలంచుటకుఁగాని, వారిరువురి సేమ మరయుటకుఁగాని, నాకవకాశము లేక పోయెను. ఇటులుండగ నొకానొకదినమున నాకొకరు ఉత్తర మొకటి తెచ్చియిచ్చిరి. అది నేను విప్పిచూడఁగ నం దిటులుండెను: —

చి. మనోహరమునకు, కలువలూరు.

నా వెనుకటి యుత్తరము నీకిదివఱకే చేరియుండును. దైవమునకు వలెనే నీకును మా మీఁదఁ గరుణ తప్పినది! లేనియెడల నిదివఱకే వచ్చియుందువు. అమ్మాయి గడియల మీఁదనున్నది. కాని నిన్నుఁజూచినఁగాని ప్రాణము విడిచిపోనట్టుగ నున్నది. ఒకసారి వేగమే రావలెనని వేఁడుచున్నాను. ఇదే నా కోరిక.

వెంకటేశ్వరులు.

ఈలేఖ రెండు పర్యాయములు నేను జదివినను, దానియర్థము నాకు మొదట బోధపడలేదు. పొరఁబాటున నాకింకొకరి యుత్తర మిచ్చితివని నేను జెప్పినను, లేఖ నాదేయని యాతఁడు పలికెను. కలువలూరివారికి నాకును జుట్టఱిక మెట్టిదని నేనచ్చెరు వందితిని. కాని లేఖ గొనివచ్చినవాఁడు తెలిపిన యొకటి రెండానవాళ్లనుబట్టి, వెనుకటి సమాచార మంతయు, నాకపుడు జ్ఞప్తికి వచ్చెను. ప్రాణ సమానయని నేను భావించిన మాణిక్యమును గుఱించియే యీలేఖ !

ఆమె జనకుఁడే యిది వ్రాసి పంపెను! వ్యాధిగ్రస్తయగు మాణిక్యమును నేనిట్టి సమయమున సందర్శింపరాదని యూహించి మాయింట నుండువారు మొదటి యుత్తరము నాకంటఁ బడనీయలేదని నాకిపుడు తెలిసినది. ఆహా! ఎంతటి మూర్ఖపుఁబని చేసిరి! లేనిచో నేనిదివఱకే మాణిక్యమును జూచుట కవకాశము కలిగెడిది. కాని యింక జాగు చేయఁగూడదని యెంచి, వేగముగఁ బోవు గుఱ్ఱపుబండి నెక్కి, శీఘ్రమే గమ్యస్థానముఁ జేరితిని. సరస్సున వెనుక నెంతో కలకలమను నెఱ్ఱకలువ లిపుడు ముఖములు ముడుచుకొని నటు లున్నవి! వీథిలో నగఁబడువా రెవ్వరును నన్నుఁ బలుకరింపకుండిరి!

అప్పుడు నేను వాయువేగమున నిల్లు సొచ్చితిని. "ఇప్పుడేల పోయెదరు?" అని యడ్డగించువారి మాటల సరకుగొనక నేను రోగి మంచము దగ్గరకుఁ బోయి నిలిచితిని. తులసి దళములతో జలబిందువులను మెల్లఁగ రోగి గొంతులోఁ బోయుచున్న మాణిక్యము జనకుఁడపుడు నన్నుఁజూచి, "వచ్చితివా నాయనా!" యని కంటఁ దడిపెట్టి పలికెను. ప్రాణావసాన స్థితియందున్న మాణిక్య మపుడు, తన సోగ కన్నులు తెఱచి, నావైపునకు దృష్టి నిగిడించెను. విషజ్వర ప్రకోపము వలన దేహము మిగుల శుష్కించి యున్నను, చక్షువులు మాత్రము సహజసౌందర్యముతో నింకను వెలుంగుచుండెను. ప్రభాతసమయమున నల్లకలువ మొగ్గలనుండివలెనే, యిపుడా లలన కన్నులనుండి జలబిందువులు జలజలమని రాలెను. మిగుల ప్రయాసతో బాలిక యంత తన కుడిచేతి నెత్తి సైగచేయఁగా, నేను మిక్కిలి దగ్గరగఁ బోయి, కలువకాడవలెఁ జల్లనగుచున్న యాహస్తమును దాఁకితిని. అప్పుడు నా చేతిని మెల్లఁగఁ దనపెదవుల యొద్దకుఁ గొనిపోయి, ముద్దిడి, మాణిక్యము మెడ వెనుకకు వేసెను. "మాణిక్యమా! నేను వచ్చితిని. నీకింక భయములేదు సుఖీ!" యని ప్రోత్సాహపఱుపనెంచి యెట్లో నేఁ బలికితిని. ఔనని సూచించుటకై తలయూఁపనెంచి యా కాంత

యంతటఁ గన్నులు తేలవైచెను. ఆకనుకొలుకుల నుండియే జీవము లేచి పోయెను!

—♦ నా నియ మ ము. ♦—

ఇంక నేఁ జెప్పవలసిన దేమిగలదు? నా మనోనాయిక యగు మాణిక్యము చెల్లిపోయెను. నా కింక మను వక్కఱలేదు. స్త్రీజాతితో నాకు సంబంధము తీఱిపోయెను. మాణిక్యము సుందరాంగకములఁ బోలినపదార్థములు, ఆలలనామణిని జ్ఞప్తికిఁదెచ్చువస్తువిశేషములును. నాకిపుడు కంటకసదృశములు. ఆ సుందరి సోగకన్నులను బోలిన నీలోత్పలములను జూచి నేను శోకింతును. జడలో నెంతో సింగార ముతో నా రమణి ముడుచుకొను మల్లెమొగ్గలు నాకు విషప్రాయ ములు. చిన్నిచేతులతో నా కోమలి కోసి నా జిహ్వకుఁ జైతన్యము గలిగించిన మామిడి పిందెల సువాసనలు, హృదయకమలముఁ గమ లఁజేయు వహ్నికీలలు!

మాణిక్యము గతించి యిప్పటి కనేక వత్సరములైనను, ఆ కాంత కౌఁగిటి వేఁడిమి నాశరీరమున కింకను సోఁకుచునే యున్నది. ఒకానొకప్పుడు నాకీలోకము యమలోక సదృశమగును. అప్పుడు వృత్తియు వ్యాపారమును విడిచి నేనిఁకజడునివలె లోకమునఁ దిరుగాడఁ జూచెదను! కానిజీవితముయొక్క పరమార్థమంతయు దుఃఖనిరోధము నందె నెలకొనియుండుట గుర్తెఱిఁగి, బుద్ధిని మరలించుకొని, ఉద్యో గపుఁ బనులను ముకుత్రాళ్లతో మనస్సును బంధింప నుద్యమింతును. కాని యేమిచేసినను, మాణిక్యమువలననుండి నామనస్సు మరలి రాకున్నది! ఇది వట్టి భ్రమయని మిత్రులు గేలిచేసి నాకు జ్ఞానబోధ నముఁజేయఁ జూచిరి కాని, నాకుమాత్ర మాసుకృతి సంగతియే పరమ సత్యముగఁ గన్పట్టును. ఈమనఃక్లేశముల నన్నిటిని వివాహమై మఱచి పొమ్మని బంధువులు పలుమాఱు నాకుపదేశించిరి. కాని నాయవ్యాజ

ప్రేమమున కాస్పదమై, నాతో సాంసారికసౌఖ్య మనుభవింపఁ బుట్టి డాసఁ బెట్టుకొనియును, తా నకాలమృత్యువువాతఁ బడుటవలన విఫలమనోరథయైన వనితను విడనాడి, వేఱొక యింతి చెట్టవట్టుటకు నా మనసున కిసుమంతయు నిచ్చపొడమకున్నది.

దుఃఖభూయిష్ఠమగు నీమర్త్యలోకయాత్ర సమాప్తమై, విహంగము రీతిని నాయాత్మ నాకలోకమున కెగసి, యనతిదూరమున, నూత్నపారిజాతప్రసూనములను గోసి, వానితోఁ బ్రియున కాతిథ్యమీయ వేగిరపడియును, నైసర్గికమగు తన యొయ్యారపు నడకలను మొదలంట వీడనేరక, మందగమనమున నేతెంచు మాణిక్యముయొక్క సందర్శన సౌభాగ్యము నాకుఁ జేకుఱినప్పుడు, విఘాతములేని శాంతిని సౌఖ్యమును గ్రోలనే నువ్విళులూరుచు నున్నాఁడను!

మాలతి.

కొలఁది కాలముక్రిందట నే నొక కార్యార్థము విజయవాటిక పోవుట తటస్థించెను. అపుడొక స్నేహితునియింట బసచేసితిని. ఒకనాఁడు వేకువనే పడక విడిచి మేడవసారాలోనికి వచ్చి వీథివంకఁ జూచుచుండఁగా, పచ్చని చీరఁగట్టి, మేలి ముసుఁగు వైచుకొని, ఏటిలో స్నానముచేసి, జలకలశము చేత నుంచుకొని యింటికిఁ బోవుచుండెడి స్త్రీ యొకతె గానవచ్చెను. ఆచేడియ ధరించిన చక్కని పసుపుపచ్చని చీర, బంగరుకాంతులీనెడి యాసహజ సుందర శరీరమునకు వన్నె తెచ్చుటకు గాక, చూపఱ దృష్టిదోషము నగుల కుండుటకుఁ గా నిడిన రక్షవలెఁ దోఁచెను! అపుడే వియత్పథము నలంకరించుచున్న వెలుంగుఱేని లేఁత యరుణకాంతు లాకాంతముఖసరోజమునకు నైసర్గికముగ లేని సోయగ మేమియుఁ గలిగింప నేరకున్నను, ఆలలితాంగి

చేతుల నలరారు రంగుగాజులను, జలకలశమునుమాత్రము తళుకుబెళుకులతోఁ దాండవింపఁ జేయుచుండెను. ఆంధ్రవధూటియొక్కయు, నన్యదేశపు వనిత యొక్కయు లక్షణము లాసుందరియందుఁ గానవచ్చెను. తెలుఁగుజాతిస్త్రీయే యైనయెడల, పచ్చని చీరయు, మేలిముసుఁగు నెటులు వచ్చెను? నగలును,

క్రమని పట్టణపువింతలను వృత్తాంతములను వీనులలర వినఁదొడంగెను. సోదరుని విడిచియుండుట యామె కిదివఱకే మిగులఁ గష్టముగఁ దోఁచెను. అన్నయుఁ జెల్లెలును రాజమహేంద్రవరపు సొంపులనుగుఱించియే రేయుంబగళ్లు ముచ్చటించుకొనుచుందురు. ఇప్పుడాతనితోఁ దానును బయనముచేయ మాలతి సమకట్టెను. పెండ్లియీడువచ్చిన బాల నొక్కతె నన్నగారితో దూరదేశము పంపుట కాగృహస్థులు మిక్కిలి సంకోచించిరి. కాని శశిభూషణుఁడు, తానును జెల్లెలు నుండుట కన్ని విధములగు సదుపాయములు గల గృహమును, సహవాసులును, కుదిరి యుండుట నొక్కి చెప్పఁగా, జననీజనకులు వీరిప్రయాణమున కెట్టకేల కొడఁబడిరి.

—♦ మాలతి చెలికత్తెలు. ♦—

మాలతి కాంధ్రదేశపు సంగతులన్ని మొదట క్రొత్తలే. గోదావరీనదీ విశాలజలప్రవాహము వీక్షించిన యాకలికి విశాలనయనము లెన్నఁడును నిమీలనమొల్లనటుల గానఁబడెను! ఇచ్చటఁ దమ దేశము నందువలె స్త్రీలు రాణివాసమున నుండ నక్కఱలేదు. ఇరుగు పొరుగు బాలికలతోఁగలసి మాలతి యాటపాటలయందు వినోదించుచుండును. నానాఁట వారితోఁగూడఁ దానును బాలికాపాఠశాలకు రాకపోకలు సలిపెను. తెలుఁగు లిపి యదివఱకు దనకుఁ దెలియకున్నను, అచిర కాలములోనే యందు వ్రాయను చదువను, మాలతికిఁ బట్టువడెను. తొలుదొల్త తెలుఁగు బాలికలు మాలతివంకఁ దేఱిచూచుచు, ఆ క్రొత్తపేరు వినుట కాశ్చర్యమొందుచు దూరదూరముననే యుండినను, అంతకంతకు వారికి మాలతి ముఖ్యస్నేహితురా లయ్యెను. 'వఙ్గి' బాలికయని మొదటమాలతిని చూచి మూతి విఱచువారలే యిపుడాసుందరి సహవాసమున కాశింప మొదలిడిరి.

మొదట శశిభూషణుఁ డీక్రొత్త ప్రదేశమునఁ జెల్లెలికి సహవాసినులు దొరకరని భయపడెను. తాను కళాశాల కేతెంచునపుడు

మాలతి యింట నొంటరిగ నుండవలయునని యాతఁడు భీతి నొందెను. తలిదండ్రులను విడిచి యాయబల పరదేశమున నుండఁగలదా యని యతఁడు సంశయించెను. కాని యిపుడాతని కన్నులకెల్లెడలను చెయలి చెలికత్తెలే యగపడిరి. మాలతి మూలమునఁ దానంతటికిని దగ్గరబంధువగుచుండుట కాతఁ డెంతయు సంతసించెను. ఇంటను పాఠశాలలోను చెలికత్తెలు మాలతి చుట్టును పండ్లగంప చుట్టునువలె గుమిగూడి యుందురు. వారి కందఱికి మాలతిపట్ల నింత చెలిమిగలుగుటకుఁ గారణము లేకపోలేదు. మాలతి సుస్వభావముగల బాలిక. ఈ క్రొత్తదేశపుబాలిక యుచ్చారణము, పావడగట్టుకొనుట, జడముడుచుకొనుట మొదలగు చిన్నపను లన్నియుఁ దెలుఁగు బాలలకు వింతలే. క్రొత్తదీక్షిన వెనుక మాలతి చెలిమిచేయువారి హృదయముల నాకర్షించెను. గంజాము బాలిక లెట్లు పయఁట వేసికొనెద రని యొక చెలికత్తె యడుగును. తలదువ్వుకొనునపు డోఢ్రబాలిక లేర పాపట యెట్లు తీసికొందురని వేఱొకతె ప్రశ్నించును. వారి దేశమున బాలికలు జడలో ముడుచుకొను "చెట్టుసంపెంగ" పూపు లెటులుండునని యింకొక సహచరి ముచ్చటపడి యడుగును. తెలుఁగు బాలికలు తన్ను వేయు లెక్కలేని యీ ప్రశ్నముల కేమియు విసివికొనక, వారికి మఱింత నోరూరునట్టుగ నుత్తరము లిచ్చునైపుణ్యము మాలతికే కలదు. వినినకొలఁది నింకను ఓఢ్రదేశమును గుఱించియే చెప్పుమని యామెచుట్టు వారు మూఁగుదురు. వట్టిమాటలలోనే కాక, చదువునందును. మాలతి వారిని మించెను. కావుననే సెలవులకు ముందు చేయఁబడిన పరీక్షలో మాలతి తన తరగతి బాలికలలో మొదటి దగుటచేత, గొప్ప బహుమానమును బడసెను.

—♦ శశిభూషణుఁడు. ♦—

శశిభూషణుఁడును దన చెల్లెలివలెనే. సహచరుల హృదయముల నాకర్షించెను. సామాన్యవిద్యార్థులవలె నతఁడు పఠనీయగ్రంథ

ములే మోక్షదాయకములని నమ్మియుండువాఁడు కాఁడు. ఎంతో శ్రమకోర్చి, సవిమర్శనముగ నుద్గ్రంథపఠనముఁ జేయును. ఇంతియ కాదు. అతఁడు విద్యాలాభము తనకొక్కనికే కాక, దేశీయులందఱి కిని జేకూఱవలెనను సదుద్దేశము గలవాఁడు. దేశక్షేమాభివృద్ధికర ములగు కార్యములందుఁ బాల్గొనవలయు ననుట యాతని ముఖ్యాశ యము. కావుననే యాపట్టనమునందలి ,, సంఘోజ్జీవనసమాజము " న కాతఁడు సహాయ కార్యదర్శి యయ్యెను.

శశిభూషణుఁడు తాను జనువుకొనుట కేర్పఱుచుకొన్న చిన్న గది రానురాను పిన్నలు పెద్దలు, విద్యార్థులు విద్యాధికులును, దీక్షిక సమయమునఁ గార్యాలోచనము సలుపుటకువచ్చు రచ్చపట్టయ్యెను. తాను గంజాము మండలమున నున్నప్పుడు, ఆంధ్రులకును ఓఢ్రుల కును, గల వైషమ్యము లలంఘనీయములని శశిభూషణుఁడు తలంచు చుండెడివాఁడు. ,,కోమ్మాబ్రాహ్మణులు కొండగొఱ్ఱెలు'' ని యాంధ్రు లనోఢ్రులును, ,,వడ్డివారు మడ్డివార" ని యోఢ్రులను దెలుఁగువారు నుగేలిచేసి, ఒండొరులను ద్వేషబుద్ధితో నిందించుచునికి అతని కెఱుక యే కాని. యన్యదేశీయుఁడగుతా నాంధ్రదేశ కేంద్రస్థానమగు నొక పట్టనమున నిపు డొంటరిగ నున్నను, తెలుఁగువారు తనయెడల నసూ యలేక మీఁదుమిక్కిలి తనతోఁ గలసి మెలసి యుండుట చూడఁగా నాతని కాశ్చర్యము గలిగి, దేశహితైక కార్యములపట్ల నందఱ కేకీ భావము గలుగునని యాతఁడు సిద్ధాంతము చేసికొనెను. భేదబుద్ధి వదలి ప్రజాక్షేమము నొడఁగూర్చునట్టి దేశసేవచేయుటకే యాతఁడు పూనియుండెను.

—♦ మురహరి. ♦—

శశిభూషణపాఠీకి గలతెలుఁగు మిత్రులలో మురహరి ముఖ్యుఁ డు. ఇతనికి దేశోజ్జీవనకరములగు కార్యములపట్ల పాఠీకిఁగల యుత్సా హమున్నను, పైకి మఱిమాట్లు గానఁబడువాఁడు కాఁడు, శ్రోతల

కు హృదయరంజకముగ పాఢీ యుద్రేకముతో సభలోఁ బ్రసంగించు నపుడు, మురహరి పుల్లవిఱుపుమాట యొకటి నడుమఁ బ్రయోగించి, యుపన్యాసకుని కాళ్ళకుబందములు గల్పించును. వాదనిర్వహణమందలి విజయము నభిలషించియె మురహరి యిట్లు చేయువాఁడు కాఁడని యాయిరువురి హృదయముల నెఱిఁగిన మిత్రులకుఁ దెలియును. పాఢీవలె మురహరి వాచాటుఁడు కాఁడనియు, కార్యశూరుఁడనియు నందఱు నెఱిఁగియున్నారు.

ఒకనాఁటి సాయంకాలము గోదావరినది యొడ్డున చల్లగాలి సేవించుచు మురహరి శశిభూషణులు గూర్చుండి యుండిరి. మలయ మారుతము వీచుచుండినను, గొప్ప విషయములను గుఱించి వీరికితీవ్రచర్చ జరుగుచుండుటచేత, మానసములు మాత్రము తహతహపడుచుండెను. ఇఁకఁ గొలఁదికాలములోనే విద్యాపరిపూర్తియై యిరువురు నాపట్టనము విడిచి పోయెదరు. తాను బరీక్షలో జయ మొంది, యుద్యోగస్వీకారము చేసినతోడనే, లోకోపకార కార్యములయందుఁ దనకుఁగల యమితోత్సాహమను మహాప్రవాహమందు జనుల హృదయములు మున్కలు వేయునటులు గావించెదనని శశిభూషణుఁడు పలికెను! మురహరి యట్లు ప్రసంగింప నొల్లక, తన యొడ్డుపొడుగు ముందైన నంతియనుంచుననియును, నిక్కువముగ లోకము నుద్ధరింపఁగలవి మాటలకంటె పనులే యనియును, వక్కాణించెను. అంత వారిద్దఱికిని బ్రబలమైనవాదము జరిగెను. కాని దాని పర్యవసానము, "శోషం కోపేన పూరయేత్" అను విధముగఁ బరిణమింపక, అది వారిహృదయములను మఱింత మిత్రభావముతోఁ గట్టునట్టిసూత్ర మయ్యెను. తుట్టతుదకు పాఢీ, "అటులైనయెడల నీ వీకార్యమునకు సిద్ధముగనున్నావా?" యని యడుగఁగా, "మీ రిద్దఱు సిద్ధముగ నున్నయెడల, నేనును సిద్ధమే" యని మురహరి పలికెను. ప్రేమ యుట్టిపడు నట్టులూ నత నామిత్రులొకరి నొకరు కౌఁగలించుకొని, తమ యిండ్లకు వెడలిపోయిరి.

—♦ అన్నచెల్లెండ్రసంభాషణము. ♦—

ఆరాత్రి మాలతీ శశిభూషణులకుఁ గంటఁ గూర్కు రాలేదు. వారు మాటలసందడిని నిద్రమాటయే మఱచిరి! రాత్రియగుట, తెల్ల వాఱుట,—ఇవి రెండు మాత్రమే వారికన్నులకుఁ బొడఁగట్టెను! కాని, తెల్లవాఱులోన నన్నయుఁ జెల్లెలును, దీర్ఘకాలానుభవము వలనఁ గాని తేలని విషయములఁగూర్చి చర్చలను గావించుకొనిరి. ఆసోదరీ సోదరులకు జరిగిన రహస్యసంభాషణ మంతయు నిచట వెలి పుచ్చ నక్కఱలేదు. ఇంకఁ దెల్లవాఱు ననఁగా శశిభూషణుఁడు చెల్లెలు నిట్లు మాటాడుకొనిరి:—

శశిభూషణుఁడు:—"కాని, అమ్మాయీ! నీకాతనియందుఁ గలయను రాగము, ఇదివఱ కెన్నఁడును సూచింపనైన సూచింప లేదే?"

మాలతి —"అవసరములేని ప్రసంగములకు అంగనలు పోఁగూడదని."

శశి—"మనతలిదండ్రులు నీకీవేసవిలో వివాహము చేయఁబూని యున్నారు సుమీ!"

మాలతి—"నీ వేమి చేయఁ బూనియున్నావు?"

శశి—"పెద్దవారలుండఁగా పిన్నవారేమి చేయఁగలరు?"

మాలతి—"నాబోఁటిబోటు లిచ్చుసమాధానము విద్యాధికుఁడగు పురుషునినోట వినవచ్చుచున్నదే!"

శశి —"కాదు మాలతీ! నీవు మనసిచ్చి ధారాళముగ మాటాడుము."

మాలతి—"అన్నయే నా కీవిషయమున దారిచూపవలెను!"

శశి—"ఐతే, వినుము. మురహరి నాకుఁ బ్రాణసమానము."

మాలతి"—అన్నయ్యకు నాకును హృదయమొకటియే."

శశి—"అతఁడే నీకుఁ దగినవరుఁడని భావించెదను,"

మాలతి—"ఐన?"

శశి—"మన జననీజనకులు పూర్వాచార పరాయణులగుటచేత ఓఢ్ర వధువు నాంధ్రవరుని కీయరని నాభయము,"

మాలతి—,,భయపడి యేమిలాభము?''

శశి—,,కాఁబట్టి యేమిచేయవలెను?''

మాలతి—,,నీకుఁ దెలియదా?''

శశి—,,అంతరాత్మ ప్రబోధముముందట జననీజనకుల పట్ల మనకున్న విధుల నొక్కింత తగ్గింపవచ్చును.''

మాలతి—,,ధైర్యముతో మెలఁగఁగలవారే యిట్లు చేయవలెను.''

శశి—,,చెల్లీ! ఈవిషయమున నీకు మాటలకంటెఁ గ్రియలే ముఖ్యమని నేనును మురహారియుఁ దలంచుచున్నాము ''

మాలతి—,,నన్నుఁగూడ మీలోఁ జేర్చుకొనండి. ''

శశిభూషణుఁడు తన చెలియలి హృదయ మెఱిఁగి, తన ప్రాణమిత్రమగు మురహారి ప్రణయము తా నొనఁగూర్పఁగలిగినందున కెంతయు సంతసించెను.

—♦ మాలతి వివాహము. ♦—

ఈ సంభాషణము జరిగిన రెండుమూఁడు దినముల పిమ్మట నొకనాఁటి ప్రాతఃకాలమున రాజమహేంద్రవరమున గోపాలస్వామి దేవళమునందలి ముఖమండపము పచ్చని తోరణములతోను, సుందరమగు రంగుపూలతోను నలంకరింపఁబడియుండెను. ఒకమూల వాద్యములు మ్రోగుచుండెను. సదస్యులలోఁ జాలమంది హూణవిద్యాభ్యాసము చేయు యువకులును, సంఘసంస్కరణాభిమానులును. వయస్సువచ్చిన స్త్రీలకంటె బాలికలు మెండుగ నుండిరి. పురోహితుఁడు గ్రుక్కత్రిప్పక, మంత్రము పఠించుచుండెను. అచటఁ గూడినవారెల్లరును వరుని విద్యాబుద్ధులను గుఱించియు, వధువురూపగుణాధికతను గూర్చియు ప్రశంసించుకొనుచుండిరి. ఎట్టకేలకు వివాహము పరిసమాప్తమయ్యెను. సదస్యులు మంత్రములు చదివియాశీర్వాదము లొసంగిరి. అగ్రతాంబూల మెవరికీయవలెనను సంగతి యపుడాలోచనకువచ్చెను. అంత నచటి ప్రముఖుల యనుమతిచొప్పున, ఒకప్రక్కఁ గూర్చుండి

యుండు వయోవృద్ధునొద్దకు నూతనవధూవరులు వచ్చి, ఆయనకు మ్రొక్కి, ఆయనచేతిలో నగ్రతాంబూలము నుంచిరి. ఆయనమంత్రములమూలమున నాశీర్వదింపక, పొంగి పొరలివచ్చు నుత్సాహమున నాలుకతడఁబడుచుండ, మాటిమాటికిని వచ్చుదగ్గు నాఁపుకొనుచు, తేఁట తెలుఁగు మాటలతో నిట్లు పలికెను: ,,మాలతీ! మురహరీ! హిందూజాతియైక్యమునకును, దేశాభివృద్ధికిని, పరమసాధనమగు నంతర్జాతీయ వివాహపథమున మీరు మార్గదర్శులై ధన్యులైతిరి. మీరు నేఁడుచూపించిన ధైర్యమున కీశ్వరుని నేను మిగుల వినుతించుచున్నాను. శశిభూషణా! నీవుకనఁబఱచిన కార్యోత్సాహ మెంతయు శ్లాఘనీయమైనది!'' అని పలికి, తాను రచించినగ్రంథరాజము లా నూత్న దంపతులకు మొదటికట్నముగ నొసంగెను. ఈయనయే, సంఘసంస్కరణోద్యమము నుద్ధరించుటకును, దేశోపకార కార్యములు జరుపుటకును, తనసర్వస్వమును ధారపోసిన పంతులుగారని యందఱుచెప్పుకొనిరి. వధూవరుల నభినందించుచు సదస్యులలో ననేకులు బహుమతులలో వారలను ముంచివేసిరి.

వివాహవేదికనుండి నూతన దంపతులు క్రిందికి దిగుచుండఁగనే, యపుడేవచ్చిన పొగబండినుండిదిగి, పెండ్లివా రెక్కడనని యడుగుచు, గుండెలు బాదుకొనుచునిద్దఱు ముదుసలు లచటికి వచ్చేసిరి. వీరు విశ్వనాథ శాస్త్రియును, ఆయన భార్యయును, అని చెప్పవలయునా? తమయనుమతిలేక యేకుమారుఁడు చేయనున్నయీయశాస్త్రీయమును అనాచారమును నగు వివాహముసంగతి తంత్రీమూలమున నెవ్వరో క్రిందటిదినముననే వారికిఁ దెలియఁబఱిచిరి! లేడిగుంపును దఱియవచ్చు పెద్దపులివలె శాస్త్రి యాగ్రహావేశపరవశుఁడై, తన తనయులను సమీపించెను. కాని వధూవరులు తత్క్షణమే యాయన పాదముల కెరఁగి, యాయనదీవనలఁ బడసికాని లేవమని చెప్పిరి! ,,నూతనదంపతులను దీవింపుఁడుదీవింపుఁడ'' ని సదస్యులొక్క పెట్టున

గేక లిడిరి. అంత పాఢీగారియొక్కయు ఆయన భార్యయొక్కయు దీవనలందుకొని ఆక్రొత్త పెండ్లికొడుకును పెండ్లికూఁతురును, అప్పుడే పట్టాభిషేకము నొందిన రాజును దేవేరియువలెఁ దేజరిల్లిరి. కొమరుని కొమరితను గౌఁగిలించుకొని, పాఢీయు భార్యయు నానంద బాష్పములు విడిచిరి. వారికోపానల మంతటితోనే యుపశమించెను.

తరువాతి వృత్తాంతము విపులముగఁ జెప్పనవసరములేదు. విశ్వనాథపాఢీగారిపుడు వయోవృద్ధులయియున్నారు. వేదాంత కాలక్షేపములు సలుపుచు నీయన, „ఆర్యజనైక్యము" అను గ్రంథరాజమును రచియించుచున్నారు. దానిలో గాడ ద్రావిడు లిరువురును ప్రాచీనార్యులసంతతివారలే యనియును, వివాహసంబంధములు భోజనప్రతిభోజనములును వారలలో నుండుట న్యాయ్యమనియును, వారు నిర్ధారణచేయుచు, దీనికి వలసిన శాస్త్రప్రమాణములను జూపించుచున్నారు. శశిభూషణుఁడు, ఆంధ్రదేశమందొకగొప్ప యుద్యోగమున నున్నాఁడు. దేశములోని సంఘసంస్కర్తలలో వీరుపేరెన్నికగన్నవారు. మాలతీ మురహరులు విజయవాటిక యందుఁ గాపురమున్నారు. న్యాయవాదివృత్తిఁ జేకొని మురహరి ఋజువర్తనముచేతను, పరోపకారపారీణతచేతను, నందఱిచే గౌరవింపఁ బడుచున్నాఁడు. వీరి పుత్త్రులు పుత్త్రికలును, ఆంధ్రులకు ఓఢ్రులకునుగల సుగుణ సౌశీల్యములు గలిగి వర్ధిలుచున్నారు. మాలతి యిపుడు బెజవాడలో హిందూకాంతల జ్ఞానాభివృద్ధికై యనేక విధములఁ గృషిచేయుచున్నది. మాలతీ కుసుమపుఁ బరిమళ లహరులవలె మాలతి గుణగణములు, ఎల్లెడల వ్యాపకములై స్త్రీజాత్యుద్ధరణమునకుఁ దోడ్పడుచున్నవి!

మచ్చపులి.

I

ఈమధ్య నేను బంధువులను జూడవలయునని వారిగ్రామమునకుఁ బోయి యుండఁగా, అక్కడ నొక మిగులచిత్రమగు సంగతి విని యుంటిని. ఇతరుల కాసంగతి తెలియఁబఱచి, నాకుఁ గలిగినయాశ్చర్యమును వారికిని గలిగింపవలయు ననుకుతూహలముతో దాని నిచట వివరించుచున్నాను. ఇంతియెగాక, ఇటువంటిసంగతులు కొందఱు విని యుండవచ్చును గావున, అట్టివారు తామువినిన సంగతులను జనోపయోగార్థమును, పరుల వినోదార్థమును ప్రచురించునటుల నేను వ్రాసినవృత్తాంతము కొంతవఱకుఁ బ్రోత్సాహపఱుపఁ గల దనునమ్మకముతో నప్పుడు నేను వినిన సమాచార మిచట విన్నవించుచున్నాను.

పెద్దపులులనుగుఱించిన సంగతులును, వృత్తాంతములును, విననివారెవ్వరు నుండరు. మనదేశమునందు మనుష్యునకు ముఖ్యశత్రువు వ్యాఘ్రమె. పిల్లలును పెద్దలును పులులసంగతులు చెప్పుకొనుచు వినోదింతురు. పులిని జంపినవానిని మనము మంచిధైర్యశాలియని మెచ్చుకొనుచుందుము. కోయవాండ్రు మొదలగు విపినవాసులు పులులను సులభముగఁ జంపఁగలరనియు, వానిని స్వాధీనము చేసికొని వానితో దుక్కి దున్నెద రనియును, వదంతి గలదు! ఇంతేగాదు. కోయవాండ్రును సవరవాండ్రును పరకాయ ప్రవేశమను విద్యారహస్యమును గ్రహించిన వారగుటచేత, ఒక్కొక్కప్పుడు వారు తమదేహముల నొకచోట విడిచినైచి, అప్పుడే మృతినొందిన పులులకళేబరములలోఁ బ్రవేశించి, తమయిచ్ఛ నచ్చినచొప్పున నరణ్యములలోఁ దిరుగుచుందురను ప్రతీతి గలదు!

పై నుదాహరించిన గ్రామమునకుఁ బోయినప్పు డిట్టివృత్తాంతమును నేనొకటి వినియుంటిని. మాబంధువులయింటిలో, "మచ్చపులి"

వారని మాటలసందర్భమునఁ గొందఱుచెప్పుకొనుచుండఁగా, ,,మచ్చపులి'' వారని వారికిఁ బేరేల గలిగినదని నేనడిగితిని. ఆపేరు గలవారిపు డొకయింటివారుమాత్రమే యాపట్టణము నందున్నారనియును, వారిపూర్వులలో నొకరు మంత్రశక్తివలనఁ బెద్దపులియాకారమును ధరించి యడవులఁబడి పోఁగా, ఆయనభార్య సాహసముతో వానిని గనుఁగొని, తిరిగి మనుష్యునిగఁ జేసి యింటికిఁ గొనివచ్చినదనియును బంధువులు నాకుఁ జెప్పిరి! వారు చెప్పిన యొకటి రెండు మాటలవలన నాకుఁ దనివితీరక, ఈసమాచారమును సవిస్తరముగ వినఁగోరి, ,,మచ్చపులి'' వారియింటికే వెడలిపోతిని.

నేను వారియింటికిఁ బోయినప్పుడు సాయంకాలము నాలుగున్నర, ఐదుగంటలు అయినది. కనుచీఁకటిసమయ మయినదని చెప్పవచ్చును. ,,మచ్చపులి'' వారియిల్లు మొదటిపర్యాయము చూచిన బాలురకు, పులులకథలు విననప్పుడు జనించునొకవిధ మగుభయమును ఆశ్చర్యమును గలుగును! వీరిది పెద్ద తాటియాకులయిల్లు. ఒకప్రక్కను పెద్దమిద్దె గలదు. పూర్వ మీగృహమున ననేకులుండిరఁట. ఇప్పుడు మాత్రము ముగ్గురందుఁ గాపురము చేయుచున్నారు వీరు, వయసు దీరిన యొకస్త్రీయును, ఆమెకొడుకును,కోడలును. అక్కఱలేని వైశాల్యము గలిగి యుండుటచేత, ఆయిల్లు ,బావు' మనునట్లుగ నుండును! పెరడును పెద్దదియే. అందొకపెద్ద చింతచెట్టు గలదు.

నేనీయింటికిఁ బోయినప్పుడు సాయంసమయ మయినదని చెప్పియుంటిని. ఇల్లు ప్రవేశించిన కొన్నినిమేషములవఱకును నాకచట మనుష్యసిజాడ గానఁబడలేదు! పెద్దబావడి చూరునం దప్పుడప్పుడు వినవచ్చు పిచ్చుకలచప్పుడు తప్పనా కేయలుకుడును గానరాకుండెను. మనసులో నొకవిధ మగుభయము గలిగిన నాకన్నుల కప్పుడు దూరమున వంటయింటిగుమ్మమునఁ గొంతసేపటి కొకముసలివితంతువుయొక్క యాకారము గానవచ్చెను! బాల్యావస్థలోనే నేనుండినయెడల,

అది గయ్యమే యని భ్రమించియుందును. కాని నేనామెను సమీపించి, నావృత్తాంతమును జెప్పఁగా, ఆయవ్వకూర్చుండుమని సన్మానంతో గారవించెను. ఆమె పూర్వకాలపుమానిసి. ఎందుచేతనోగాని, ఆ యింటనేను నిలిచియుండి, యామెమాటలు వినునంతసేపును, ఏఁబది యరువది సంవత్సరములకుఁ బూర్వకాలమున నేనుండునటుల నాకుఁ దోఁచెను! తమ కాయింటిపే రేల గలిగినదని నే నడిగినప్పు డామె తమపూర్వికుల వృత్తాంతమునంతను బూసగ్రుచ్చినట్లు చెప్పి, నాయాశ్చర్యమును బెంపుచేసెను!

II

ఈయింటివారి పూర్వపుపేరు "దేశరాజువా"రఁట. దేశరాజు ప్రకాశముగారు పైనిజెప్పిన ముసలియవ్వమామగారి తాతగారఁట. నూఱుసంవత్సరములకుఁ బూర్వ మీయూన చుట్టుపట్టుల నుండు కొన్ని గ్రామములకు సముద్దారుగ నుండెడివాఁడు. ఈయనసాత్వికస్వభావము గలవాఁడు. ఉద్యోగపుపనులమీఁద నీయన తఱుచుగ దేశసంచారము చేయుచుండువాఁడు. ఈసంచారములం దీయన కోయవాండ్రతోడను ,,గోసాయీలు''తోడను సంపర్కము గలిగియుండెనువాఁ డని వాడుక. ఒకనాఁ డీయన యింటికి వచ్చి, భర్యతోఁ మాటలధోరణిని మనుష్యుఁడు పులియగుట సులభమని చెప్పెను. ఆవిడపేరు మహాలక్ష్మి. మహాలక్ష్మి మిక్కిలి బుద్ధికుశలతగలస్త్రీ. భర్తయెడల గౌరవము గలిగిన దయ్యును, ఆయన చెప్పినయీపలుకులయం దెంతమాత్రమును నమ్మిక లేక, పరిహసించెను. ఆమెవచనముల నాగ్రహించి ప్రకాశముగారు, తాను జెప్పినమాటలసత్యము నామెకుఁగనఁబఱచెద నని చెప్పి, భోజనానంతరము ఒకయాకుపొట్లమును దెచ్చి, తన కది యొకమహాత్ముఁ డిచ్చెననియును, దానిప్రభావమువలనఁ దాను బలికినవాక్యముల సత్యమును గ్రహింపవచ్చు ననియును, భార్యతోఁ జెప్పెను. అప్పు డాపొట్లము విప్పి చూడఁగా, దానిలో నెఱ్ఱనివి కొన్నియును, పచ్చనివికొన్నియును, అక్షత లుండెను! మంత్రోచ్చారణఁ జేసి యెఱ్ఱనియక్షతలు

తనతలమీఁద వేయించుకొనినమనుష్యుఁడు పెద్దపులియగు ననియును, అట్టిపులికి ముఖముమీఁదఁ బెద్దమచ్చ యుండు ననియును, పిమ్మట స్నేహితు లెవరయిన నింకొకమంత్రమును బఠించి పచ్చనియక్షత లాపులి నుదుటిమీఁదఁ బడునట్లుగ వైచినయెడల, తిరిగియది మనుష్యునియాకారము దాల్చు ననియును, ప్రకాశముగారు సెల విచ్చిరి!

ఇదివిని మిగుల నాశ్చర్యమునొంది, మహాలక్ష్మి, ఏవిధముననైనను పతిపలుకుల సత్యాసత్యముల గ్రహింపఁబూనెను. ఇట్టిసంగతిలో మనుష్యస్త్రీల కందఱికిని కుతూహల ముండకమానదు. కాని దీనినిబరీక్షించునపుడు తటస్థమగుకష్టములు పడుటకుమాత్రము సామాన్యులు సాహసింపనేరరు. మహాలక్ష్మిమాత్ర మటువంటిదిగాదు. ఈవిషయమై యామె మిక్కిలి పట్టుదలగలిగి, విధ్యుక్తముగఁ బతియొద్ద మంత్రములు గ్రహించి, సర్వమునకును సిద్ధమయ్యెను!

ఒకనాటి మధ్యాహ్నసమయమున, భోజనానంతరమున విశ్రమించియుండునపుడు, ఆదంపతు లీసంగతిని గుఱించి మాటాడుకొనిరి. మంత్రములం దెంతో నమ్మకముగలిగియున్నను, లోకానుభవముగలవాఁడుగావున, ఏప్రమాదముచేతనైనను సంగతులు తారుమారై, ఎదురు చూడని యాపద లాసన్నముగా వచ్చునని ప్రకాశముగారు మంత్ర ప్రభావమును గన్నులారఁ జూచుటకు వెనుదీయుచుండువాఁడు. కాని యాదినమున, భార్యమాటలవలన మనసుదిరిగి, ఘోరమగు నాయక్షతల మాహాత్మ్యమును శోధించుట కుద్యుక్తుఁ డయ్యెను!

పఠింపవలసిన మంత్రములు బాగుగ భార్యకు వచ్చునో లేదో పరీక్షించి, రెండువిధములగు నక్షతలు నామెచేతి కిచ్చి, మిగుల క్లుప్తముగ వానిని వాడుకొమ్మని చెప్పి, ఆమె నటుకమీఁదఁ గూర్చుండఁ బెట్టి, తలుపులుబిగించి, ప్రకాశముగారు మంత్రపఠనముచేసి, తన మీఁద నక్షతలు వేయుమని భార్యతోఁ జెప్పిరి! వేగమె యామె యెఱ్ఱని రెండు గింజలు దీసికొని వానిమీఁదవైచి, యేమిజరుగునో యని

యాశ్చర్యముతోఁ జూచుచుండఁగా, ఆమె కన్నుల కత్యద్భుతమగు పెద్దపులి యాకారము గానవచ్చెను! ఆమె జన్మమెత్తి యెప్పుడును వ్యాఘ్రదర్శనముఁ జేసియుండలేదు! ఈమంత్రాక్షత లింతప్రభావము గలిగి యుండునవని యామె కలలోనైనను దలంపలేదు. ఇంతవఱకు వచ్చునని యామె యెన్నఁడు నూహింపలేదు. లేనియెడల, ఇరుగు పొరుగువారి నెవ్వరినైనను దనకు సాహాయ్యము నిమిత్తము తెచ్చుకొనియే యుండును. ఇంటిలో పులియుండఁగా నటుకమీఁదఁగూర్చుండియుండు నాడుమానిసి గుండె లెట్టు గొట్టుకొనునో చెప్పవలయునా? అంతట క్రిందనుండు పులి యిటునటు తిరుగుచు, "గాండ్రుగాండ్రు" మని కేకలువేయ సాగెను. ఈశబ్దము విననప్పుడు మహాలక్ష్మికి బొత్తిగ మతిపోయెను. మాఱు అక్షతలు పులిమీఁద వేయవలయునను ఆలోచనయె కొంతసేపటి వఱకు నామెకు స్ఫురింపలేదు. అక్షతలు వేయవలెనను సంగతి జ్ఞప్తికి వచ్చి, ఆమె పచ్చనియక్షతలు కొన్ని పుచ్చుకొని నప్పుడు, చేతులు వణకసాగెను. దీనికిఁ దోడుగ నింకొక కష్టముకూడ నావహిల్లెను. పులియొకచోట నిలువఁబడకకోపముతోఁ జిందులు ద్రొక్కెను. ఐనను సాహసముఁబూని యాకాంత రెండుమూఁడు గింజలు పులిమీఁదఁ బడునట్లు వేసెను. కాని వేలయోగాని, వానివలన లాభమేమియు లేక పోయెను!

కష్టసమయమునందే మనకు సామాన్యముగ మతిస్థైర్యము తొలఁగిపోవును. తాను ముందుగ మంత్రమును బఠింపకయె పట్టియక్షతలువేసితి ననుసంగతి యాస్త్రీకిఁ గొంతసేపటి వఱకునుబోధపడలేదు. ఈసంగతి జ్ఞప్తికివచ్చిన వెంటనే యామె మంత్రమును బఠింపవలెనని తలంచెనుగాని, మంత్రముయొక్క మొదలు స్ఫురింపదయ్యెను! ఏవిధముననో యామె మంత్రము పఠించి యక్షతలు తిరిగి పడవైచెనుగాని, అవి పులిముఖముమీఁద బడుటెట్లు? కార్యవైఫల్యమున కాకాంత మిక్కిలి వగచి, తనదగ్గరనున్న యక్షత లన్నియు వృథాగాఁ బాఱ

వైచుట కోపక, ఊరక కూర్చుండియుండెను. వ్యాఘ్రము బొబ్బరింతలుపెట్టి, తలుపు బ్రద్దలు చేసికొని, వీధిం జొచ్చెను. పులికూంతలువిని యదివఱకే భీతినొంది మూలమూలల దాగియున్న యాయూరివారికిం గొందఱికి, వీరింటినుండి పెద్దమచ్చపులి వెడలివచ్చి, అరణ్యములవైపునకుం బాఱిపోవుట గానవచ్చెను!

III

దేశరాజుగారింట వారిరువురు తప్ప యింకెవ్వరును లేరు. భర్త యిట్లు పులిగా మాఱిపోయి యడవులకేగంగా, భార్య యొక్కతె యింటనుండవలసివచ్చెను. ఆమెయప్పుడు పడినకష్టమును దుఃఖమును వర్ణింప నలవిగాకుండెను. భర్తమరణమున కొడిగట్టినదని యామెను, ఆమె యంతరాత్మయెగాక, లోకమందఱును నిందించిరి. తుదకుభర్త లోకులవలె మరణమునొందినను మేలెయని యామె తలంపసాగెను. చచ్చినవాండనిగాని, బ్రతికియున్నవాండనిగాని చెప్ప నలవిగాని పరిస్థితి తలంచుకొనినప్పుడు, పాపము మహాలక్ష్మిగుండె చెరువగుచు వచ్చెను. తన యుద్యోగధర్మముల నెఱవేర్చుచు, హాయిగ నింటనుండి లోకమందఱి మన్ననలను గనుచున్నభర్త యిప్పుడు, ఏకాకియై మృగరూపమునుదాల్చి, ఆంకలిచేతను దప్పికచేతను అడవులను కొండలను దిరుగుచు గాసిపడుచుండుట తలంచుకొని, మహాలక్ష్మి రోదనముచేయుచుండును. సామాన్యమగు పులియేయని యేవేటకాండైనను భర్త ప్రాణము దీసివైచునేమో యని యామె భయపడుచుండును. ఆయూరివారెవ్వరును మహాలక్ష్మిని తగినట్టుగ నోదార్చుటకుంగాని, సహాయపడుటకుంగాని, చాలియుండలేదు.

ఇట్లుండంగా, చెల్లెలిదురవస్థ తెలియవచ్చి, మహాలక్ష్మి యన్నలిరువురు దూరదేశమునుండి యామెనుజూడవచ్చిరి. ఆమెదీనాలాపములచే మనసుగరంగి, వారు తమ బావను వెదకుటకు సమ్మతించిరి,

కాని వా రేమిచేయఁగలరు? పట్టనములును, పల్లెలును వెదకుటమైనచో, వా రెంతదూర దేశములైనను జూచి రాఁగలుగుదురుగాని, ఏదోయొక విధమగు పులిజాడలు కా అడవులలో వారి కెవ్వరుచెప్పెదరు ? ఐనను పాప మాసోదరులు తమ సర్వశక్తుల వెదకి, విసికి వేసారి, చెల్లెలి దగ్గఱకు వచ్చి, తమ బావ మృతుఁడయ్యెననియె తలంచుట కర్తవ్యమని యామెకు బోధన చేసిరి.

తన్నుఁ బుట్టినింటికిరమ్మని సోదరు లెంత వేఁడినను మహాలక్ష్మి సమ్మతింపక, పతి యిట్టి దిక్కుమాలిన స్థితిలో నుండఁగఁ దాను రాఁజాలనని చెప్పివేసి, వారిని వారి గ్రామము పంపివేసెను. కాలయాపనము చేసిన యెడల పతి విముక్తుఁ డగుట దుర్లభమగునని యెంచి యాసుదతి, పరిచారకులను గొందఱి నడవులలోఁ బులుల జాడలు వెదకుటకై నియమించెను. కాని వా రేమియుఁ జేయఁజాలకపోఁగా, వేఁటగాండ్రను గొందఱిని రప్పించి, వారితోఁ దన పతివృత్తాంతము చెప్పెను. తన్నడవులలోనికిఁ దీసికొనిపొండని వారి నామె యడిగినప్పుడు, నమ్మఁదగని యామె పతివృత్తాంతమును, ఆమె సాహసమును వారికిఁ బరిహాసపు పలుకులవలెఁ గానిపించెను ! ,, స్త్రీలగు మీ రేమి, అడవులలోఁ బులులకై తిరుగుట యేమి ! కష్టముల కోర్వగలపురుషులమగు మే మెయీయిక్కట్టులకుఁ దాళజాలకయున్నాము!" అని వేఁటగాండ్రు పలికి, ఆమె యిచ్చెదనన్న బహుమతులనైన నపేక్షింపక, తమదారిని దాము పోవుచుందురు. పతిసంగతి యట్లుండఁగ, మహాలక్ష్మి యాగ్రామములో నందఱికిని మతిభ్రమ గలిగినదానివలెఁ గానిపించెను. రేయుంబవళ్లామె పులులను గుఱించియె తలంచుచుండుటచేత, గ్రామస్థులందఱును, ఆమెదురవస్థకు వగచుటకు మాఱుగ, ,, మచ్చపులి మహాలక్ష్మమ్మగారూ ! " అని మీఁదు మిక్కిలి యామెను పరిహాసములు చేయుట కారంభించిరి !

IV

ఎద్దుపుండు కాకికి నొప్పిని గలిగించునా ? ఒకరిదుఃఖ మింకొకరికి దురవగాహముగ నుండును. తేలు కుట్టినవారు శోకించుచుండఁగ నా స్నేహితుఁ డొకఁడు, వారిది తెచ్చిపెట్టుకొనిన దుఃఖ మని నవ్వుచుండెడివాఁడు ! దీనికిఁ గారణ మాతని కదివఱ కెన్నఁడును తేలు బాధ కలుగకపోవుటయె. అంత నొక నాఁటి సాయంసమయమున నతని కాయనుభవము గలుగఁగా, తన్నుఁ గుట్టినది తేలు కాక మఱి యేదియో యొక గొప్ప విషజంతువై యుండుననియు, కాని చో నింత బాధయేల గలుగు ననియును, అతఁ డాశ్చర్యము నొందెను! అట్టులె పాపము మహాలక్ష్మి మనోక్లేశము పరుల కంతగ బోధపడకుండెను. తుదకొకనాఁడు, ఒక ముసలి వేఁటకాఁడా గ్రామమువచ్చుట తటస్థించెను. మహాలక్ష్మి పలుకు లాతఁడు చెవియొగ్గి విని, నలుగురి వలెను నవ్వక, „అమ్మా ! మీరు చెప్పిన సంగతి మిక్కిలి యాశ్చర్యకరముగ నున్నది. ఐనను, మీసాహసము మిక్కిలి ఘనమైనది. పులలవేఁట యందు నాకుఁ జాల యనుభవము గలదు. కాని, మీరాకష్టము లన్నియుఁ బడఁగలరా? ” అని యడిగెను. తా నంతటికి సిద్ధముగ నున్నానని యామె ప్రత్యుత్తరమిచ్చి మఱునాఁటి యుదయమె వానితో నడవులకుఁ బ్రయాణమయ్యెను.

మహాలక్ష్మికడవులలోఁగలిగినకష్టములసమాచారము నే నిచటఁ జెప్పఁ బూనుకొన లేదు. వేఁటకాలము రెండునెలలును, ఎడతెరపిలేక, ఆమె యాముసలివేఁటకానితో విపినములలో సంచారము చేసెను. పాపమా వేఁటకాఁడు, ఆబ్రాహ్మణస్త్రీని దన కొమార్తెవలెనే భావించి, పరుని వెదకుచుంటి ననుసంగతి మఱచిపోయి, తన యల్లుని కొఱకె తాను దిరుగుచున్నట్టుగఁ దలపోసి, కష్టములకోర్చెను. ఒక నాఁడు వీ రిరువురును, అడవిలో నొకమంచెమీఁదఁ గాచియుండఁగా, పులియొకటి చేరువుననున్న యొక కొండవాగుదగ్గర నీరు ద్రావుటకయి

వచ్చెను. అప్పుడు రాత్రి రెండుజాములయ్యెను. కన్నును గాలును కనపడకుండెను. అప్పుడు వేటగాఁడు ,,గభేలున"తుపాకిని బేల్చెను. గాయముతగిలిన వ్యాఘ్రము, తుపాకిరవవచ్చిన మార్గముననె యెగసి, మంచెమీఁదికి దుమికెను. కొంచెము నిద్రావస్థలో నున్న యాస్త్రీ యులికిపడి, కేకలిడి, క్రిందికిఁ బడుటకు సిద్ధమయ్యెను. వేటగాఁ డామె నోదార్చుటకయిన వ్యవధిలేక, తోడనెతిరిగి గురిపెట్టి, రెండవ మాఱు తుపాకిని బేల్చెను. పులి చచ్చి పడిపోయెను. మఱునాటి యుదయమున వారు మంచె దిగివచ్చి చూచుసరికి, ఆపులితోఁకతోఁ దొమ్మిదిమూళ్ళుండిన గొప్ప పులిగాఁ గానుపించెను! మచ్చ యున్న దేమోయని మహాలక్ష్మి దాని ముఖ మఫుడు తడవెను! కాని దానికి ముఖమున మచ్చలేదు.

ఇటువంటి యబలతోఁ దాను బ్రాహ్మణునికయి వెదకుట వ్యర్థమనియు, నుపద్రవకరమనియును గ్రహించి, వేటకాఁడిఁక వెదకుట నిరుపయోగమనియును, ఇంకను గోమన్యములలోని కొకవేళ మచ్చపులి పోయి యుండవచ్చుననియును, ఐనను, ఆ కాఱడవుల లోనికిఁ దాన్నైనను బోఁజాలననియును మహాలక్ష్మితోఁ జెప్పివేసెను.

కాని మహాలక్ష్మి ధైర్య మింతటితో సమాప్తి నొందలేదు. మనుష్యమాత్రు లెవ్వరును దనకిఁక సాహాయ్యము చేయఁజాలరని యామె తెలిసికొని దైవముమీఁదనె భారమువైచి, ఆయబల యొంటరిగనే కాఱడవులలోనికిఁ బయన మయ్యెను.

మహాలక్ష్మి యడవులకు వెడలిపోయిన తరువాతనామెవృత్తాంతమా గ్రామమువారి కేమియుఁ దెలియనే లేదు. రెండు మాసములు గడచినపిమ్మట, ఒకనాఁడు ముసలివేటకాఁడా గ్రామములోనుండి నడచి పోవుచు, తమ యుద్యమము వ్యర్థమయ్యె ననియును, ఐనను మహాలక్ష్మి పిచ్చి ధైర్యముతో నొంటరిగఁ దిరుగుచున్న దనియును

జెప్పెను. తరువాత నామె సమాచార మేమియు నా గ్రామస్థులకుఁ దెలియనేలేదు. ఏ కొండలలోనో యెండదెబ్బచేత నామె మడిసి యుండునని కొందఱును, ఏదో యొక పులినోటిలోఁ బడిపోయియుండు నని మఱికొందఱును దలపోసిరి.

V

లోమన్యములలో గొప్ప రాజగు నానందరంగరాజుగారికి వేట యనిన నెంతోమక్కువ. ఆయన సంహరించిన పులుల తలలు పెద్ద గోటికి వ్రేలాడఁ గట్టఁబడి కోటగుమ్మము నలంకరించి యుండును. ఆయన నిద్రాహారముల నైన మానివైచి, వేఁటకుఁ బోవుచుండును. పెద్దపులియొకటి దూరపుకొండలలోనికి వచ్చి, చుట్టుపట్టులను మేయుచున్నపశువులను రెంటిమూఁడింటిని సంహరించెనని యొకనాఁడాయనకు వర్తమానము వచ్చెను. దానిజాడలు గనిపెట్టిన యొకరిద్దఱు వేఁటకారులది యసాధారణమయిన పులి యనియును, పెద్దపరివారముతో వచ్చి, మెలఁకువతో మా టొగ్గినఁగాని, దానిని గొట్టుట యసాధ్యమనియును జెప్పిరి. ఆనందరంగరాజుగారికిఁ గావలసినదే యిటువంటి పులి. ఆయన యిదివఱ కెన్ని పులులనో విపినభూమికి బలి యిచ్చి యుండిరి. పులిరక్తము చూడలేక యాయన కన్నులు కాయలు గాచినవి. ఇఁక వేట యను పాపకార్యమును జాలించుకొని, ‘‘కృష్ణా, రామా’’ యనుకొని, దినములు గడపవలె నని యుద్దేశము గలిగి యున్నవారని ప్రతీతి. ఏది యెట్లున్నను, ఈ గొప్ప పులిని సంహరించి, తమ కోట కవాటముయొక్క హారమునకు దాని పుర్రెను నాయకమణిగఁ జేయవలెనని యాయన యుద్యమించెను. కాని యొకరి సాహాయ్య మేమియు లేకయె యీ వ్యాఘ్రమును బరిమార్చుట కీర్తిదాయక మని యెంచి, తనతోఁ గూడ సర్దారు లెవ్వరును రావలదని రంగరాజుగారు ఖచితముగ నుత్తరువు లొసఁగిరి. తుదకు గుజ్జుపుకాసుదారు నయిననాయన వెంటఁ గొనిపోక వెడలెను.

రంగరాజుగారు ప్రయాణముఁ జేసిచేసియెచ్చటను పులినిగానరైరి. ఐనను తానుబూనిన కార్యమును నెరవేర్పకయె పురప్రవేశము చేయుట పరాభవ మని నమ్మి, యాయన యింకను కొండలలోను నడవులలోను దిరుగుచుండెను. ఇట్లు వెదకి వెదకి, తుద కొక చిన్న జలాశయమునొద్ద నిద్దురపోవుచున్న గొప్పపులి నొకదానిని జూచెను. అది చూచినతోడనే తనకోరికలన్నియు నెరవేరినవానివలె నాయన యుత్సాహము నొంది, కాలయాపనము చేసినచో నదిదాఁటిపోవునేమో యను వెరపుతో, మెల్లమెల్లఁగ నొక చెట్టుచాటునకు నడచిపోయి, గురిచూచుకొని, వ్యాఘ్రముకంటిలోనికిఁ జొచ్చునట్టుగఁ దుపాకితోఁ బెద్దరవ్వను గొట్టెను. అధికాగ్రహముతో నిద్దుర విడిచి యాపులి, ఒకసారిగ వానిదగ్గరకు దుమికి, వానికంఠమునందు తన పంజాను వైచెను! ఇది యంతయు జరుగుట కైదు నిమేషములకంటె నెక్కువకాలము పట్టలేదు! పాపము తనగతి యిటులగునని రాజెంత మాత్రమును దలంపలేదు. రెండవసారి తుపాకిని బేల్చుటకయిన నతఁడు సిద్ధపడియుండలేదు. వ్యాఘ్రమును ఖండించుటకయి యొరలోనున్న ఖడ్గము నైనను దీయుట కాయనకు వ్యవధి లేకుండెను. తన పరిచారకుల నెవ్వనినైనను గొనిరానందున కతనికప్పుడు పరితాపము కలిగెను. మహా పరాక్రమవంతుఁడయిన యాప్రభువు, వ్యాఘ్రము వలన ఘోరమరణము నొందవలసివచ్చుట మిగుల దుఃఖకరముగ నుండెను!

వ్యాఘ్ర మామనుజుని కంఠమును బట్టుకొని, నోరు తెఱచి, తన వాడి దంష్ట్రములను వానికుత్తుకమీఁద నాటింపబూనుచుండఁగా, చెట్టుమీఁదనుండి యెవరో నేల కొకసారిగ దుమికినట్లు గానవచ్చెను! ఇట్లు దుమికినవారు, తన కుడిచేతిని పులిముఖము వైపునకుఁ ద్రిప్పినట్టుగ రాజునకుఁ దోఁచెను. వారెవరో యని చూచుటకుఁ దలద్రిప్పునరికి, ఆయుధ మేమియుఁ బూనక కంకణములతో శోభించు నొక స్త్రీ

యొక్క కోమలహస్తము గానఁబడెను! తాను మృత్యువునోటఁ జొచ్చుచున్నను, పరోపకారచింతయె సహజభూషణముగఁ గల యా క్షత్రియవీరుఁడు, " వలదు, వలదు! " అని యామెను చేతితో వెనుకకు మరలింపఁబూనెను. కాని యావనిత, వానిని లెక్కసేయక, ధగధగ వజ్రమువలె మెఱయుచున్న తెల్లనిమచ్చగల యావ్యాఘ్రము నుదుట నేవో కొన్నిగింజలు చల్లెను. వెంటనె, వ్యాఘ్రమును, దాని కోరలును, గోళ్ళును గానరాక, ఒక బ్రాహ్మణుఁడు రాజును జేతితో బట్టుకొని, నోరుతెఱచి వానిని వెక్కిరించునట్టుగఁ గానవచ్చెను! ఇది యంతయుఁ గలవలె రాజునకుఁ దోఁచెను! చెట్టు దిగివచ్చి, తన్ను మృత్యువువాఁతనుండి తప్పించి, వ్యాఘ్రమును మనుష్యునిగ మార్చి వేసిన యాస్త్రీ, వనదేవతయని భావించి రాజప్పుడు తనఖడ్గమును తుపాకిని నేలఁబడవైచి. భక్తిప్రమోదములు కన్నీటిరూపమున బయలువెడలఁగా, ఆమెపాదముల మీఁదఁబడి "తల్లీ! భవానీ! పాపాత్ముఁడనైనను, నాయందు నీకపారప్రేమగలిగి స్వర్గలోకమునుండి నన్నుఁ గాపాడుటకై వచ్చితివి! నాప్రాణములు నీవిచ్చినవే! కావున నిన్ను సంతుష్టిపఱచుటకు ముఖ్యసాధన మేదో నాకుసెలవిచ్చి, కొంతవఱకు నాకృతజ్ఞతాభారమును దొలఁగింపకుందువేని, యాఖడ్గముతోనె నేను బొడుచుకొని ప్రాణములు విడిచెద" ననిపలికెను!

తానుదేవకన్యక గాక బ్రాహ్మణస్త్రీయె యనియును, ఇదివఱకుఁ బులియాకారమునుబూని యిపుడు మనుష్యరూపమునుదాల్చిన పురుషుఁడు తనభర్తయె యనియును, మహాలక్ష్మి పలికెను! కాని, తన్నింకను మాయలోఁ బడవేయవలెనని యీదేవత యత్నించుచున్నదని రాజు తలపోసెను. మహాలక్ష్మియును మిక్కిలి యాశ్చర్యము నొందెను. ఆమెకుఁ గలిగిన సంతోషమునకు మితిలేదు. కాని, యా ముగ్వురిలోను సంతోషములేకుండినది బ్రాహ్మణపురుషుఁడె. ఇదిచూచి, తన భర్త యింకను వ్యాఘ్రరూపమునే దాల్చి, రక్తపానము చేయు

చుండ వలెనను కోరిక గలిగి యున్నాఁడని పాపము మహాలక్ష్మి యెంచి, ఆశ్చర్యము నొందుచున్న భర్తమీఁదఁ బలుమాఱులు విసరుచు వచ్చెను! ప్రకాశముగారు మాత్రము, తా నీయడవిలోని కేలవచ్చితిననియును, రాజును బట్టుకొనియుండు టేలతటస్థించినదని యును, ఆశ్చర్యపడసాగిరి! అంత భార్యచెప్పిన మాటల వలన, పులిరూపమును దాల్పవలయు నను కోరికతోఁ దాను వెనుక మంత్ర మును జపించుటయు, భార్య యటకెక్కుటయు ఆయన స్మరణకుఁ దెచ్చుకొనెను. కాని యది మొదలిప్పటివఱకును, తాను వ్యాఘ్ర రూపమున నున్న దినములలో జరిగిన సంగతులు మాత్రము వాని కేమియుఁ దెలియవు!

ఇఁకఁ దనకుఁ గృతజ్ఞతాపూర్వకమగు వందనములు సమర్పిం చుటయందు తనివితీరని రాజునుజూచి, మహాలక్ష్మి "అన్నయ్యగారూ! మీచెల్లెలి నింతఁగా మీరు భూషింపనక్కఱలేదు. ఎవరికార్యార్థము వారు వచ్చిరే గాని, వేఱుగాదు. మీరే రానిచో, నేను జెట్టుదిగి, పులిముఖముమీఁదఁ బడునట్టుగ నడలు వేయుటయుఁ దటస్థింపదు— అదిగాక, నేను జెట్టుదిగి వేగమె రానియెడల, పులినిమ్ము సంహరించి. తిరిగి యడవులకు వెడలిపోవును. లేదా ఖడ్గముతో మీరు దానిని ఖండించివేసియెయుందురు. కావున నిచట నా మంచితన మేమియుఁ గానరాదు! మీరె, నాకుసోదరునివలె సాయము చేసితిరి!" అనిపలికెను.

ఆనందరంగరాజుగారు నాఁటనుండియు మహాలక్ష్మియందు సో దరభావము గలిగి, ఆమె భర్తకు గొప్ప యుద్యోగమును దన కొలు వులో నిచ్చి, ఆమెకీర్తి యాచంద్రార్కముగ నుండునట్టుగ, మహా లక్ష్మీపురమును గట్టించి, అది పేద బ్రాహ్మణుల కొసఁగిరి. ఈ రాజుగారిచ్చిన మాన్యములే కొన్ని మహాలక్ష్మీపురమున నేఁటివఱకును మచ్చపులి వారికి జరుగుచున్నవి. మచ్చపులివారి మహాలక్ష్మీపుర

ములోఁ దమకు మాన్యము లున్నను, అక్కడ స్థిరముగ నుండక, మొదటి ప్రదేశమునందే కాపుర ముండిరి.

నిశ్చల.

రెయిలు ప్రయాణమును సంసార యాత్రకు సాదృశ్యముగఁ జెప్పవచ్చును. ఇహలోకజీవనమునవలెనే ధూమశకటమునను, మనకుఁ దలంపని స్నేహలాభములు గలుగును; నిర్హేతుకమగు విరోధములు ఉత్పన్నములగును, అద్భుత జనకమగు పరిస్థితు లప్పటి కప్పుడు తటస్థించును. వాని ప్రేరణముచేత మనుజుల స్వభావాదులు చిత్రరీతులఁ బ్రకటీకృత మగుచుండును. రోషముతోఁ గనలుచుండువారును, ఆనందమున నోలలాడు వారును, శకటము వారు వారు దిగు ప్రదేశము చేరినతోడనే, మృత్యువాసన్నమగు నప్పటివలెనే ఒకరితో నొకరింకొక మాటయైననాడుకొన వలనుపడక, తమ తమ తావులను హఠాత్తుగ విడిచి పోవుచున్నారు!

ఇప్పటికి సుమారు పదునైదు సంవత్సరముల క్రిందట నే నొక పర్యాయము రెయిలు ప్రయాణము చేయుచుంటిని. నేను గూర్చుండి యుండు పెట్టెలో నొక యాంగ్లోయిండియను పెద్దమనుష్యుఁడుండెను. చెంతనే బల్లమీఁద నతని భార్యపండుకొని మూలుగుచుండెను. ఆమె యేదో తీవ్రమగు వ్యాధిచేఁ బీడితయైనట్టు గానఁబడెను. వయస్సు ఇరువది సంవత్సరములకంటె నధికముగ లేకున్నను, ఆమె స్థూలకాయము గలిగియుండెను. పండుకొనినను గూర్చుండినను ఆమె యాయాసమున మార్పు లేదు. ఆమె వ్యాధిని గుఱించి తెలియఁ గోరియు,

పనిలేని ప్రసంగము లేల యని నేను మిన్నకయుంటిని. ఆంగ్లేయ విద్యామహిమముకూడ నా మౌనమునకుఁ గొంత కారణము. ఆపురుషుఁడును, నాతో మాటాడ నుద్యమించియు, స్వజాతి సహజమైన మితభాషిత్వమునఁ గాఁబోలు నూరక యుండెను. కాని తెచ్చిపెట్టుకొనిన బంధములు నిరతము హృదయమును బిగియఁగట్టఁ జాలవు. ఆలేమ యాక్రందనధ్వనులంతకంత కధిక మయ్యెను. ఇంక నేనూపిరి బిగబట్టలేక, 'అయ్యా!' యనియాతనిని సంబోధించితిని. కష్టదశనుండిన యా పురుషుఁడంత నన్ను సమీపించి, 'సోదరా! ఏమి చెప్పుదును? నా భార్యకు సంభవించిన జలోదరరోగమును నివారించుటకై లెక్కలేని ప్రయత్నములుచేసితిని. తుదకు చెన్నపురి యందలి పెద్దయాసుపత్రికిఁగూడఁ దీసికొనిపోతిని. ఈ పయనము అక్కడనుండి తిరిగి వచ్చుటయే!' యని పలికెను.

"రోగము మొదలంట పోకపోయినను, తాత్కాలికమగు నుపశాంతియైనఁ గలుగలేదా?" యని నేనడుగఁగా, "అచ్చటి గొప్ప వైద్యులు మూఁడు నాలుగు పర్యాయము లామె యుదరమునందలి నీరు గొట్టములోఁ దోడఁగించి యప్పటికిఁ గొంతబాధ మాన్పినను జలము మరల మరల నూరుచుండెను దీనికిఁ దోడుగా, రోగికి గర్భసంబంధమగు రోగమేదియో యుండితీరవలెననియును, కాని యామెకుగర్భచిహ్నములు గానవచ్చుటచేత ఆవ్యాధిని గుఱించి యిపుడు తలంపఁగూడ దనియును వారి యభిప్రాయము. ఇటీవల ముఖము మీఁద నీరు గానఁబడునట్లు తోఁచెను. కాన, లోన నంజుకూడఁ బ్రవేశించి యుండవచ్చును. ఈపరిస్థితులందు రోగిని స్వస్థానమునఁ జేర్చుటయే యుక్తమని వైద్యులు చెప్పుటచేత, విఫలమనోరథులమై యింటికిఁ బోవుచున్నా" మని యాయనపలికెను. ఒకనిమేషములోనె, నాదగ్గఱి బంధువులలో నెవరికో యొకరి కీవ్యాధి గలిగినట్లుగ నేను బరితపింప సాగితిని. నేనెఱిఁగిన భిషగ్వరులను గుఱించి తలపోయఁ

దొడంగితిని. 'ఆయుర్వేద వైద్యముచేయించితిరా!' యని నేను మాట వరుసకడిగితినేగాని, శస్త్రవైద్యానిపుణులు చేయనేరని కార్యము దేశీయవైద్యులు సాధింపఁ గలరని నాతలంపు కాదు. ఇటులా బండిలో నొక బల్లమీఁద రోగి బాధతోఁ బండుకొని యుండెను. ఏమి చేయుటకును దోఁపక, రెండవ బల్లమీఁద మే మిరువురమును గూర్చుండి యుంటిమి.

* * * *

ఇంతలో బండి యొక స్టేషనుకు వచ్చి యాఁగి, తిరిగి బయలు దేరుచుండెను. అప్పుడొక బైరాగి మేము కూర్చుండు బండి తలుపు తెఱచి, లోనికిరానుద్యమించెను. 'ఒరేపోరా యిక్కడ చోటులేదు!' అని కసరి యాంగ్లోయిండియను తలుపుచీల బిగించెను. కాని యా బాటసారి, 'బండి కదలిపోవు చున్నది. నేనొక్కఁడనే!' యని హీందీతోఁ బలుకఁగా, నాకు జాలిపుట్టి, తలుపు తీసితిని. 'బాబా నీకు జయము జయము!' అను మంగళాశీర్వచనములతో బావాజీబండి లోని కెక్కెను. వేవేగముగ నిపుడు బండిపోసాగెను.

బైరాగి యొకమూల గూర్చుండెను. మే మిరువురమును వెనుకటివలెనే రోగిని గుఱించి ప్రసంగించు చుంటిమి. తొలఁగింపరాని బాధకులోనైన యాస్త్రీకంఠమునుండి వెడలు విరామములేని మూలుగునుండి తప్పించుకొనుటకా యనునట్లు మా ధ్యానమంతయు మాటలలోనె మగ్నమైయుండెను. అంతకంత కాస్త్రీమూలుగు హెచ్చెను. మూల ముసుఁగు పెట్టుకొని యుండు బైరాగి యాకారమున నిపుడు కొంతచలనము కలిగెను. అతఁడు బండిలోనికి వచ్చినప్పటి నుండియు నొకకన్ను రోగిమీఁదనే పెట్టియుండెను. ఇపుడాతఁడు తనమూటలోఁ జెయిపెట్టి యొక చిన్న వెదురుగొట్టమును దీసి, దానిలోని చూర్ణమునుతీసి మూఁడు పొట్లములు గట్టి, "రామభగవాన్!" యని యుచ్చరించి, వానినారోగి భర్తచేతనుంచి, యొకటి వెంటనే యామెకు వేయు

మని కోరెను. ఇట్టికూరగాయ వైద్యములవలన లాభము గలుగదని నాకుఁ దెలియును, ఆంగ్లో యిండియనుగూడా నదే విధముగఁ దలంచి ‚‚ఇట్టి మందులు మనబోటి విద్యాధికులు వాడిన యెడల, బూటకపు వైద్యులకుఁ బ్రోత్సాహము గలిగించిన వారమగుదుము. ఈమూఁడు పొట్లములును వాని ముఖముననే వేసెదను. కాదు కాదు. కిటికీనుండి పారవైచెదను!'' అని యతఁడు పలికి, అట్లు చేయఁజూచుచుండగా, నేను వలదని వారించి, ‚‚మిత్రుఁడా! ఆంగ్లేయవైద్యులు ఘనులే; కాని వారికిమాత్రము సత్యమూమూలాగ్రముగఁ దెలిసెనా? వారు చేయి వదలిన రోగులు హిందూవైద్యుల చికిత్సలచే స్వస్థపడినవారి నెందఱినో నే నెఱుఁగుదును. ఒక్కొక్కప్పు డిట్టి గోసాయి ప్రక్రియలవలన మంచిలాభము గలుగునని చెప్పుదురు. వైద్యవిషయమున నొక దైవమునే నమ్మియుండుట శ్రేయముగాదు ! అని నేను జెప్పితిని. ‚‚ ఉపయోగింప వచ్చునని మీరు చెప్పిననే యీ మందిచ్చెదను! '' అని కొంతవఱకు మెత్తపడి యాంగ్లోయిండియను పలుఁకగా, ఈయవచ్చునని నేనంటిని. అపుడా బైరాగి తనచేతులతోనె యాపొట్లములోని పొడిని మంచినీట నామెచేఁ ద్రావించెను.

ఔషధసేవచేసి, రోగిపండుకొని వెనుకటివలెనే మూలుగుచుండెను. మామాటలధోరణిని మేముంటిమి. బైరాగి, కనులు మూసికొని మూలఁగూర్చుండి, అప్పుడప్పుడు దృష్టిని రోగివైపునకు సాగించుచు, రామభగవానుని స్మరించుచుండెను. ఒక యరగంటలో మూలుగు క్రమ క్రమముగ తగ్గి రోగి నిదురింపసాగెను. ఈ సంగతి కనిపెట్టుఁడని లేచివచ్చి మాకు బైరాగి కనుసైగ చేసెను. కొన్నాళ్ళనుండి తన భార్య నిద్దురను నది యెఱుఁగదని చెప్పి, యీపాటి సాహాయ్యమునకైనఁ దాను బైరాగికిఁ గృతజ్ఞుఁడనని యాంగ్లోయిండియను పలికెను. ‚‚ ఇంకను జూడుఁడ! '' ని బైరాగిపలికి, తనచోటఁ దిరిగి కూర్చుండెను.

రోగికి గాఢముగు నిద్దురపట్టెను. నిద్రాభంగము గలుగునను భయముచే మే మిరువురము మెల్లమెల్లఁగ ముచ్చటింపఁ దొడంగితిమి. రోగమును సమూలముగఁ దొలఁగింప లేకున్నను, కొంత యుపశమనమును గావించి, నిద్రపట్టింపఁగల యిట్టిమందు గానఁబడుట యదృష్టమే యని మేము సిద్ధాంతపఱుచుకొంటిమి. ఈమందు పొట్లము లింకఁగొన్ని యిచ్చిన పుణ్యము గట్టుకొమ్మని బైరాగిని మేము వేడితిమి. తానడిగిన సొమ్మిచ్చెదమంటిమి. ఐనను, ,,అవసరములేదు బాబా ! ,, అని యొకమాటమీఁదనే బైరాగియుండెను. ఇంక వాని నొప్పింపలేమని మేమూరకుంటిమి.

రెండుగంటలసేపు రోగి యిట్లుగాఢసుషుప్తి ననుభవించి కనులు దెఱచెను. ఎటులున్నదని భర్తయడుగఁగా, బాధ కొంతశమించెనని పలికి, యాస్త్రీ బైరాగికిమ్రొక్కెను. బైరాగిమాత్రము తాను గూర్చుండియుండు మూలనుండి కదలక, ,, రామభగవాన్! రామభగవాన్! ,, అని మాత్ర ముచ్చరించెను.

ఇంతలో వాల్తేరుస్టేషను వచ్చెను. తన మూటపట్టుకొని బైరాగి దిగెను. ఆంగ్లోయిండియనుకూడ భార్యను మెల్లఁగ బండిదింపించి, ,,దైవానుగ్రహమున నాభార్య కీమందువలనఁ గొంతయుపశమనము గలుగవచ్చునని తలంచెదను. ఇక్కడనే దిగియున్నాఁడుగాన బైరాగిని నేను మరల ముట్టడించి, నాకింకను సాహాయ్యము చేయుమని కోరెదను. ,, అని పలికి వెడలిపోయెను.

*   *   *   *   *

విజయనగరమునఁ గొన్నిపనులు చూచుకొని యొకవారమునకు నేను దిరిగి వెనుకకు రైలుప్రయాణము చేసితిని. నాకార్యాలోచనములందె మగ్నమైన మనసు గలవాఁడనగుటచేత, బండి వాల్తేరుస్టేషనుకు వచ్చియుండుటయె నేపరికింపలేను. ఇఁక బండి కదలుననఁగా వెనుకటి యాంగ్లోయిండియను ముఖము నాకుఁ గానిపించెను. ,, మీ

భార్యసమాచారమే ” మని నేనడుగఁగా, చిఱునవ్వుతో నాతఁడు ,,సోదరా! నే నేమని చెప్పుదును? ఆబైరాగియందు మూఁడుపూటలు మాత్రమె నాభార్యపుచ్చుకొనెను. వెనుకటి నీరంతయు మటుమాయ మయ్యెను. బాధయంతయు శమించెను. విశాఖపట్టణమున ముసాఫరుల సత్రములో దిగియున్న యాబైరాగిని నేను మాబసకుఁ గొనిపోయి, రోగినిజూపించితిని. అతఁడు ,,రామభగవాన్!” అనితనసంతోషమును దెలియఁజేసెను. ఇంకనుగొంతమందిచ్చి, నాభార్యకుఁబరిపూర్ణ దేహస్వాస్థ్యమునుబ్రసాదింపుఁడని నేనెంత వేడినను బైరాగిమాత్రే మాషధమీయక, రామభగవానుని దయవలెనే యీయౌషధసేవకూడ నొకపరియె చాలునని చెప్పెను. వాకిటనుండు నొక చిన్న చెట్టుదగ్గఱకు బైరాగిపోయి, కుళ్ళినయాకొకటి కోసి తెచ్చి, ,, ఇదేరీతిని, ఆకోమలి శరీరమునుండి వ్యాధియనుజీర్ణపర్ణము త్రుంపివేయఁబడినది. రామభగవానుని దయచేత ఫలపుష్పాదులతో నీకొమ్మ వర్ధిలఁగలదు!” అనిపలికి, దీవించి, వెడలిపోయెను. ,, దీనికంతకును గారకులగు మీ కెంతయో కృతజ్ఞుఁడను! ” అని యాయన పలికి, ఆదినమచటనుండి, తన యాతిథ్యమందుకొనుమని కోరెనుగాని, తొందర పనుల వలన నేనచట దిగలేదు.

*　　　*　　　*　　　*　　　*

పైసంగతి జరిగి చాలకాలమైనది. స్నేహితులగు వైద్యుల వద్ద నే నప్పుడప్పు డీసంగతి ప్రస్తావింపఁగా, వారు దానినిగుఱించి తగిన సమాధాన మీయలేకపోయిరి. ఇంత త్వరగా గుణమీయఁగలుగు యౌషధ ముండుటయె యసంభవమని యాంగ్లేయవైద్యులు వక్కాణించి, బహుశః, మాముగ్గురి నాబైరాగి కనుకట్టుకట్టి మోసగించియుండునని పరిహసించిరి! ఒకవేళ నిదియంతయు నాకెప్పుడో కలిగిన వట్టి కలయేమో యని కొందఱు సంశయించిరి ! ఆయుర్వేద వైద్యులన్నానో, నామాటలు విని పుస్తకములు తిరుగవేసి, కొన్ని

ప్రక్రియలున్నను, ఇంత వేగముగఁ బనిచేయు మందు కానరాదని పలికిరి. ఇంకఁ గొందఱీమందు తామ్రభస్మమై యుండునని యూహించిరి. కాని దానిరంగు మొదలగువానిని గుఱించి వారు వేసిన ప్రశ్నలకు నేను దగు సమాధాన మీయఁజాలకుంటిని. ఆ యాంగ్లోయిండియను పేరుగాని, ఉద్యోగముగాని నాకుఁదెలియదు. బైరాగి తిరిగి నాకన్నులకగపడలేదు. కావుననే నాఁడు రైలులోఁజూచిన మందును గుఱించి నేను బూర్తిగ విమర్శింపలేకుంటిని.

* * * * *

ఇటులుండఁగా గతసంవత్సరము నేను చెన్నపురికి కార్యాంతరమునఁ బోవుట సంభవించెను. పీపిల్సుపార్కులో నేను దిరుగుచుండఁగా, నాకుఁ గొందఱు మనుష్యు లెదురైరి. వారిలో నొకని వైపునకు నేనును, నా దెస కాతఁడును, ఒకరి నొకరు దాటిపోవు వఱకును తేఱిపాఱఁజూచితిమి. కాని, యొకరి నొకరము గుర్తుపట్టలేక పోతిమి. అంతఁ గొంత దూరము ముందుకుఁ బోయిన యాతఁడు తిరిగి వెనుకకువచ్చి, „అయ్యా!" యని నన్ను సంబోధించెను. నే నాయన కడ కేఁగి, సంభాషించితిని. ఈతఁడే నాఁడు రైలులో రోగియగు భార్యను ప్రయాణముచేయించిన పురుషుఁడు. తనభార్యకిపుడు పరిపూర్ణారోగ్యము గలిగి యున్నదనియు, పలుమాఱు తమ గృహమున నా మాట నింకను జెప్పుకొనుచుందుమనియు, ఆయన చెప్పి నన్నుఁ దమ బసకు రమ్మని మిక్కిలి కోరెను. నేను వల్లెయంటిని.

* * * * *

చెన్నపురి పూనమల్లెరస్తా కుత్తరపు దిశనొక చిన్నబంగాళా కలదు. దానికంటియుండు తోటలోని చిన్నకోనేటి యొడ్డున పూలమొక్కలు వేయఁబడి యుండుటచేత, నా ప్రదేశము దర్శనీయముగ నుండును. మఱునాఁటి సాయంకాలము నాలుగుగంటలకు నామిత్రుని యింటికచటికిఁ బోతిని. ఆయన పేరు జాను. అతఁడురైల్వేలో నొక

గొప్పయుద్యోగి. భార్యపేరు వయొలెటు. వీరికిపుడిద్దఱు పిల్లలుగలరు. బాల వయస్సు పదినాలుగు వత్సరములు. బాలునికి పదియేండ్లు-యౌవనమున వ్యాధిపీడితయగు వయొలెటుకాంత యిపుడారోగ్య లావణ్యములతో సొబగొందుచుండెను. సంతోష సంభాషణములతో మే మా సాయంకాలముఁ గడపితిమి. నాఁడా బావాజి యొసఁగిన యౌషధము దివ్యమైనదనియు, ఆమూఁడు పొట్లములతోఁ దనకు రోగము నిశ్శేషమయ్యెననియు, కొలఁది మాసములకే సుఖప్రసవమైతి ననియు వయొలెటుచెప్పెను. అపుడు జనియించిన శిశువిదియే యని యౌవనిత, „నిశ్చలా" యని పిలిచి, తన కొమార్తెను నాకుఁ జూపించెను. క్రైస్తవయూరపియను సంప్రదాయము గలవారింటిబాలిక కీ హిందూనామ మేలవచ్చినదని నేనాశ్చర్యపడితిని. ఆ బావాజీ పేరు నిశ్చలదాసని వారు విని, ఆయన యనుగ్రహము వలన దేహస్వాస్థ్య మును, సుఖప్రసవమును, వయొలెటు గాంచెను కావున, తమకృతజ్ఞత కొక్కింతచిహ్నముగాఁ దమ పుత్రిక కీపేరిడితిమని వారు చెప్పిరి! ఈ హిందూనామ మిడుటచేత, తమ వారిలో ననేకులు తమ్మును ౦రిహసించి నిరసించినను, నిశ్చలయను పేరు తమ కెంతో ప్రియమైన ని వారు పలికి౯. ఇంతటితోను గురుసమానుఁడగు బావాజీయెడల ౼రికి కృతజ్ఞత తీరక, ఆయన కిష్టదైవమగు రాముని పేరు తమకుఁ మ్మటఁ గలిగిన కుమారునికిఁ బెట్టితిమనికూడ వారు చెప్పిరి.

జాను వయొలెటులను నే నెంతో యభినందించితిని. వారు ౹నులు. బావాజీయెడ వారెంతో భక్తివిశ్వాసములతో నుందుమని ౼ను, అప్పుడప్పుడు దేశాటనము చేయుచుండు నాతఁడు వారికిఁ ౼పించుచుండుననియును వారుచెప్పిరి. తమకుఁజేసిన మహోపకార న కాయన లేశమాత్రము ప్రతికృతి స్వీకరింపకుండుట చూడఁగా మన మహానుభావుఁడన్ని వారికి బోధపడెను. ఆయన సౌహార్ద ౼ు గుఱించి తలపోయునపుడు తమ హృదయముల నుప్పొంగు

సంతోష కృతజ్ఞతల కింకొక సూచనగా దంపతులు కొన్ని నియమములు చేసికొంటిమని కూడ నాకుఁ జెప్పిరి. వయొలెటు రోగనివారణమైనప్పటినుండియు మాంసాహారమును వర్జించెను. జానుమాత్రమంతదూరము సాగి పోలేకుండినను, సత్పథము వీడక ఋజువర్తనమున మెలంగును. హిందూమతధర్మములందును, వారి గురువులందును వారిరువురికి నెంతో గౌరవము పూజనీయులగు బైరాగులకు వారు సౌకర్యము లొనర్చుచుందురు. తమ పిల్లలకు క్రైస్తవ మత నేర్పుటకే కాక, హిందూగ్రంథములు పఠించుటకు వలసిన సౌకర్యములు గూడఁ గలిగింతురఁట! ఒక వేల? తామదివఱకు గొప్పవారమనియు, హిందువులు మోటువారనియును విశ్వసించు తామిపుడు హిందువులను భ్రాతృసమానులగఁ జూచి ప్రేమింతుమనివారు చెప్పినపుడు, నాకుఁగంటనీరు గ్రమ్మెను. నేను బోయివచ్చెదనని చెప్పినపుడు. ఆదంపతులు, నన్నుసోదరునిగ భావించుకొనుచున్నామనిపలికి, ఆనంద బాష్పములతో నాకు వీడ్కోలొసంగిరి. "రాము" తాను లిఖించిన గాంధి చిత్రపటమును నాకుఁ గానుకగ నిచ్చెను. కాని నిశ్చల యొసంగిన బహుమతియె నాకెంతో హర్షదాయకమయ్యెను. పుష్పకోమలమగు తన మృదుహస్తములతోఁ దాను జుట్టిన పూలహారమును నామెడలో వేసి, యాబాల, ముద్దులు మూటఁగట్టు నొక చిన్న స్వదేశి రుమాల నాకిచ్చెను. దాని నలువైపులను, "హిందూ క్రైస్తవాది భారత పుత్రులెల్లరు సోదరులు" అను నక్షరములు రంగు నూళ్ళతో దర్శనీయముగ నీబాలకుట్టెను! సన్నిని యా నూలామె చిన్ని వేళ్ళతో వడికినదే!

* * *

ఆ రాత్రి నిండువెన్నెలలో నింటికి వచ్చునపుడు, "నేడు జరిగినదంతయు నిజమా! లేక దీనిలో కనుకట్టేమయిన నుండునా?" యని నేను బలుమా రాశ్చర్యపడితిని. నిశ్చల యొసంగిన రంగు రుమాలను నేను ప్రాణపదముగ దాచియుంచినాను!

వేమన గ్రంథాలయం,
... ప్రోలు :: కృష్ణా ...

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA188B152
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	159
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	119, 120
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	Nandini
స్కాన్ చేసినది	Haseena
పరీక్ష చేసినది	RAMYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good